www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 7
బుధవారం | 23-4-2025
శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: దశమి సా.4:44 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ధనిష్ఠ మ.12:07 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.6:55-8:26, దుర్ముహూర్తం: ఉ.11:48-12:38, అమృతఘడియలు: తె.4:00-5:31, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:57 సూర్యాస్తమయం: 6:29
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

● భార్య కళ్ల ముందే...

భర్త మృతదేహం చెంతన భార్య; దూరంగా మరో మృతదేహం (వృత్తంలో)



కశ్మీర్‌లో నెత్తుటేర్లు

ఉగ్రవాదుల నరమేధం.. పర్యాటకులపై కాల్పులు

26 మంది కాల్చివేత

20 మందికి తీవ్ర గాయాలు

- మృతుల్లో ఇద్దరు విదేశీయులు, ఇద్దరు స్థానికులు
- హైదరాబాద్‌కు చెందిన మనీశ్ రంజన్ మృతి
- మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్‌లో దారుణ ఘటన
- సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు
- పర్యాటకుల పేర్లు అడిగి మరీ కాల్పులు
- మైదానం కావడంతో తప్పించుకోవడానికీ వీల్లేక తుపాకీ గుళ్లకు బలైన పర్యాటకులు
- ఉగ్రదాడి తమ పనేనన్న టీఆర్ఎఫ్.. ఇది లష్కరే తాయిబా నుంచి ఉద్భవించిన ఉగ్ర సంస్థ

పహల్గాం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: కశ్మీరు లోయలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో మంగళవారం పచ్చికబయళ్లలో తిరుగుతూ ప్రకృతి అందాలను చూసి పరవశిస్తున్న పర్యాటకులపై హఠాత్తుగా దాడికి తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసారన్ ప్రాంతంలోని కొండల మధ్యనున్న మైదాన ప్రాంతంలో పర్యటిస్తున్న వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పచ్చని కొండల్లో నెత్తుటేర్లు పారించారు. ముష్కరుల దాడిలో

మిగతా 11వ పేజీలో...



ఆప్తులను కోల్పోయిన దుఃఖంలో ఓ బాధితురాలి శోకం

ఆ ఉగ్రమూకను వదిలిపెట్టం: మోదీ.. సౌదీ నుంచి వెనక్కి

హుటాహుటిన శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా

మతం అడిగి మరీ మారణకాండ



దాడి జరిగిన ప్రాంతానికి తరలివస్తున్న బలగాలు

- ఖురాన్ సూక్తులు చెప్పించి ముస్లింలు కాదని నిర్ధారించుకుని మరీ కాల్చివేత
- హిందువులు, పురుషులే లక్ష్యంగా ఉగ్రవాదుల దాడి
- హనీమూన్ జంట.. భార్య కళ్లముందే భర్త కాల్చివేత
- మరో ఘటనలో కుమార్తె ఎదుట తండ్రి హతం

11

పీఎస్సార్ అరెస్టు

జత్వానీ కేసులో 'ఏ2'కు సీఐడీ ఝలక్

- హైదరాబాద్‌లో వియ్యంకుడి ఇంట్లో ఉండగా అదుపులోకి
- ఫామ్‌హౌస్‌లో సోదాలు.. పలు పత్రాలు స్వాధీనం
- అరెస్టుచేసి బెజవాడకు తరలింపు
- సీఐడీ కార్యాలయంలో విచారణ
- నేటి ఉదయం కోర్టులో హాజరు

హతవిధీ!

- వైఎస్ మేళ్లకు నాడు ఐఏఎస్‌లు..
- జగన్ దెబ్బకు నేడు ఐపీఎస్‌లు జైలుకు
- కేసుల్లో మరికొందరు బ్యూరోక్రాట్లు..
- జత్వానీ కేసులో ఏకంగా ముగ్గురు ఐపీఎస్‌లు చిక్కుకున్న వైనం

అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జత్వానీ అక్రమ అరెస్టు.. ఆమె కుటుంబ సభ్యులకు వేధింపులు, బెదిరింపుల కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారులు పీఎస్సార్, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలపై ఇప్పటికే సస్పెన్షన్ వేటుపడింది. కాంతి రాణా, విశాల్ గున్నీ హైకోర్టును ఆశ్రయించి అరెస్టు నుంచి రక్షణ పొందారు. ఈ కేసులో ఏ2గా ఉన్న పీఎస్సార్ మాత్రం, 'డీజీ స్థాయిలో ఉన్న నన్ను ఎవరూ టచ్ చేయలేరు' అన్నట్లుగా ధీమాగా ఉండిపోయారు. కానీ... సీఐడీ అధికారులు అనూహ్యంగా ఝలక్ ఇచ్చారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేశారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం... హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ మండలం అమడాపూర్‌లో

మిగతా 13వ పేజీలో...



'నిందితుడు' పీఎస్సార్‌ను పోలీసులు చాలా మర్యాదగా చూసుకున్నారు. కారులో ఫ్రంట్ సీటులో కూర్చోబెట్టారు. ఆయన టిప్‌టాప్‌గా తయారై... 'అధికార దర్పం'తో ఏసీబీ కార్యాలయంలోకి వెళ్తున్న దృశ్యమిది!

ఐపీఎస్ కాదు.. 'వైపీఎస్'!

- ఐపీసీని కాదని వైసీపీకి 'సెల్యూట్'
- జగన్‌కు వీర విధేయుడిగా పీఎస్సార్
- ఐదేళ్లలో 4 పోస్టులు.. టీడీపీ నేతలే టార్గెట్
- సినీ నటిని వేధించడంలో కీలక పాత్ర
- వెంటాడిన నాటి పాపాలు.. చివరికి అరెస్టు

నాకేం సంబంధం?.. కాదంబరి 'బ్యాడ్ లేడీ'

సీఐడీ 5 గంటలు ప్రశ్నించినా పీఎస్సార్ అదే మాట

జగన్ చెప్పారు.. నేను చేశాను!

ముడుపుల డబ్బులు జగన్ ఓఎస్డీకే ఇచ్చాం

లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డి అంగీకారం!

- పార్టీ ఫండ్ బాగా వచ్చేలా 'మద్యం పాలసీ' రూపొందించాలని జగన్ సూచించారు
- విజయసాయి నివాసంలోనే 'ముడుపుల స్కీమ్'
- మిథున్, సజ్జల శ్రీధర్ రెడ్డి, సత్యప్రసాద్‌తో భేటీ
- మరో భేటీలో వాసుదేవరెడ్డితో కలిసి కమీషన్లు ఫిక్స్
- ఉత్పత్తి-సరఫరా వాసుదేవరెడ్డి కంట్రోల్‌లోనే!
- సీ-టెల్ సాఫ్ట్‌వేర్‌తో మా పథకం పారదు
- అందుకే దానిని తీసేసి.. మాన్యువల్‌గా 'సరఫరా'
- ముడుపులిచ్చే కంపెనీలకే ఆర్డర్లు.. లేదంటే లేదు
- ప్రతినెలా ఐదో తేదీన 'కమీషన్ల' లెక్కలు
- దోపిడీ 3,200 కోట్లు.. రిమాండ్ రిపోర్టులో వెల్లడి

కసిరెడ్డికి రిమాండ్.. విజయవాడ జైలుకు తరలింపు



ఏ4 ఎంపీ విథున్‌రెడ్డి

ఏ1 రాజ్ కసిరెడ్డి

ఏ5 సాయిరెడ్డి




మద్యం స్కాంలో నిందితుడు రాజ్ కసిరెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): "జగన్ ఆదేశించారు. నేను ఆచరించాను. విథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వాసుదేవరెడ్డి కలిసి మద్యం నుంచి ముడుపులు పిండుకునే పథకాన్ని రచించాం. జగన్ కార్యదర్శిగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు పలువురికి ఇందులో పాత్ర ఉంది" అని లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డి అలియాస్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంగీకరించినట్లు 'సిట్' వెల్లడించింది. రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో అనేక కీలక విషయాలు బయటపెట్టింది. ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఆయనను ప్రశ్నించామని... నేరం, దాని వెనుక

మిగతా 13వ పేజీలో...

సివిల్స్‌లో తెలుగు తేజాలు



బన్నా వెంకటేశ్ 15



సాయి శివాని 11

టాప్ 100 జాబితాలో ఏడుగురు మనోళ్లు.. 57 మంది క్వాలిఫై!

- 11వ ర్యాంకు సాధించిన ఓరుగల్లు బిడ్డ సాయి శివాని
- శ్రీకాకుళం జిల్లావాసి బన్నా వెంకటేశ్‌కు 15వ ర్యాంకు
- తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ
- 1,129 పోస్టులకుగాను 1,009 మంది ఎంపిక
- 725 మంది పురుషులు.. 284 మంది మహిళలు
- తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా యూపీ యువతి శక్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్) ఎప్పటిలాగానే సివిల్స్ పరీక్షల్లో తెలుగువారు మరోసారి సత్తా చాటారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 57 మంది అభ్యర్థులు ర్యాంకులు సాధించారు. టాప్-100 జాబితాలో

మిగతా 2వ పేజీలో...

జూన్‌లో 3 లక్షల ఇళ్లకు ప్రారంభోత్సవం! 12

రేపటి నుంచి బడులకు వేసవి సెలవులు 8

ఇంటర్ కాలేజీలకు కూడా.. జూన్ 12న పునఃప్రారంభం



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతికి మద్దతివ్వండి

- చరిత్రలో నిలిచిపోయేలా నిర్మించడానికి అండగా ఉండండి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- జగన్ హయాంలోని మద్యం కుంభకోణం గురించి ప్రస్తావన?
- కర్నూలులో హైకోర్టు బెంచ్, పోలవరం-బనకచర్లకు సాయం
- అమెరికా సుంకాల నుంచి ఆక్వా రైతులను కాపాడండి
- కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాజధాని నిర్మాణం శరవేగంగా పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ మే 2న ప్రారంభించనున్న రాజధాని నిర్మాణం చరిత్రలో నిలిచిపోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని

మిగతా 12వ పేజీలో...

అమరావతిలో క్వాంటమ్ విలేజ్

దేశంలోనే తొలిసారి

హైటెక్ సిటీని తలదన్నేలా ఐకానిక్ బిల్డింగ్



2

హీరో మహేశ్ బాబుకు ఈడీ నోటీసు

27న విచారణకు రావాలని పిలుపు

సినిమాలకు యానిమేషన్ అంటూ..

రూ.400 కోట్లకు కుచ్చుటోపీ! 2

ఓ యానిమేషన్ డెవలపర్ భారీ మోసం

లక్షకు లక్ష లాభమంటూ నమ్మించి బురిడీ

ఒంగోలులో టీడీపీ నేత దారుణ హత్య

తన కార్యాలయంలో ఉన్నప్పుడే దుండగుల దాడి.. ఆఫీసులోకి ప్రవేశించిన నలుగురు 12

తలుపులు మూసి కత్తులతో పొడిచి హత్య

38 కత్తి పోట్లు.. చివరగా గొంతు కోసి పరార్

టీసీఎస్ కోసం ఐటీ భవనాలు సిద్ధం

- విశాఖలో తక్షణం కార్యకలాపాలు ప్రారంభించేందుకు గ్రీన్‌సిగ్నల్ 3
- సెజ్ నుంచి మిలీనియం టవర్స్ డీనోటిఫై కోసం బోర్డు ఆఫ్ అప్రూవల్స్ అంగీకారం



డీనోటిఫై చేసిన మిలీనియం టవర్స్

విధి విధానాలు సిద్ధం!

- వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమం
- మోదీ ప్రజాదరణ అసూయ కలిగిస్తోంది
- ఈ మాట నేను ఆయనకే చెప్పాను 2
- బైడెన్ ప్రభుత్వం పెత్తనం చేయబోయింది
- భారత్‌ను చీప్ లేబర్ దేశంగా చూశారు
- అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్యలు

హీరో మహేష్ బాబుకు ఈడీ నోటీసు

» 27న విచారణకు రావాలని పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ హీరో మహేష్‌బాబును ఈ నెల 27న విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని సురానా డెవలపర్స్, సాయిసూర్య డెవలపర్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ రెండు సంస్థలు రియల్ ఎస్టేట్ అక్రమాలకు పాల్పడ్డాయని, ఒకే ప్లాట్ పది మందికి అమ్మారని, వంద కోట్ల రూపాయలు పైగా నగదు రూపంలో డబ్బు తీసుకున్నారని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ కంపెనీలకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో మహేష్‌బాబు నటించారు. అందుకు గాను సదరు కంపెనీ నుంచి మహేష్‌బాబు రూ.5.9 కోట్ల పారితోషికం తీసుకున్నారు. ఇందులో చెక్ రూపేణా మూడు కోట్ల 40 లక్షల రూపాయలు తీసుకోగా, నగదు రూపంలో రెండున్నర కోట్ల రూపాయలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ పారితోషికానికి సంబంధించి విచారణ నిమిత్తం మహేష్‌బాబును ఈడీ అధికారులు పిలిచారు.

శనివారం పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు

వాటికన్ సిటీ, ఏప్రిల్ 22: కేథలిక్ పవిత్ర గురువు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఇటలీ కాలమానం ప్రకారం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వాటికన్ ప్రకటించింది. అంతిమ సంస్కారాలు ఎప్పుడు నిర్వహించాలనే అంశంతో పాటు తదుపరి పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభంపై అందుబాటులో ఉన్న కార్డినల్స్‌తో మంగళవారం కీలక సమావేశం జరిగింది. బుధవారం నుంచి ఫ్రాన్సిస్ భౌతికకాయాన్ని సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చ్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. తనను ఇతర పోప్‌లను ఖననం చేసిన సెయింట్ పీటర్స్ బాసిలికాలో కాకుండా వాటికన్ వెలుపల ఉన్న సెయింట్ మేరీ మేజర్ బాసిలికాలో పూడ్చిపెట్టాలన్న పోప్ కోరికకు అనుగుణంగానే అంత్యక్రియల విధానాన్ని మార్చారు.

సినిమాలకు యానిమేషన్ అంటూ..

రూ.400 కోట్లకు కుచ్చుటోపీ!

» ఓ యానిమేషన్ డెవలపర్ భారీ మోసం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

విజయవాడకు చెందిన ఓ యానిమేషన్ డెవలపర్ భారీ మోసానికి పాల్పడ్డాడు. 'యూ పిక్స్' పేరుతో సినిమాలకు యానిమేషన్ చేస్తున్నామంటూ విజయవాడతో పాటు పలు ఇతర ప్రాంతాలకు చెందిన వారితో కోట్లలో పెట్టుబడులు పెట్టించి పరారైనట్లు తెలుస్తోంది. దీంతో పలువురు బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారులు పల్నాడు జిల్లాకు చెందినవారు. కేసు నమోదు కావడంతో పాటు సదరు సంస్థ యజమాని కిరణ్ రెండు వారాలుగా అజ్ఞాతంలోకి వెళ్లడంతో పెట్టుబడి పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. నిందితుడు దేశ విదేశాల్లో పలు సినిమాలకు యానిమేషన్ అందజేస్తున్నామని రూ.400 కోట్ల మేర ఎగవేసి పరారైనట్లు సమాచారం. నరసరావుపేటలోనే 80 మందికిపైగా బాధితులున్నట్లు తెలుస్తోంది.

వెలుగులోకి ఇలా..

యూ పిక్స్ యానిమేషన్ నిర్వహిస్తున్న నిడుమోలు వెంకట సత్యలక్ష్మీ కిరణ్ డబ్బులు తీసుకుని మోసం చేశాడని సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో ఇటీవల రెండు కేసులు నమోదైన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. కిరణ్ ఏడేళ్ల క్రితం సత్యనారాయణపురం ఆదిశేషయ్య వీధిలో యూ పిక్స్ యానిమేషన్ పేరుతో కార్యాలయం ప్రారంభించాడు. తక్కువ పెట్టుబడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ జనాలను నమ్మించాడు. నరసరావుపేటకు చెందిన త్రిపురమల్ల శ్రీనివాసరావు.. కిరణ్ మాటలు నమ్మి రూ.3కోట్లు, మరో బాధితుడు కలవకొలను దిలీప్‌కుమార్ రూ.50 లక్షలు ఇచ్చారు. అయితే లాభాలు ఇవ్వకుండా కాలయాపన చేయటంతో 15న సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు చేసి మరీ పెట్టుబడులు

సినిమాలకు యానిమేషన్ సాఫ్ట్‌వేర్ అందిస్తుంటామని, రూ.లక్ష చెల్లిస్తే ఏడాదిలో మరో రూ.లక్ష లాభం అంటూ కిరణ్ నరసరావుపేటలోని బడా వ్యాపారులను నమ్మించినట్లు తెలిసింది. మొదట రూ.కోటి పెట్టుబడి పెడితే 13 నెలల తర్వాత రూ.1.75 కోట్లు ఇచ్చాడు. దీంతో మరింత నమ్మకం పెరిగింది. ఈ క్రమంలో పలువురు వ్యాపారులు రూ.కోటి నుంచి రూ.50కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం.

ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై!

» మందకృష్ణ, స్మృతి ఇరానీ పేర్లపైనా ఊహాగానాలు

» అమిత్ షా, చంద్రబాబుతో మందకృష్ణ మాదిగ భేటీ



చెన్నై/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి తమ పార్టీ తరఫున అభ్యర్థిని నిలబెట్టాలని బీజేపీ భావిస్తోంది. ఇదే విషయాన్ని మంగళవారం ఢిల్లీలో తనను కలసిన సీఎం చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టు తెలిసింది. బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలిపేందుకు చంద్రబాబు కూడా సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. కాగా, విజయసాయిరెడ్డి స్థానంలో బీజేపీ ఎవరిని ప్రతిపాదిస్తుందన్న విషయంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. తమిళనాడు బీజేపీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన అన్నామలైకు రాజ్యసభ సీటు ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు చర్చ జరుగుతోంది. త్వరలో జరిగే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఆయన్ను మంత్రివర్గంలోకి కూడా తీసుకుంటారని భోగట్టా. మరోవైపు మాదిగ దండోరా నేత మందకృష్ణ మాదిగకు అవకాశం కల్పించే అంశంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. ఢిల్లీలోనే ఉన్న మందకృష్ణ మాదిగ.. మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో వెళ్లి అమిత్ షాను, చంద్రబాబును కలుసుకున్నారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు కూడా బీజేపీ వర్గాల్లో ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఏదేమైనా ఆ సీటను విజయసాయి రెడ్డికే కేటాయిస్తారంటూ వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని బీజేపీ, టీడీపీ వర్గాలు ధ్రువీకరించాయి. కాగా, కర్ణాటక క్యాడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి కె.అన్నామలై గతంలో దక్షిణ బెంగుళూరు డిప్యూటీ కమిషనర్‌గా వ్యవహరించారు. అనంతరం తన పదవికి రాజీనామా చేసి, 2020లో బీజేపీలో చేరారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించిన బీజేపీ.. ఇటీవల అన్నామలై స్థానంలో ఆ పార్టీ శాసనసభా పక్ష నేత నయినార్ నాగేంద్రన్‌ను నియమించింది.

టైప్ 2 డయాబెటిస్ నిర్ధారణకు సెన్సార్

» ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి పూసర్ల ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అపరంజి పూసర్ల టైప్ 2 డయాబెటిస్ నిర్ధారణకు రూపొందించిన పోర్టబుల్ బయో సెన్సార్‌కు పేటెంట్ లభించింది. ఈ విభాగానికి లభించిన తొలి పేటెంట్ ఇదే కావడం గమనార్హం. రక్త నమూనా సేకరించాల్సిన అవసరం లేకుండానే డయాబెటిస్, ఇతర సంక్రమణ వ్యాధులను తొందరగా గుర్తించేందుకు ఈ పోర్టబుల్ బయోసెన్సార్ ఉపకరిస్తుందని ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్‌కు అపరంజి వెల్లడించారు. రక్త నమూనాలకు బదులు చెమట, లాలాజలం నమూనాలను వేయడం ద్వారా మాలిక్యూల్స్‌ను గుర్తిస్తారు. వాటి ఆధారంగా వ్యాధిని నిర్ధారిస్తారు.

పిల్లల టీకాల కోసం మెగా క్యాంపెయిన్: కృష్ణబాబు

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం స్కూల్ పిల్లలకు మెగా క్యాంపెయిన్ నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. రోగనిరోధక టీకాలపై వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. వంద శాతం మేర టీకాలు వేసేలా కార్యక్రమాన్ని రూపొందించాలని ఆదేశించారు.

వాన్స్.. వంటల్లో బెస్ట్!

పిల్లలకు రామాయణ, మహాభారతాలంటే మక్కువ.. భారతదేశ చరిత్రనూ చదివారు

» ఇక్కడి ఆహారాన్ని ఇష్టంగా తింటారు

» పర్యటన జీవితాంతం గుర్తుంటుంది

» ఓ ఇంటర్వ్యూలో ఉషా వాన్స్

జైపూర్, ఏప్రిల్ 22: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు భారతీయ వంటకాలంటే ఇష్టమని, కొన్ని వంటకాలను ఆయనే స్వయంగా చేస్తారని వాన్స్ భార్య ఉషా వాన్స్ ప్రశంసించారు. తమ పిల్లలకు రామాయణ, మహాభారతాలంటే మక్కువని ఆమె తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జేడీ వాన్స్ కుటుంబంతో కలిసి మంగళవారం జైపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార రుచులను ఎంతగా ఆస్వాదించారో ఉషా వాన్స్ వివరించారు.

పిల్లల గురించి..

"మా కుటుంబం ఆంధ్రప్రదేశ్‌కు చెందినదే. అయినప్పటికీ, మా పిల్లలు(ఇవాన్, వివేక్, మిరాబెల్) ఎప్పుడూ ఇక్కడకు రాలేదు. కానీ, వారు భారతదేశ చరిత్ర చదివారు. వారికి ఇక్కడి చరిత్ర గురించి ఎంతో కొంత అవగాహన ఉంది. వారికి రామాయణ, మహాభారతాలపై ఎంతో ఆసక్తి ఉంది. పిల్లలు భారతీయ ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే ఎక్కువ సార్లు దీన్నే తింటారు.

జేడీ వాన్స్ వంట నైపుణ్యాల గురించి..

వాన్స్ చాలా బాగా వంట చేస్తారు. వంటింట్లో ఎప్పుడూ కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఆయనకు భారతీయ వంటకాలంటే చాలా ఇష్టం. చనా మసాలా, మటన్ వంటి వంటకాలను కూడా వండుతారు. అలాగే, మా అమ్మ, అమ్మమ్మ అద్భుతంగా వంట చేస్తారు. మా నాన్న దోశ వేస్తే తిరుగుండదు. మేము వంటలకు కావాల్సిన పదార్థాలను కూడా భారతీయ దుకాణాల నుంచే కొనుగోలు చేస్తాం.



జైపూర్‌లోని అంబర్ పోర్టు వద్ద జేడీ వాన్స్ కుటుంబం

వివాహం గురించి..

భారతీయ కుటుంబానికి చెందిన వ్యక్తిని. కాబట్టి హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకోవడం ముఖ్యమని భావించా. అందుకే హిందూ, క్రైస్తవ మత సంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకున్నాం. (ఉషా వాన్స్ హిందూ మతాన్ని ఆచరిస్తోంది. కాగా ఆమె భర్త జేడీ వాన్స్ ఒక క్రైస్తవుడు. కానీ, 2019లో వాన్స్ కాథలిక్ మతంలోకి మారారు.)

ప్రధాని మోదీ నివాసంలో..

ప్రధాని మోదీ నివాసంలో రామాయణానికి సంబంధించిన తోలుబొమ్మలాటను చూసి ఎంతో సంతోషించాం. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తోలు బొమ్మలు పిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మొదటి భారత పర్యటన..

జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ఆయనకు చాలా ప్రత్యేకమైనది. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు వాన్స్‌కు ఎంతగానో నచ్చాయి. అమెర్ కోటను సందర్శించడం మా కుటుంబానికి మరపురాని అనుభూతినిచ్చింది. నా పిల్లలు రాజస్థానీ నృత్యానికి, సంగీతానికి ముగ్ధులయ్యారు. వారు నిన్న రాత్రంతా దాని గురించి మాట్లాడుతూనే ఉన్నారు. ఈ పర్యటన జీవితాంతం గుర్తుండిపోతుంది. నా చిన్న కుటుంబంతో కలిసి భారత్‌లో పర్యటించడం నాకు చాలా ఆనందంగా ఉంది."

విధి విధానాలు సిద్ధం!

» వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమం.. మోదీ ప్రజాదరణ అసూయ కలిగిస్తోంది

» అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: వాణిజ్య సంప్రదింపులకు సంబంధించి భారత్-అమెరికాలు విధివిధానాలు అధికారికంగా ఖరారు చేశాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. దాంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి మార్గం సుగమమైందని అన్నారు. మంగళవారం ఆయన జైపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ అణు ఇంధన లక్ష్యాలు నెరవేర్చడానికి అమెరికా ఉపయోగపడుతుందని అన్నారు. భారత ప్రధాని మోదీ ప్రజాదరణ స్థాయి చూస్తుంటే తనకు అసూయగా ఉందని వాన్స్ వ్యాఖ్యానించారు. ఇదే విషయం ఆయనకు సోమవారం విందు సందర్భంగా ఆయనకు స్వయంగా చెప్పానన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రజాస్వామిక దేశాధినేత అయిన మోదీని బైడెన్ ప్రభుత్వం తరచూ విమర్శించేదని వాన్స్ ప్రస్తావించారు. బైడెన్ ప్రభుత్వం భారత్‌ను కారుచౌకగా శ్రామిక శక్తి లభించే దేశంగా మాత్రమే చూసిందని వ్యాఖ్యానించారు. అక్షరధామ్ ఆలయాన్ని కుటుంబంతో కలిసి చూడటం తన అదృష్టమని వాన్స్ అన్నారు. భారత్‌కు పురాతన శిల్ప సంపద అందాలు, గొప్ప చరిత్రతో పాటు భవిష్యత్తు పట్ల స్పష్టత కూడా ఉన్నాయని కొనియాడారు. ప్రపంచంలో చాలా దేశాలు తిరిగానని, అన్నిచోట్ల అనుకరణ తాపత్రయం ఉండేదని, భారతదేశంలో మాత్రమే అది కనబడలేదని వ్యాఖ్యానించారు. భారతీయుడని చెప్పుకోవడం గర్వించదగ్గ విషయమని అన్నారు. తన పిల్లలు మోదీని ఎంతో ఇష్టపడ్డారని వాన్స్ చెప్పారు.



ఎగుమతిదార్లకు ఊరట

వాన్స్ ప్రకటన భారతదేశ ఎగుమతిదారులకు గొప్ప ఊరటనిస్తుందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి. కొత్త ట్యారిఫ్ విధానానికి ట్రంప్ 90 రోజుల విరామం ప్రకటించిన నేపథ్యంలో గడువు ముగిసిన తర్వాత పరిస్థితిపై పరిశ్రమల వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. నాలుగు రోజుల భారత పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం జేడీ వాన్స్, ఉష దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి ఉదయాన్నే జైపూర్‌లోని అంబర్ ఫోర్టును సందర్శించారు. అక్కడ రెండు గంటలు గడిపారు.

లోకం తీరు



అమెరికా విద్యావ్యవస్థలో అనవసర రాజకీయ జోక్యం!

» ట్రంప్ సర్కారు చర్యలను ఖండించిన 100కుపైగా యూనివర్సిటీలు

» రూ.17 వేల కోట్ల గ్రాంట్ల నిలిపివేతపై హార్వర్డ్ వర్సిటీ దావా

వాషింగ్టన్/బోస్టన్, ఏప్రిల్ 22: విద్యావ్యవస్థలో ట్రంప్ సర్కారు అనవసర రాజకీయ జోక్యాన్ని ఖండిస్తూ అమెరికా వ్యాప్తంగా 100కుపైగా యూనివర్సిటీలు, కాలేజీలు ఒక సంయుక్త లేఖను విడుదల చేశాయి. గతంలో ఎప్పుడూ ఇలా జరుగలేదని మంగళవారం రాసిన ఆ లేఖలో పేర్కొన్నాయి. హార్వర్డ్, ప్రిన్స్‌టన్, బ్రౌన్ తదితర ప్రఖ్యాత యూనిర్సిటీల నుంచి చిన్న కాలేజీల వరకు వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు ఆ లేఖపై సంతకాలు చేశారు. క్యాంపస్‌లపై ప్రభుత్వ అనవసర నియంత్రణలను తిరస్కరిస్తున్నామని ఆ లేఖలో తేల్చిచెప్పారు. ఈ పరిణామాలు అమెరికా ఉన్నత విద్యావ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమించాయని పేర్కొన్నారు. మరోవైపు హార్వర్డ్ యూనివర్సిటీకి రూ.17,039 కోట్ల(2 బిలియన్ డాలర్లు) గ్రాంట్లను నిలిపివేసిన ట్రంప్ సర్కారుపై ఆ వర్సిటీ బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో దావా వేసింది. వర్సిటీ క్యాంపస్‌లో కార్యకలాపాలపై పరిమితులు విధించేందుకు, అడ్మిషన్ విధానాల్లో మార్పులు, నాయకత్వ సంస్కరణల కోసం ట్రంప్ యంత్రాంగం చేసిన ఆదేశాలను ధిక్కరించడమే గ్రాంట్ల నిలిపివేతకు కారణం. క్యాంపస్ కార్యకలాపాలపై ఆడిట్ నిర్వహించాలని, కొన్ని విద్యార్థి క్లబ్‌ల గుర్తింపును నిలిపివేయాలని సూచిస్తూ ఈనెల 11న ట్రంప్ యంత్రాంగం హార్వర్డ్ వర్సిటీకి లేఖ రాసింది. అయితే, అలాంటి డిమాండ్లకు తాము తలొగ్గేది లేదని వర్సిటీ అధ్యక్షుడు అలాన్ గర్బర్ తేల్చిచెప్పారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే వర్సిటీకి బిలియన్ డాలర్ల ఫెడరల్ ఫండింగ్‌ను ప్రభుత్వం నిలిపివేసింది.

సివిల్స్‌లో తెలుగు తేజాలు



ఆలిండియా టాపర్లు శక్తి దూబే (1), హర్షిత గోయల్ (2), అర్చిత్ పరాగ్ (3)

(మొదటి పేజీ తరువాయి)

ఏడుగురు తెలుగువారు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాన్న వెంకటేశ్ 15వ ర్యాంకుతో టాప్-20లో నిలిచారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన చక్కా స్నేహిత్ (94), కడప జిల్లా అలంఖాన్‌పల్లెకు చెన్నంరెడ్డి శివగణేశ్ రెడ్డి (119), పల్నాడు జిల్లా రుద్రవరానికి చెందిన చల్లా పవన్ కల్యాణ్ (146), కడప జిల్లా చెన్నూరు చెందిన నెలటూరు శ్రీకాంత్ రెడ్డి (151) మంచి ర్యాంకులతో సత్తా చాటారు. ఇక తెలంగాణలో ఓరుగల్లు బిడ్డ ఇట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకుతో అదరగొట్టగా.. అభిషేక్ శర్మ (38), రావుల జయసింహారెడ్డి (46), చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (62), సాయి చైతన్య జాదవ్ (68), ఎన్.చేతనరెడ్డి (110), నెల్లూరు సాయితేజ (154), కొలిపాక శ్రీకృష్ణసాయి (190) తదితరులు తుది జాబితాలో చోటు సాధించారు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన 'సివిల్స్ 2024' తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు చెందిన శక్తి దూబె తన తొలి ప్రయత్నంలోనే టాపర్‌గా నిలవగా.. హరియాణాలో జన్మించి గుజరాత్‌లో పెరిగిన హర్షిత గోయల్ రెండో స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో వరుసగా అర్చిత్ పరాగ్ (3), షా మార్గి చిరాగ్ (4), ఆకాశ్ గార్గ్ (5) నిలిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 42,560 మంది ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాగా.. వారిలో 600 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వారిలో దాదాపు 100మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. 40 మందికిపైగా తుది జాబితాలో చోటు సాధించారు.

1,129 పోస్టుల భర్తీకి..: కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 1,129 పోస్టుల భర్తీకి గత ఏడాది ఫిబ్రవరిలో యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. జూన్ 16న ప్రిలిమినరీ, సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకూ దశల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. ప్రిలిమినరీ పరీక్షకు 9,92,599 మంది దరఖాస్తు చేసుకోగా, 5,83,213 మంది మాత్రమే పరీక్ష రాశారు. వీరిలో మెయిన్స్ రాత పరీక్షకు 14,627 మంది అర్హత సాధించగా, ఇంటర్వ్యూలకు 2,845మంది ఎంపికయ్యారు. జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 నడుమ ఇంటర్వ్యూలు నిర్వహించి.. వారిలో 1,009 మంది అభ్యర్థులను సివిల్స్‌కు ఎంపిక చేసినట్టు యూపీఎస్సీ ప్రకటించింది. వారిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 109, ఓబీసీ కేటగిరీ కింద 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీలో 87 మంది ఎంపికైనట్టు వివరించింది. అభ్యర్థులకు ఏమైనా సమాచారం కావాలనుకుంటే పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య స్వయంగా సంప్రదించవచ్చని.. లేదా 23385271, 23381125, 23098543 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించింది. సివిల్స్ అభ్యర్థుల మార్కుల జాబితాను పదిహేను రోజుల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు యూపీఎస్సీ వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల నుంచి మరికొందరు ర్యాంకర్లు..

సివిల్స్ ఫలితాల్లో 200కు పైగా ర్యాంకు సాధించిన తెలుగువారిలో.. బొల్లం ఉమామహేశ్వర్‌రెడ్డి (221), పూల ధనుష్ (232), పోతరాజు హరిప్రసాద్ (255), పి.లక్ష్మీప్రియ (297), ఎస్.సాయికిరణ్ (298), కె.శ్రీనివాస కీర్తిరెడ్డి (316), ఎం.ఉదయ్ కృష్ణారెడ్డి (350), ఎం.పవన్‌కుమార్ రెడ్డి (375), రాపర్తి ప్రీతి (451), పి.భార్గవ్ (455), సి.రాహుల్ (462), జె.భానుప్రకాశ్ (523), సి.భరత్ (567), గుబ్బల ఏఆర్‌వీ సూర్యతేజ (647), దోనేపూడి విజయ్‌బాబు (681), ఎం.వెంకటేశ్ ప్రసాద్ సాగర్ (700), పి.ఇంద్రార్చిత (739) శనగవరపు సాయిభార్గవ (798), టి.సూర్యతేజ (799), వావిలపల్లి భార్గవ (830), గుగులోతు జీతేందర్ నాయక్ (855), బి.మౌర్యతేజ (856) బి.వెంకట రామ్‌యజ్ఞ (863), వడ్డాది సాయిరోహన్ (892), కోకా ప్రియతం మనోహర్ (915), జి.ఆంజనేయులు (934), బానోతు శ్రీనికేశ్‌నాయక్ (938), జి.ప్రసాద్ (944), ఆర్.సుధాకర్ (949), చలవాది శ్రావణ సౌమ్య (951), ఆర్.సాయిమోహిని మానస (975) తదితరులున్నారు.

ఇదీ లెక్క

యూపీఎస్సీ ఈ పరీక్షలను 1129 పోస్టుల భర్తీకి నిర్వహించింది. అందులో ఏయే ఉద్యోగాల సంఖ్య ఎంతంటే..

ఐఏఎస్	180
ఐఎఫ్ఎస్	55
ఐపీఎస్	147
గ్రూప్ ఏ	605
గ్రూప్ బి	142



తల్లిదండ్రులు రాజు, రజితతో సాయి శివాని

ఫోన్, సోషల్‌మీడియాకు దూరం

సివిల్స్‌ను లక్ష్యంగా నిర్దేశించుకుని.. క్రమశిక్షణతో చదివేవారికి ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. నేను ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఫోన్‌ను అస్సలు వినియోగించలేదు. సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్నాను. ఐఏఎస్ సాధించాలనే పట్టుదలతో రోజుకు 10 నుంచి 12 గంటలు చదివా. స్ట్రాంగ్ మైండ్‌సెట్‌తో ప్రిపేర్ అయ్యా. సిలబస్‌ను పూర్తిస్థాయిలో విభజించుకొని ఏ రోజు చదవాల్సిన సిలబస్‌ను అదే రోజు పూర్తి చేసేదాన్ని. మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్ పూర్తి చేయలేకపోయాను. రెండో ప్రయత్నంలో పూర్తిస్థాయిలో కృషి చేశాను. ఇక ఇంటర్వ్యూ విషయానికి వస్తే.. ప్రశ్నలకు సమాధానాల రూపంలో కాకుండా సంభాషణ రూపంలో మాట్లాడేలా సాధన చేశాను. నాకు మా నాన్నే స్ఫూర్తి. తల్లిదండ్రులతో పాటు నేను కూడా చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలనే కలలు కన్నాను. నన్ను ప్రోత్సహించిన అమ్మానాన్నలకు నేను సదా కృతజ్ఞురాలిని.

- సాయి శివాని, 11వ ర్యాంకర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి..

» 15వ ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లావాసి వెంకటేశ్

» 2023లో ఐపీఎస్‌కు.. తాజాగా ఐఏఎస్‌కు ఎంపిక



నరసన్నపేట/జలుమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ చదివి, చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి.. గతంలో రెండుసార్లు సివిల్స్ రాసి.. రెండోసారి ఐపీఎస్‌కు ఎంపికయ్యారాయన. దాంతో సంతృప్తి చెందక.. మరోసారి పరీక్ష రాసి ఈసారి 15వ ర్యాంకు సాధించి ఐఏఎస్ కలను సాకారం చేసుకున్నారు. ఆయనే.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం అల్లాడపేటకు చెందిన బి.వెంకటేశ్. అల్లాడపేట ఓ కుగ్రామం. ఈ గ్రామానికి గతంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో అద్దేనంపేటగా కూడా పిలిచేవారు. అటువంటి గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వెంకటేశ్.. ఉన్నత చదువులు చదివి, సివిల్స్‌లో సత్తాచాటి ఔరా అనిపించారు. ఆయన ఐఏఎస్‌కు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు చంద్రరావు, రోహిణి, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్‌కు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

రైతులకు సేవ చేసేందుకే..

» 46వ ర్యాంకర్ రావుల జయసింహారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్త అయిన రావుల ఉమారెడ్డి కుమారుడు.. రావుల జయసింహారెడ్డి సివిల్స్‌లో 46వ ర్యాంకు సాధించారు. వరంగల్‌కు చెందిన జయసింహారెడ్డికి.. చిన్నప్పటి నుంచి వ్యవసాయం మీద ఆసక్తి. తన తండ్రిని కలిసేందుకు రైతులు వచ్చేవారని.. వారికి సేవ చేసేందుకే తాను సివిల్స్ రాశానని ఆయన తెలిపారు. "హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశాను. 2019లో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. అప్పటి నుంచీ సివిల్స్ రాయడం మొదలు పెట్టాను. మొదటి రెండు విడతల్లో రాలేదు. మూడో విడతలో ఐపీఎస్ వచ్చింది. ప్రస్తుతం శిక్షణలో ఉన్నాను.. నాలుగో విడత రాస్తే 104వ ర్యాంకు వచ్చి మళ్లీ ఐపీఎస్ వచ్చింది. నాకు ఐపీఎస్ ఇష్టమే అయినా.. పేదలకు సేవ చేయడానికి ఐఏఎస్ అయితే బాగుంటుందని ఐదోసారి మళ్లీ ప్రయత్నం చేశా. ఇప్పుడు 46వ ర్యాంకు వచ్చింది" అని జయసింహారెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంకు సాధించగలిగానన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు.. ఇక ఐఏఎస్!

» ఉట్నూర్ గిరిజన విద్యార్థి సాయిచైతన్య జాదవ్‌కు 68వ ర్యాంకు



కుటుంబ సభ్యులతో సాయిచైతన్య జాదవ్

ఉట్నూర్ / డిచ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఒక హెడ్ కానిస్టేబుల్ కుమారుడు.. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైతే? ఆ తండ్రి ఆనందం ఎలా ఉంటుందో.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన జాదవ్ గోవిందన్‌ను అడిగితే తెలుస్తుంది. ఎందుకంటే.. ఆయన కుమారుడు సాయిచైతన్య జాదవ్ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి 68వ ర్యాంకు సాధించారు. గిరిజన యువకుడైన సాయిచైతన్య సివిల్స్ రాయడం ఇది ఐదోసారి. నాలుగో ప్రయత్నంలో 138వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యారు. దీంతో మరోసారి ప్రయత్నించి.. మెరుగైన ర్యాంకు సాధించారు. సాయిచైతన్య తల్లి కవిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కాగా.. అక్క శ్రుతి వైద్యురాలు. తండ్రి జాదవ్ గోవింద్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తమ కుమారుడు ఐఏఎస్‌కు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందంతో చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనే తమ కుమారుడు ఐఏఎస్‌గా బాధ్యతలు చేపడితే ఇంకా ఆనందంగా ఉంటుందన్నారు.

టీసీఎస్ కోసం ఐటీ భవనాలు సిద్ధం

- విశాఖలో తక్షణం కార్యకలాపాల ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్
- సెజ్ నుంచి మిలీనియం టవర్స్ డీనోటిఫైకి బోర్డు ఆఫ్ అప్రూవల్స్ అంగీకారం
- గతంలో టీసీఎస్‌కు 2.08 లక్షల చ.అ. కేటాయింపు
- అక్కడి నుంచే ఇప్పుడు ఆపరేషన్స్‌కు చాన్స్
- ఇంటీరియర్స్ పనులే తరువాయి

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విశాఖలో తక్షణమే కార్యకలాపాలు ప్రారంభించడానికి టీసీఎస్‌కు మార్గం సుగమమైంది. రుషికొండలోని సెజ్ నుంచి మిలీనియం టవర్లను డీనోటిఫై చేయడానికి ఢిల్లీలోని బోర్డ్ ఆఫ్ అప్రూవల్స్ (బీఓఏ) అంగీకరించింది. సీఎం చంద్రబాబు 'టాటా సన్స్' చైర్మన్ చంద్రశేఖరన్‌తో వరుస భేటీలు, ఐటీ మంత్రి లోకేశ్ ప్రయత్నాల మీదట టీసీఎస్ విశాఖ రావడానికి అంగీకరించిన సంగతి తెలిసిందే. టాటా సంస్థ సొంత క్యాంపస్ నిర్మించుకోవడానికి రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబర్-3పై 21.6 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. భూమి ఇవ్వడానికంటే ముందే కార్యకలాపాల ప్రారంభానికి మిలీనియం టవర్స్‌లో 2.08 లక్షల చదరపు అడుగులు కేటాయించారు. ఈ ఐటీ పార్కు 'ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)' పరిధిలో ఉంది. నిబంధనల ప్రకారం ఇక్కడ పనిచేసే కంపెనీలు విదేశాలకు మాత్రమే ఉత్పత్తులు ఎగుమతి చేయాలి. దేశీయంగా సేవల కోసం ఈ భవనాలను ఉపయోగించుకోవాలని టీసీఎస్ భావించి.. తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. ఆ భవనాన్ని డీనోటిఫై చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపారు. దీనికి బీఓఏ ఆమోదం తెలిపిన విషయాన్ని టీసీఎస్‌కు తెలియజేశామని, వారు ఇంటీరియర్ పనులు చేయించుకొని, మంచి ముహూర్తం చూసుకుని కార్యకలాపాలు ప్రారంభించడమే మిగిలి ఉందని ఏపీఐఐసీ అధికారి చెప్పారు.


అవిశ్వాస తీర్మానంతో పదవి కోల్పోయిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలిచ్చింది. జిల్లా కలెక్టర్ పంపిన విఎనిట్స్ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

'అర్సా'పై రాద్ధాంతం

- భూకేటాయింపులను తప్పుబట్టిన కేశినేని నాని
- సోదరుడిపై అక్కసుతోనే ఆరోపణలు
- ఖండించిన అర్సా యాజమాన్యం
- చిన్నికి మా కంపెనీతో సంబంధం లేదు
- పెట్టుబడి పెట్టేవారిపై దుష్ప్రచారం తగదు
- గడువులోగా ప్రాజెక్టు చేయకుంటే ప్రశ్నించండి : అర్సా

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీ కంపెనీలను ప్రోత్సహించడంలో భాగంగా అర్సా క్లస్టర్స్ అనే కంపెనీకి విశాఖలో 60 ఎకరాల భూమిని కేటాయించాలని ఇటీవల కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. అయితే, అర్హత లేని కంపెనీకి అన్ని ఎకరాలు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ అప్పటి నుంచి విమర్శలు చేయడం మొదలుపెట్టింది. మంగళవారం విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని అర్సా క్లస్టర్స్‌పై 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. తన సోదరుడు, ఎంపీ కేశినేని చిన్నిని లక్ష్యంగా చేసుకుని నానీ ఆరోపణలు గుప్పించారు. "అర్సా కంపెనీ నా సోదరుడు చిన్ని రూపొందించిన బినామీ కంపెనీ. ఆ కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన అబ్బూరి సతీశ్...చిన్నికి సన్నిహితుడు, ఇంజనీరింగ్‌లో క్లాస్‌మేట్. భూకేటాయింపునకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడానికి కొన్ని వారాల ముందే ఈ కంపెనీని స్థాపించారు" అని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై అర్సా క్లస్టర్స్ యాజమాన్యం స్పందించింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పించాలని భావిస్తున్న కంపెనీలపై రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేయడం బాధతోపాటు నిరుత్సాహాన్ని కలిగించిందని ఆ కంపెనీ కోఫౌండర్ సతీశ్ అబ్బూరి, ప్రమోటర్ జయ్ తాళ్లూరి అన్నారు. అర్సా క్లస్టర్స్‌కు విశాఖలో భూకేటాయింపులపై వస్తున్న విమర్శలపై సతీశ్, జయ్, అర్సా చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ ఎరిక్ వార్నర్ అమెరికా నుంచి మంగళవారం రాత్రి జూమ్ ద్వారా విలేకరులతో మాట్లాడారు. "మా కంపెనీ ప్రపంచస్థాయిలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో సేవలందిస్తోంది. భారతదేశంలో ఇటీవలే మా కార్యకలాపాలు ప్రారంభించాం. ఎంపీ కేశినేని చిన్నితో మా కంపెనీకి ఎలాంటి సంబంధం లేదు. ప్రస్తుతానికి భారతదేశంలో తాత్కాలిక కార్యాలయం ద్వారా సేవలందిస్తున్నాం. త్వరలోనే శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నాం. మా ప్రాజెక్టులను ఫేజ్-1 దశ అమలుకు అవసరమైన ఆర్థిక బలం మాకు సొంతంగా ఉంది" అని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ రోత మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై స్పందిస్తూ... తాము పెట్టే పెట్టుబడులు ఆర్బీఐ అనుమతించిన ఎఫ్‌డీఐ పాలసీతో ఏపీకి వస్తాయని జయ్ తాళ్లూరి చెప్పారు. అర్సా క్లస్టర్స్ ప్రమోటర్లు అందరూ ఆర్థికంగా బలమైన వారని, సంస్థ ఆర్థికసామర్థ్యంపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్స్‌కు, ఏఐ రంగానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తాము వివిధ దేశాలు, భారత్‌లోని పలు రాష్ట్రాల్లో డేటాసెంటర్స్ ఏర్పాటు, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో పెట్టుబడులకు సిద్ధమయ్యామని, ఏపీ నుంచి ఆహ్వానం రావడంతో వీటి ఏర్పాటుకు ముందుకు వచ్చామన్నారు. విశాఖలో మూడు దశల్లో రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. 100 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.5వేల కోట్లు ఖర్చవుతుందని, దానికి రూ.3వేల కోట్లు ఖర్చు పెట్టి ఎవరైనా భూమి తీసుకుంటారా? అని ప్రశ్నించారు. కాపులప్పాడులో ఎకరం రూ.50 కోట్ల విలువ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. తమకు 99 పైసలకు ఎకరా కేటాయించారన్న కథనాల్లో వాస్తవం లేదన్నారు. విశాఖ ఐటీ పార్కు వద్ద కేటాయించిన భూమి ఎకరా రూ.కోటి, కాపులుప్పాడు వద్ద కేటాయించిన భూమి ఎకరా రూ.50 లక్షలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. తమకు కేటాయించిన భూమిలో రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాల్సి ఉందని, రెండు వేల మందికి ఉపాధి లభించడంతోపాటు పరోక్షంగా కొన్ని వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. "మేం ప్రాజెక్టును పూర్తి చేయకపోతే మాకు కేటాయించిన భూమిని వెనక్కి తీసుకునే వెసులుబాటు ఎంవోయూలో ఉంది. నిర్దేశిత సమయంలో ప్రాజెక్టు పూర్తి చేయకపోతే మాపై ఆరోపణలు చేయండి. తప్పు లేదు. కానీ, ప్రారంభంలోనే విమర్శలు చేయడం సరైన విధానం కాదు. మేం ఏర్పాటు చేసే డేటాసెంటర్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వల్ల రాష్ట్రంలోని ప్రతి చిన్న పట్టణంలోనూ స్టార్టప్‌లను ప్రారంభించే వాతావరణం ఏర్పడుతుంది" అని జయ అన్నారు.

తమ కంపెనీకి వెబ్‌సైట్ లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని... https:/www.urscloud.com అనేది తమ వెబ్‌సైట్ అని తెలిపారు. విజయవాడ ఎంపీతో తనకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవని సతీశ్ అబ్బూరి తెలిపారు. తెలంగాణలో కూడా డేటాసెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ కూడా 50 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. భారతదేశంలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఏపీలో కంపెనీని రిజిస్టర్ చేశామని, త్వరలోనే పూర్తిస్థాయి కార్యకలాపాలు చేపడతామన్నారు. అర్సా క్లస్టర్స్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ ఎరిక్ వార్నర్ మాట్లాడుతూ.. తమ సంస్థ క్లయింట్ బేస్ అని, చాలా దేశాల్లో ఉందన్నారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికాతోపాటు భారత్‌లోనూ ఆదాయవనరులపై సమగ్ర అధ్యయనం చేసి క్లయింట్ బేస్‌ను గుర్తించామని చెప్పారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు శ్రవణ్ కుమార్, చైతన్య జాదవ్‌లతో అకాడమీ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర

యూపీఎస్సీ సివిల్స్‌లో రాణించిన శరత్‌చంద్ర అకాడమీ విద్యార్థులు

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 2025 యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో విజయవాడకు చెందిన శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రవణ్‌కుమార్ 62వ ర్యాంకు, చైతన్య జాదవ్ 68వ ర్యాంకుతో మెరిశారు. మరో అభ్యర్థి చిన్నంరెడ్డికి 119వ ర్యాంకు వచ్చింది. తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల అకాడమీ డైరెక్టర్ తోట శరత్ చంద్ర ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ర్యాంకులు సాధించే విధంగా అభ్యర్థులను తీర్చిదిద్దుతామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కశ్మీర్‌లో మళ్లీ ఉగ్రభూతం

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో 28 మంది పర్యాటకులు మృతిచెందడం అత్యంత విషాదకరమైనది. ఈ దారుణం జరిగిన బైసరన్ ప్రాంతాన్ని దాని ప్రకృతి సౌందర్యం కారణంగా మినీస్విట్జర్లాండ్ అని పిలుచుకుంటారు. అతికష్టంమీద చేర గలిగే ఈ ప్రదేశంలో పర్యాటకులంతా ఆహ్లాదంగా ఉన్న స్థితిలో ఉగ్రవాదులు విరుచుకుపడి ఈ మారణకాండకు ఒడిగట్టారు. తీవ్రంగా గాయపడినవారి సంఖ్య ఇరవై వరకూ ఉండవచ్చునని అంటున్నారు. రక్తపు మడుగులో పడివున్న తమవారిని రక్షించాలంటూ బంధువులు విజ్ఞప్తులు చేస్తున్న దృశ్యాలు మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. హనీమూన్ వచ్చిన నవదంపతుల్లో ఒకరు ఈ దారుణానికి బలైపోయారు. ఆ ప్రాంతానికి వాహనాలు చేరడం కష్టంకావడంతో బాధితులను ఆదుకోవడంలోనూ జాప్యం జరిగింది. అంబులెన్సుల్లోనూ, హెలికాప్టర్లలోనూ బాధితులను తరలించేలోగా, స్థానికులు కూడా కొందరిని గుర్రాలమీద ఆస్పత్రులకు చేర్చారట. ఈ ఊచకోతకు పాల్పడింది తానేనని రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే ఉగ్ర సంస్థ ప్రకటించుకుంది. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కర్-ఎ-తోయిబా అనుబంధ సంస్థ ఇది. 2019 పుల్వామా ఘటన తరువాత, లోయలో జరిగిన అతిపెద్ద ఉగ్రదాడి ఇదే.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి తదితర పెద్దలంతా ఈ దారుణాన్ని ఖండించారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కూడా ఈ ఘోరంమీద విచారం ప్రకటించారు. జులై 3నుంచి దాదాపు నలభైరోజులుపాటు సాగే అమర్‌నాథ్ యాత్రలో ఈ మార్గం కూడా ఉన్నందున, గతంలో అమర్‌నాథ్ యాత్రికులపై ఇదేతరహాలో ఉగ్రవాదులు దాడిచేసిన ఘటన అందరికీ గుర్తుకువస్తున్నది. స్థానికులను సైతం ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. వివిధ ప్రాంతాల్లో స్థానికులు కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిపినట్టు వార్తలు వస్తున్నాయి. వేర్వేరు రాష్ట్రాలకు, విభిన్న రంగాలకు చెందినవారు ఈ ఘోరంలో ప్రాణాలు పోగొట్టుకున్నందువల్ల ఈ విషాదం దేశమంతా విస్తరించింది.

పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్న ఈ ఉగ్ర సంస్థ పర్యాటకాన్ని, తద్వారా వస్తున్న ఆదాయాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడికి తెగబడింది. గత ముప్పైయేళ్ళలో ఎరగనివిధంగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఐదులక్షలమంది పర్యాటకులు ఈ కేంద్రపాలిత ప్రాంతానికి వచ్చారు. ప్రత్యేకప్రతిపత్తి రద్దు తరువాత రేగిన ఆగ్రహావేశాలు, అశాంతి తగ్గుముఖం పట్టి, కశ్మీర్‌లో పరిస్థితులు గాడిన పడడం, గత ఏడాది శాంతియుతంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకోవడం పొరుగుదేశానికీ, అది పోషిస్తున్న ఉగ్రసంస్థలకు కంటకింపుగా ఉంది. ఉపాధి కోసం వచ్చిన స్థానికేతరులమీద ఉగ్రవాదులు దాడులు చేసి కొందరిని చంపివేసిన ఘటనలు గతంలో లేకపోలేదు. కానీ, పర్యాటకులను ఊచకోతకోయడం ద్వారా దేశమంతటికీ ఒక హెచ్చరిక సందేశాన్ని పంపాలని, కశ్మీర్‌లో అడుగుపెట్టడానికి దేశవిదేశీయులంతా భయపడేట్టు చేయాలన్నది ఉగ్రవాదుల లక్ష్యంగా కనిపిస్తోంది.

కశ్మీర్‌లో శాంతికి పాకిస్థాన్ ప్రబలశత్రువని మరోమారు రుజువైంది. పలుసమస్యలు, కల్లోలాలతో తీసుకుంటున్న దేశాన్ని గాడినపెట్టలేని అక్కడి పాలకులు మళ్ళీ గతంలో మాదిరిగా కశ్మీర్ మీద విషం కక్కడం ఆరంభించారు. ఇటీవల జరిగిన ప్రవాస పాకిస్తానీ సదస్సులో షరీఫ్ సోదరులు, ఇతర ప్రముఖుల సమక్షంలో పాక్ ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలకు, ఇప్పటి ఘాతుకానికీ సంబంధం ఉన్నదని విశ్లేషకుల అభిప్రాయం. పాలనలో, నిర్ణయాల్లో పాకిస్థాన్ సైన్యానిదే పైచేయి అని ఆయన మాటలకు అర్థం. సైన్యానికి అల్లాహ్ అప్పగించిన కొన్ని కర్తవ్యాలు ఉన్నాయన్నారు. కశ్మీర్ గురించి జిన్నా గతంలో చేసిన వ్యాఖ్యలను మళ్ళీ గుర్తుచేశారు. కశ్మీర్‌మీద ఎన్నటికీ ఆశచావదు, అది మా జీవనాడి, ఏ శక్తీ దానిని మా నుంచి వేరుచేయలేదు అన్నాడాయన. భారత్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కశ్మీరీ సోదరులను మరిచిపోబోమని అన్నారు. హిందువులు, ముస్లింలు, భారతదేశం, బలూచిస్తాన్, ద్విజాతి సిద్ధాంతం ఇత్యాది చాలా విషయాలు స్పృశించాడాయన. మునీర్ వ్యాఖ్యలమీద భారతప్రభుత్వంతో పాటు వివిధ పార్టీల నాయకులు కూడా స్పందించారు. గాడినపడుతోందనుకుంటున్న కశ్మీర్‌లో మళ్ళీ అగ్గిరాజేసేందుకు విశేష ప్రయత్నాలు జరుగుతున్నాయని పహల్గాం ఘటన హెచ్చరిస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, సయోధ్యతో, సమష్టిగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

వ్యవస్థలు కాదు, రాజ్యాంగమే సర్వోన్నతం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

వ్యవస్థలు పరస్పరం గౌరవం కోల్పోయి ఒక దానిపై మరొకటి దాడి చేస్తే దేశంలో అరాచక పరిస్థితి నెలకొంటుందనడంలో సందేహం లేదు. వ్యవస్థలు బలహీనపడితే వర్తమానంలో ప్రయోజనాలు లభిస్తాయని భావించేవారుంటారు కాని దీనివల్ల దీర్ఘకాలికంగా దేశం నష్టపోతుందని వివేకవంతులు గ్రహిస్తారు. ఇవాళ దేశంలో సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్ విచక్షణాధికారాల్ని ప్రశ్నిస్తోంది. రెండవ ఉన్నత రాజ్యాంగాధినేత అయిన ఉపరాష్ట్రపతి సర్వోన్నత న్యాయస్థానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ఎంపీ ఒకరు మరింత ముందుకుపోయి దేశంలో ప్రజల మధ్య యుద్ధాల్ని ప్రేరేపిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తినే నేరుగా ఆక్షేపించారు. ఆ ఎంపీపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకునేందుకు అనుమతినివ్వాలని అటార్నీ జనరల్‌ను సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ కోరింది. తమ పార్టీ ఎంపీ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి నిమిత్తం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అన్నారు కాని ఆ ప్రజా ప్రతినిధి నోటికి అడ్డుకట్ట వేసే చర్యలు మాత్రం తీసుకోలేదు!

అసలు దేశంలో ఏం జరుగుతోంది? వ్యవస్థల మధ్య సమన్వయం ఎందుకు ఏర్పడడం లేదు? వ్యవస్థల మధ్య సంఘర్షణాయుత వైఖరి ఏర్పడుతోందని చెప్పేందుకు ఈ ఉదంతాలు తోడ్పడుతున్నాయి. అందుకు కారణం ఎవరన్నది మాత్రం చర్చనీయాంశం. మూడేళ్ల క్రితం వరకూ గవర్నర్‌గా ఉన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత దుబే ఎవరూ ప్రేరేపించకుండానే సర్వోన్నత న్యాయస్థానాన్ని, భారత ప్రధాన న్యాయమూర్తిని తీవ్రంగా విమర్శిస్తారా అన్న అనుమానాలకు మాత్రం ఆస్కారం ఉన్నది. ఈ దేశంలో న్యాయస్థానాలను విమర్శించేందుకు అనేక కారణాలు ఉండవచ్చు. న్యాయవ్యవస్థలో కూడా అవినీతి ఉండవచ్చు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు, కోర్టుల్లో విచారణ జరుగుతున్న తీరు, వాయిదాలు, ఆలస్యాలు ప్రశ్నార్థకం కావచ్చు. కాని న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టవల్సిన బాధ్యత మాత్రం అందరిపై ఉన్నది. ఎందుకంటే జరుగుతున్న పరిణామాలపై అంతిమంగా తీర్పు చెప్పవల్సింది మాత్రం న్యాయవ్యవస్థే. ఈ దేశంలో అనేకసార్లు ప్రభుత్వాలు పాల్పడిన అరాచకాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన ఘనత న్యాయ వ్యవస్థదే అన్నది స్పష్టం. అందువల్ల న్యాయ వ్యవస్థ తన్ను తాను మెరుగుపరుచుకునేందుకు తోడ్పడుతూ, అదే సమయంలో తన తప్పులు కూడా సవరించుకోవాల్సిన బాధ్యత చట్టసభలు, కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే ఉన్నది.

ఈ దేశంలో గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగపరుస్తున్నారని వస్తున్న విమర్శలు కొత్తవి కాదు. కాంగ్రెస్ హయాంలో ఈ వ్యవస్థ అమితంగా దుర్వినియోగమయింది. రామ్‌లాల్, కుముద్‌బెన్ జోషీ, రమేశ్ భండారీ లాంటి వారు వ్యవహరించిన తీరు చరిత్రలో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టేందుకు గవర్నర్లను కాంగ్రెస్ ఉపయోగించుకున్న ఉదంతాలు ఎన్నో కదా. యూపీఏ ప్రభుత్వ హయాంలో బిహార్‌లో నితీశ్ కుమార్‌కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ అప్పటి గవర్నర్ బూటాసింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించకుండా రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. మన్మోహన్ సింగ్ మంత్రివర్గం ఈ సిఫారసును ఆమోదించింది. రాష్ట్రపతి పాలన ఆదేశాలపై సంతకాలు చేసే పత్రాలను రష్యా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు పంపించి నడిరాత్రి సంతకాలు చేయించారు. సుప్రీంకోర్టు రాష్ట్రపతి పాలనను రద్దుచేసి నితీశ్ కుమార్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనితో బూటాసింగ్ తన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఇక్కడ గవర్నర్, రాష్ట్రపతి రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లా కాదా? సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోతే ఏమయి ఉండేది? బూటాసింగ్ తర్వాత బిహార్ గవర్నర్‌గా ఉన్న గోపాలకృష్ణ గాంధీ, నితీశ్ ప్రభుత్వం ఎడా పెడా జారీ చేసిన అనేక ఆర్డినెన్స్‌లను నిలిపివేశారు. నితీశ్ కుమార్ చాలా సందర్భాల్లో తన తప్పుల్ని గ్రహించి సరిదిద్దుకున్నారు. గోపాలకృష్ణ గాంధీ మహాత్మాగాంధీ మనుమడు.

ఇదే గోపాలకృష్ణ గాంధీ పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు 2007లో నందిగ్రామ్‌లో తీవ్ర హింసాకాండ జరిగింది. పారిశ్రామిక ప్రయోజనాలకోసం సంకల్పించిన భూసేకరణను గ్రామస్తులు వ్యతిరేకించారు. పోలీసులే కాదు, సీపీఐ(ఎం) కార్యకర్తలు కూడా గ్రామస్తులపై హింసాకాండకు పాల్పడ్డారు. దీనిపై గవర్నర్ ఈ హింసాకాండపై ఆందోళన ప్రకటిస్తూ పత్రికా ప్రకటన చేయాల్సి వచ్చింది. సమస్య పరిష్కరించే పద్ధతి ఇది కాదని ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు గవర్నర్ సూచించారు. మహాశ్వేతాదేవి వంటి గొప్ప రచయిత్రి గవర్నర్‌కు ఫోన్ చేసి 'ఏదైనా చేయండి ప్లీజ్' అని అభ్యర్థించారు. గోపాలకృష్ణ గాంధీ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఇంటికి స్వయంగా వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకురావల్సిందిగా కోరారు. అప్పుడు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మద్దతునిస్తోంది. 'కావాలంటే నన్ను తీసేయమని చెప్పండి' అని గోపాలకృష్ణ గాంధీ ముఖ్యమంత్రికి చెప్పారు. 'నేను అలాంటి వ్యక్తిని కాదు' అని బుద్ధదేవ్ భట్టాచార్య అన్నారు. ప్రధాని మన్మోహన్ సింగ్ బుద్ధదేవ్‌కు ఫోన్ చేసి 'మీకు గోపాలకృష్ణ గాంధీ కంటే మంచి గవర్నర్ దొరకడు. ఆయన ఆందోళనను అర్థం చేసుకోండి..' అని నచ్చజెప్పారు. చివరకు పరిస్థితి సద్దుమణిగింది. నందిగ్రామ్‌లో జరిగిన హింసాకాండ రాజ్యాంగ వ్యతిరేకమని హైకోర్టు కూడా తీర్పునిచ్చింది. ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు చర్యలను తొలుత గవర్నర్, తర్వాత హైకోర్టు సరిదిద్దింది. గ్రామీణులకు అనుకూలంగా మాట్లాడి, హింసాకాండను అరికట్టిన గోపాలకృష్ణ గాంధీ లాంటి గవర్నర్‌లు ఇప్పుడు ఎంత మంది ఉన్నారు?

గవర్నర్ పదవిలో ఉన్న వ్యక్తి ప్రభుత్వం– ప్రతిపక్షానికీ మధ్య నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నట్లు కనపడాలి. యూపీఏ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ హయాంలో అన్ని వ్యవస్థలతో సహా గవర్నర్ వ్యవస్థను కూడా సరిదిద్దేందుకు నరేంద్రమోదీకి అవకాశం లభించింది. కాని ఆయన వ్యవస్థలను మెరుగుపరచడంలో ఆసక్తి చూపలేదు. అదే సమయంలో కాంగ్రెస్ దారిలోనే ఆ వ్యవస్థలను తనకు అనుకూలంగా ఉపయోగించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఎవరన్నా ప్రశ్నిస్తే గతంలో జరగలేదా అని నిలదీసేందుకు ఆస్కారం ఉన్నదని ఆయనకు తెలుసు. 'రాజకీయాల్లో సరైనది న్యాయవ్యవస్థకు సరైనదని అనిపించకపోవచ్చు' అని కాంగ్రెస్ నేతలు భావించేవారు. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో నడుస్తోంది.



akbar

> అసలు పార్లమెంట్, సుప్రీంకోర్టుల్లో ఏది గొప్ప అన్న చర్చ ఎందుకు తలెత్తుతోంది? చట్టసభలు, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఈ మూడింటికీ రాజ్యాంగం వేర్వేరు అధికారాలను ఇచ్చింది. అవి తమ తమ పరిధుల్లో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాపాడుతూ పనిచేయాల్సిందే.. వ్యవస్థల్ని గౌరవిస్తున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారా అన్నదే ప్రధానం. రాజ్యాంగ గౌరవాన్ని కాపాడితే అన్నీ సర్దుకుంటాయి.

న్యాయవ్యవస్థే చట్టాలు చేస్తే పార్లమెంట్ ఎందుకు.. ప్రభుత్వాన్ని వారే నడుపుకోవచ్చు కదా అని కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే పార్లమెంట్ నిజంగా చట్టాలు చేస్తోందా.. ప్రభుత్వాన్ని అడ్డుకుంటుందా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. అసలు పార్లమెంట్, సుప్రీంకోర్టుల్లో ఏది గొప్ప వ్యవస్థ అన్న చర్చ ఎందుకు తలెత్తుతోంది? చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఈ మూడింటికీ రాజ్యాంగం వేర్వేరు అధికారాలను ఇచ్చింది. ప్రతి ఒక్క వ్యవస్థ బాధ్యతలను నిర్దేశించింది. అవి తమ తమ పరిధుల్లో రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాపాడుతూ పనిచేయాల్సిందే.. ఈ మూడు వ్యవస్థలను నిర్దేశించే రాజ్యాంగమే అన్నిటికన్నా గొప్పది అని చెప్పక తప్పదు.

రెండేళ్ల క్రితం పంజాబ్‌లో గవర్నర్ అసెంబ్లీనే సమావేశపరిచేందుకు నిరాకరించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో ఆయన సభను సమావేశపరిచారు. ఆ తర్వాత మనీ బిల్లులతో సహా ఏడు బిల్లులను ఆమోదించకుండా తన వద్దే ఉంచుకున్నారు. దానిపై ప్రభుత్వం ఆర్టికల్ 32 క్రింద మళ్లీ కోర్టుకు వెళ్లింది. రాజ్యాంగంలోని అధికరణ 200 క్రింద గవర్నర్ బిల్లులను తన వద్ద ఉంచుకోవడానికి వీల్లేదని అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తీర్పునిచ్చారు. తాజాగా తమిళనాడు గవర్నర్ విషయంలో కూడా సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ వ్యవహరించలేదు. గవర్నర్ తన వద్ద బిల్లులను ఇష్టం వచ్చినంతకాలం ఉంచుకునేందుకు వీలు లేదని స్పష్టం చేసింది. నిర్దిష్ట కాలపరిమితి లోపు వాటిపై నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. నిజానికి గతంలో దాదాపు మూడేళ్ల పాటు బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచిన ఉదంతాలు లేనే లేవు. సుప్రీంకోర్టును ప్రశ్నిస్తున్నవారు అసలీ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఎందుకు ప్రశ్నించడం లేదు? రాష్ట్రపతిని కూడా సుప్రీం నిర్దేశిస్తుందని విమర్శిస్తున్నారు కాని రాష్ట్రపతి అనే వ్యక్తి కేంద్ర మంత్రివర్గ సిఫారసులకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందన్న విషయం వారు మరిచిపోతున్నారు. రాష్ట్రపతి పదవి వివాదంలో పడుతున్నదంటే అందుకు కారణం ఆయనను నిర్దేశించే కేంద్ర ప్రభుత్వానిదే కారణం. బూటాసింగ్ బిహార్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫారసు చేసినప్పుడు ఉన్నతమైన వ్యక్తి అని ఎందరో భావించే అబ్దుల్ కలామ్ కూడా వివాదంలో పడ్డారు.


ప్రభుత్వంతో న్యాయవ్యవస్థకు సుహృద్భావ సంబంధాలు ఉండాలని దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్యతో అన్నారు. 'సుహృద్భావ సంబంధాలు అవసరం లేదు, సరైన సంబంధాలు ఉంటే చాలు' అని సీజేఐ జవాబిచ్చారు. ప్రభుత్వం, న్యాయవ్యవస్థల మధ్య సరైన సంబంధాలు ఉంటే బండి సక్రమంగా నడుస్తుంది. కాని న్యాయవ్యవస్థను తన దారికి అడ్డంగా తొలగించుకోవాలని ప్రభుత్వం భావిస్తే అది వేరే సంగతి. గతంలో ఇందిరాగాంధీ అలాంటి పని చేసి చరిత్రలో నియంతగా నిలిచిపోయారు. వ్యవస్థల్ని గౌరవిస్తున్నారా లేదా అన్నది ప్రశ్న కాదు. రాజ్యాంగాన్ని అయినా గౌరవిస్తున్నారా అన్నదే ప్రధానం. రాజ్యాంగ గౌరవాన్ని కాపాడితే అన్నీ సర్దుకుంటాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఆవు కతలు ఆపండి భూమనా!

గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో రాజకీయాలన్నీ గోవు చుట్టూ తిరుగుతున్నాయి. ఆరోపణలు, విమర్శలు, సవాళ్లు, వివరణలు, మీడియా సమావేశాలతో అంతా సందడిగా ఉంది. దేవుడిని రాజకీయాల్లోకి దిగలాగుతున్న తీరు చూసి శ్రీవేంకటేశ్వరుని భక్తులు నివ్వెరపోతున్నారు. ఏది నిజమో, ఏది అసత్యమో అర్థం కాని అయోమయం నెలకొని ఉంది. తిరుపతివాసిగా, తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తుడిగా, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడిగా నాకు తెలిసిన సంగతులను వివరిస్తాను.

తిరుపతిలోని టీటీడీ గోశాలలో ఆవుల మరణం వాస్తవమే. కాకపోతే ఈ మరణాలు హఠాత్తుగా ఇప్పుడు మాత్రమే సంభవించినవి కాదు. అనేక సంవత్సరాలుగా గోశాలలో ఆవులు చనిపోతూనే ఉన్నాయి. ఇందుకు అనేక కారణాలూ ఉన్నాయి. వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నట్టుగా సరైన పోషణ లేకపోవడంగానీ, తగినంత గడ్డి, నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడంగానీ, వైద్యం అందకపోవడంగానీ దీనికి కారణాలు కాదు. టీటీడీ గోశాలలో గోసంరక్షణ ఎలా ఉంటుందో అందరికన్నా ఎక్కువగా ఈ ఆరోపణలు చేస్తున్న భూమన కరుణాకరరెడ్డికే తెలుసు. ఎందుకంటే తొమ్మిదేళ్ళ పాటు టీటీడీ పాలకమండలిలో సభ్యుడిగానూ, అధ్యక్షుడుగానూ ఉన్న ఏకైక వ్యక్తి ఆయన మాత్రమే. పశుదాణా, గడ్డి కొనుగోలు, నాణ్యత విషయంలో గతంలో ఎన్నో సందర్భాల్లో చర్చ జరిగింది. అవే మార్గదర్శకాలు ఇప్పటికీ అమలులో ఉన్నాయి. ఈ విషయం కూడా కరుణాకరరెడ్డికి తెలిసినంతగా ఇతరులకు తెలియదు.



మనం నిత్యం పూజించే దేవత గోవు. అటువంటి గోవులకు తిండి పెట్టకుండా, సరైన పోషణ చేయకుండా చనిపోయే స్థితి ఎవరైనా కల్పిస్తారని మనిషి అయినవారెవరూ అనలేరు. టీటీడీతో ఇంత అనుభవమూ అనుబంధమూ ఉన్న భూమన కరుణాకరరెడ్డి కేవలం శుష్క రాజకీయ ప్రయోజనాల కోసం ఇన్ని అబద్ధాలు చెప్పడం అన్యాయం. ఏ సంస్థ మీ ఉనికికి గౌరవాన్ని కల్పించిందో, ఆ సంస్థ మీదే నిత్యం బురద చల్లుతూ ఉండడం అంటే తల్లి పాలు తాగి ఆమెనే తూలనాడడం కాదా భూమనా? గోవుల సహజమరణాలను అసహజమంటూ పదేపదే చెప్పడం ఏమి రాజకీయం?

అసలు టీటీడీ గోశాలలో గోవుల మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయో కూడా తెలుసుకోవాలి. సాధారణంగా గోవులు కాస్త చల్లదనం ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువకాలం జీవిస్తాయి. అత్యంత వేడి ప్రదేశాల్లో తిరుపతి ఒకటి. ఇక్కడ వేసవిలో 47, 48 డిగ్రీల దాకా నమోదవుతూ ఉంటుంది. అందుకే వేసవిలోనే గోవుల మరణాలు అధికం. ఈ విషయం గోశాల రికార్డులు పరిశీలిస్తే అర్థం అవుతుంది. అప్పటికీ గోశాలలో ఎయిర్ కూలర్లతో వేడి తగ్గించే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అయినా ఎండాకాలం గోవులు సరిగా తిండి కూడా తినవు. బక్కచిక్కి చనిపోతూ ఉంటాయి. ఎన్నో ఏళ్లుగా ఇలా జరుగుతూనే ఉంది.

రోజూ లక్షమంది యాత్రికులు వచ్చిపోయే తిరుమల వంటి చోట ఒకటో, అరో పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. వాటిని భూతద్దంలో చూపించి తిరుమల పవిత్రతను మంటగలపాలనే ఆలోచనా, ప్రయత్నం మొన్నటిదాకా స్వామి ప్రథమ భక్తుడనని చెప్పుకుంటూ, పాలకమండలి పదవిలో ఉన్నన్నాళ్లు నుదుట తిరునామంతో కనిపించిన భూమన కరుణాకరరెడ్డి చేయడం తగునా? టీటీడీ కొలువులో ఉన్నకాలంలో ఆయన చెప్పిన మాటలన్నీ ఉత్తవే అనీ, మానవీయ విలువల గురించి భూమన వల్లెవేసిన మాటలన్నీ అబద్ధాలే అనీ, ఆయన కూడా పక్కా రాజకీయ నాయకుడే అనీ ఈ పరిణామాలతో అందరూ గ్రహిస్తున్నారు.

పాలకమండలి అధ్యక్షుడికి కావాల్సింది స్వామి పట్ల అచంచలమైన భక్తి విశ్వాసాలు, ధార్మిక సంస్థ సంరక్షణ విషయంలో చిత్తశుద్ధి, భక్తుల మనోభావాల పట్ల గౌరవం, అవినీతి రహితంగా ఉండడం.. ఇంతేతప్ప రెండు పద్యాలు చెప్పగలగడం కాదు. ప్రస్తుత పాలకమండలి అధ్యక్షుడికి భూమన విసిరిన సవాలు వింటే నవ్వు వస్తుంది. అలా అయితే, టీటీడీ పాలకమండలి మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి గారికి ఎన్ని పద్యాలు తెలుసు? మీకంటే నాటక అనుభవం ఉంది గనుక, పద్యాలు చెప్పగలరు. తెలుగు భాష ఉత్సవాల పేరుతో, జాతర పేరుతో ఎంతెంత వసూళ్లు చేశారో, స్వామి సొమ్మును ఎలా కరిగించారో చెప్పుకుంటూ పోతే చాంతాడంత వస్తుంది. పబ్లిసిటీ కోసం పాకులాట మానేసి కాస్త హుందాగా వ్యవహరించండి. నిజంగా తప్పు జరిగితే విమర్శలు చేయండి. టీటీడీ వంటి సంస్థ పరువు బజారులో మాత్రం పెట్టకండి.

– ఓ.వి. రమణ
టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు

జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం

ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షిజాతులు నశిస్తున్నాయి. అందులో పిచ్చుకలు అంతరించి పోయే పక్షి జాతుల్లో మొదటి వరుసలో ఉన్నాయి. నగరీకరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోంది. దానికి తోడు వాతావరణంలో మార్పులు, విపరీతమైన ఎండలు, తగ్గుతున్న హరితం వల్ల కూడా అవి అంతరించిపోయే దశకు చేరుతున్నాయి. పక్షులు కీటకాల సంతతిని అదుపులో ఉంచుతాయి. తద్వారా పంటల పెరుగుదలకు ఊతమిస్తాయి. ఒక పక్షి జాతి లేదా జంతు జాతి నశిస్తే, దానితో పాటు పర్యావరణ సమతుల్యత అదుపు తప్పుతుంది. మరిన్ని విపరిణామాల్ని మానవాళి నెత్తిపై రుద్దుతుంది. కాబట్టి అలాంటి విపత్తు సంభవించకుండా సమాజం జాగ్రత్త వహించాలి. జీవరాశుల ఉనికికి భంగం కలగకుండా, వాటి మనుగడకు సహకరించాలి. ఇంటి ఆవరణలో ఒక మట్టి పాత్రను నీటితో నింపి ఉంచొచ్చు. అది చిన్న పనిలా మనకు అనిపించినా, దాహంతో ఉన్న పక్షికి అదే పెద్ద సాయం. ఒక్కోసారి వాటి ప్రాణం నిలుస్తుంది. అలాగే పూర్వం మన ఇళ్లల్లో, పశువుల శాలల్లో చూరుకి వరి కంకులు వేలాడదీసేవారు. పిచ్చుకలు, ఇతర చిన్న పక్షులు హాయిగా వచ్చి చేరేవి. ఆ అలవాటుని మళ్లీ మనం వాడుకలోకి తీసుకురావాలి. జీవవైవిధ్యం, జీవ సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగించాలి. పెద్ద పెద్ద ఉపన్యాసాల కన్నా క్షేత్ర పరిధిలో చిన్న చిన్న సమూహాలకు నేర్పే అలవాట్లు పెద్ద మార్పుని తీసుకువస్తాయి.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

డీలిమిటేషన్.. సమన్యాయం జరగాలి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170 ప్రకారం పార్లమెంట్‌లోని సభ్యుల సంఖ్య జనాభాను అనుసరించి ఉండాలి! జనాభా ముఖ్య ప్రాతిపదిక అయినప్పుడు రాష్ట్రాలలోని ఎంపీ సీట్ల విషయంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఇదే ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో పెద్ద సమస్యగా మారింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాల నిర్ణయానుసారం కుటుంబ నియంత్రణ అమలుచేయడం వల్ల లోక్‌సభ, శాసనసభల్లో దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గుతూ వచ్చాయి. మంచి చేసినందుకుగాను మాకు నష్టం వాటిల్లే రీతిలో డీలిమిటేషన్ నిర్ణయాలు జరిగాయని దక్షిణాది రాష్ట్రాల ప్రజలు వాపోతున్నారు. దేశ నిర్ణయాలలో తమ పాత్ర, జోక్యం క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ ప్రాతిపదిక మూలాలను వారు ప్రశ్నిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం ఇచ్చిన సమాచారం ప్రకారం మొదటి సార్వత్రిక ఎన్నికలలో (1951–52) 489 (లోక్‌సభ) సీట్లు ఉన్నాయి. 1951 నుంచి 2004లో జరిగిన పెంపునకు (డీలిమిటేషన్ కమిషన్ నిర్ణయానుసారం) ప్రత్యేక ఫార్ములాగా ఐడియల్ జనాభా సంఖ్య అంటూ అనుసరించినట్లు లేదు. జనాభా ప్రాతిపదికన నిర్ణయాలు చేసినప్పుడు రాజకీయ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే విధంగా డీలిమిటేషన్‌ను సంస్థీకరిస్తే శాశ్వతంగా దక్షిణాది ప్రాంతాల వారికి గణనీయమైన నాయకత్వం, రాజకీయ పలుకుబడి–ప్రాముఖ్యత కేంద్రంలో ఉండకపోవచ్చనే వాదనను కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాధాకృష్ణన్, నీలం సంజీవరెడ్డి, వి.వి. గిరి, కె.ఆర్. నారాయణన్ వంటి వారు రాష్ట్రపతులుగా, పీవీ నర్సింహారావు, దేవెగౌడ వంటి వారు ప్రధానమంత్రులుగా అయ్యారు. డీలిమిటేషన్– జనాభా ప్రాతిపదిక మీదనే కొనసాగితే ఇక అలాంటి అవకాశం ఉండకపోవచ్చు!

నిజమైన గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ (జీడీపీ) ఏ విధంగానైతే ద్రవ్యోల్బణం ఆధారంగా (ఇన్‌ఫ్లేషన్) నిర్ణయించి, అన్ని రాష్ట్రాలకు లాభం కలిగిస్తారో; అదే విధమైన రీతిలో ఎక్కువ జనాభా ఉన్నా, అన్ని రాష్ట్రాలకు సంఖ్యాపరంగా లోక్‌సభ, విధానసభలలో న్యాయం చేసే అంశంపై కూడా కేంద్రం లోతుగా సమీక్షించి నిర్ణయం తీసుకోవాలి. 1977లో లోక్‌సభ సీట్లు 10.10 లక్షల సరాసరి జనాభాను పరిగణనలోకి తీసుకొని 543 సీట్లు ఏ విధంగా నిర్ణయించారో, ఇప్పుడు కూడా ఆ సూత్రాన్నే అనుసరిస్తే 680 సీట్లు వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణుల అంచనా! టోటల్ ఫర్టిలిటీ రేట్ – రాష్ట్రాల పరంగా కూడా అందుబాటులో ఉంటుంది కాబట్టి, ఈ సూత్రాన్ని అనుసరించి కొంతవరకు అన్ని రాష్ట్రాలకూ న్యాయం చేయొచ్చు! ప్రజా విశ్వాసమే– ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ!

– రావులపాటి సీతారాంరావు

అమరావతి 2.0

మే నెల రెండవ తేదీన భారత ప్రధానమంత్రి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునరుజ్జీవనంతో– అమరావతి 2.0 దశ మొదలవుతోంది. సరిగ్గా పదేళ్ళముందు, అమరావతి 1.0ని ప్రారంభించిన ప్రధాని మోదీ, తానే తిరిగి పదేళ్ళ తర్వాత కేంద్ర ప్రభుత్వ భారీ సహాయంతో మళ్ళీ అమరావతి 2.0ని మొదలుపెడతానని ఊహించి ఉండరేమో.

2019 మే నెల తర్వాత అయిదేళ్ళు అమరావతి చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. అప్పుడు వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజా రాజధానిని అంధకారంలోకి తోసెయ్యడానికి శతప్రయత్నాలు చేసింది. అమరావతి మొదటి దశలో చేపట్టిన పనులన్నిటినీ నిర్దాక్షిణ్యంగా ఆపేసింది. మొదలై, సగంలో ఉన్న, దాదాపు పూర్తయిన భవనాలను కర్కశంగా పాడుబెట్టేసారు. భూములిచ్చిన పుణ్యానికి అమరావతి రైతులను, మహిళలను జుట్టుపట్టి వీధుల్లోకి ఈడ్చారు. పోలీసులు స్త్రీలని కూడా చూడకుండా బూటు కాళ్ళతో పొట్టలో తన్నారు. వందల కేసులు పెట్టారు. ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టాన్ని ప్రయోగించి జైలుపాలు చేసారు. కానీ రైతులు ధైర్యం వీడలేదు. మనోనిబ్బరాన్ని కోల్పోలేదు. రాష్ట్రమంతా వారికి బాసటగా నిలబడింది. ఐదేళ్ళ పాటు అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఎదిరించి అమరావతి ఉద్యమం కొనసాగింది. 2024 ఎన్నికల్లో వైసీపీ చేసిన అన్యాయాలకు ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతూ చిత్తుగా ఓడించారు. నిజం గెలిచింది. నేడు అమరావతి బావుటా మళ్ళీ రెపరెపలాడుతున్నది.


ఇన్ని కష్టాల తర్వాత అమరావతి పునరుజ్జీవనం ఎలా సాధ్యమైంది? నిశ్చయంగా కేంద్రం భారీ సహాయం చేసింది, సందేహమే లేదు. కేంద్రం ఇస్తున్న రూ.15వేల కోట్లు, ప్రపంచ బ్యాంక్, ఆసియా డెవెలప్మెంట్ బ్యాంక్ అప్పుగా ఇస్తున్న 800 మిలియన్ల అమెరికా డాలర్లు, హడ్కో సంస్థ ఇచ్చిన రూ.11 వేల కోట్లు, కేఎఫ్‌డబ్ల్యుతో చర్చల్లో ఉన్న రూ.5వేల కోట్లు.. ఇవీ ప్రస్తుతానికి రాబోతున్న నిధులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వంత బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా అమరావతికి కేటాయించలేదు. మొత్తం సీఆర్డీయే అప్పుగా తీసుకొని, రాబోయే వివిధ సంస్థలు, భూమి మానిటైజేషన్ తదితర ఆదాయాలతో మాత్రమే ఆ అప్పు చెల్లించాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం.

అమరావతిలో మొదటి ఫేజ్‌లో 7,420 చదరపు కిలోమీటర్లు. ఇందులో కోర్ క్యాపిటల్ ఏరియా 217 చ.కి.మీ మాత్రమేగాక, కృష్ణ జిల్లాలోని విజయవాడ పట్టణం, చుటుపక్కల ప్రదేశాలు, గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి లాంటి మరికొన్ని పట్టణాలు కూడా ఉంటాయి. దేశంలోని మిగతా రాజధానులు వేగంగా ఎదుగుతున్నట్టే అమరావతి పెరిగి గుంటూరును తాకే రోజు దగ్గరలోనే ఉంది. 217చ.కి.మీ కోర్ క్యాపిటల్ ప్రదేశంలో కలిసి ఉండే 16.9చ.కి.మీ ప్రధాన రాజధాని ప్రదేశంలోనే సచివాలయం, శాసనసభ, శాసనమండలి భవనాలు, హైకోర్టు భవనాలు మంత్రుల, జడ్జీలు, సివిల్ సర్వీస్ అధికారుల నివాసాలు తదితరాలు ఉంటాయి.

> అమరావతి కోర్ రాజధాని మొదటి దశ అభివృద్ధికి బడ్జెట్ సుమారు రూ.65వేల కోట్లను, 73 పనులుగా విభజించి టెండర్లు పిలిచేసారు. చాలవాటికి బిడ్డర్లను ఖరారు చేసారు. ఈ పనులకే ప్రధానమంత్రి ప్రారంభం చేయనున్నారు. నేడు అమరావతి రోడ్లు భారీ యంత్రాలు, ట్రక్కులు, పైల్ డ్రైవర్లు, ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లు, క్రేన్‌లు, కాంక్రీట్ మిక్సర్లతో క్షేత్ర స్థాయి సన్నాహాలతో నిర్మాణ జాతరలా సందడిగా ఉన్నది.

కృష్ణా తీరాన ప్రఖ్యాత ఫోస్టర్ అండ్ పార్టనర్స్ సంస్థ డిజైన్ చేసిన అమరావతి 25–30 ఏళ్లలో దశల వారీగా, 2050 నాటికి ఒక ఆర్థిక కేంద్రంగా మారి, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులతో, పరిశ్రమలతో, వ్యాపారస్థులతో, వృత్తి నిపుణులతో, 15 లక్షల ఉద్యోగాలతో, 35 లక్షల జనాభాతో 35 బిలియన్ల డాలర్ల స్థూల ఉత్పత్తితో ఉంటుందని అంచనా. ఉదాహరణకు విజ్ఞాన సిటీ అనబడే ప్రాంతంలో ఇప్పటికే దాదాపు 22,000 విద్యార్థులతో ఎస్ఆర్ఎం, వీఐటీ, అమృత విశ్వవిద్యాలయాలు, ఎస్ఐడీ విజయవంతంగా నడుస్తున్నాయి. బిట్స్, ఎక్స్ఎల్ఆర్ఐ, నిర్మాణాలు ప్రారంభించగా; పర్డ్యు, టోకియో, జార్జియా యూనివర్సిటీ లాంటివి చర్చల్లో ఉన్నాయి. ఎయిమ్స్ ఆసుపత్రి ఇప్పటికే మంగళగిరిలో పూర్తి స్థాయిలో నిర్వహణలో ఉంది.

ప్రపంచ ప్రఖ్యాత పట్టణాలైన ఆమ్‌స్టర్‌డాం, టోక్యో, సింగపూర్‌లను ప్రేరణగా తీసుకొని రాజధానిని తొమ్మిది భాగాలుగా విభజించి విజ్ఞానం, ఆరోగ్యం, ఎలక్ట్రానిక్స్ టూరిజం, న్యాయ, క్రీడా, ఆర్థిక, ప్రభుత్వ మండలాలుగా నిర్వచించారు. ప్రపంచంలోని ప్రఖ్యాత పరిశ్రమలు, వ్యాపారాలు ఇక్కడ పెట్టుబడి పెట్టే విధంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. మొదటి అమరావతి మాస్టర్ ప్లాన్ చేసిన సింగపూర్ ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం రాగానే వెళ్ళిపోయింది. ఇప్పుడు సింగపూర్ ప్రభుత్వంతో మళ్ళీ వ్యాపార సమాలోచనలు మొదలుపెట్టారు.



అమరావతి కోర్ రాజధాని మొదటి దశ అభివృద్ధికి బడ్జెట్ సుమారు రూ.65 వేల కోట్లను, 73 పనులుగా విభజించి టెండర్లు పిలిచేసారు. చాలా వాటికి బిడ్డర్లను ఖరారు చేసారు. వివిధ ఆర్థిక సంస్థల నుండి మొదటి దశ నిధులు దాదాపు వచ్చేసాయి. ఈ పనులకే ప్రధాన మంత్రి మే 2న ప్రారంభం చేయనున్నారు. నేడు అమరావతి రోడ్లు భారీ యంత్రాలు, ట్రక్కులు, పైల్ డ్రైవర్లు, ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లు, క్రేన్‌లు, కాంక్రీట్ మిక్సర్లతో క్షేత్ర స్థాయి సన్నాహాలతో నిర్మాణ జాతరలా సందడిగా ఉన్నది.

కూటమి ప్రభుత్వం అమరావతి విస్తీర్ణానికి సంబంధించి కొన్ని అదనపు మార్పులు కూడా చేస్తున్నది. అమరావతిలో భవిష్యత్తులో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం కావాలి అనే ఉద్దేశ్యంతో దానికి కూడా స్థల సేకరణ జరపాలని తలపెట్టారు. వాటితో పాటు వ్యాపారాల కోసం స్మార్ట్ సిటీ; హైదరాబాద్‌కు, విశాఖపట్నానికి, మచిలీపట్నం పోర్టుకి రహదారులకు సులభ ప్రవేశం కోసం ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డు లాంటివి కూడా తలపెట్టారు. కానీ వీటికి మళ్ళీ ఒక 35–40 వేల ఎకరాలు అవసరం అవుతాయి. ఈ స్థలసేకరణ, రైతుల వద్ద నుంచి భూమిని పూలింగ్ పద్ధతిలో చేయాలా, లేక భూసేకరణ పద్ధతిలో చేయాలా అనే విషయంలో చర్చలు జరుగుతున్నాయి. ఇంకా తుది నిర్ణయానికి రాలేదు.

ఈ అమరావతి పునరుజ్జీవన తరుణంలో వైసీపీతో పాటుగా కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలూ వద్దు అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. రైతుల భూముల ధర నిలవాలన్నా పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలి. విదేశాల నుంచి వచ్చి ఇండస్ట్రీస్ పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటీ ఉండాలి. అవి వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి, జనాభా పెరుగుతుంది. భూములిచ్చిన రైతు సోదరులకు మూడేళ్లలో రాజధాని మొదటి దశ నిర్మాణం పూర్తి చేస్తాం అని ప్రభుత్వం సాధికారికంగా హామీ ఇస్తోంది.

కానీ అమరావతిని 2019 నుంచి నాశనం చేసిన వారు మాత్రం ఇంకా ఆశలు చావక, ఇటీవల మళ్ళీ ప్రపంచ బ్యాంక్‌కు లెటర్లు, మెయిళ్లు పంపడం లాంటివి మొదలు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ దుశ్చర్యలను గమనించి ఊరుకోకూడదు. అమరావతి మీద విషాన్ని పోసే కార్యక్రమాలని అడ్డుకోవాలి. ప్రజలు జాగరూకులై ఉండి అమరావతిని ఈ ముష్కరుల దుశ్చర్యల నుండి కాపాడుకోవాలి.

■ **నీలాయపాలెం విజయ్‌కుమార్**
చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బయో డైవర్సిటీ బోర్డ్



ఔరా..! రాజు కపోతాసనం

అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరంలో ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న పి.షాలెంరాజు చేసిన యోగా విన్యాసాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొని రాజు వి న్యాసాలను చూసి అభినందించారు. తల, మొండాన్ని అలవోకగా వెనక్కి తిప్పేసి రాజు వేసిన రాజ కపోతాసనం ఈ కార్యక్రమంలో హైలైట్‌గా నిలిచింది. అధికారులతో పాటు సభికులను అబ్బురపరిచింది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

వెలవెలా..!

రూ.లక్ష దాటిన బంగారంతో వ్యాపారాలు కుదేలు

బంగారం.. సామాన్యుడికి అందనంత ఎత్తుకు ఎదిగిపోయింది. రూ.లక్ష దాటేసి అటు వి నియోగదారులను, ఇటు షాపుల యజమానులను షాక్‌కు గురిచేసింది. ఈ ఏడాదిలో ఏకంగా 20 సార్లు ఆల్‌టైమ్ రికార్డులను సృష్టించిన బంగారం.. చిన్న వ్యాపారులను మాత్రం కోలుకోలేని దెబ్బతీసింది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు బంగారం కొనాలో వద్దోనని సామాన్యులు ఆలోచనలో పడుతుంటే, కొనుగోళ్లు లేక వ్యాపారులు దిగాలు పడిపోతున్నారు.



1925-2025 వరకు వందేళ్లలో ప్రతి పదేళ్లకు 10 గ్రాముల బంగారం ధరలు

ఏడాది	రూపాయల్లో..
1925	18.75
1935	30.81
1945	62.00
1955	79.00
1965	72.00
1975	540
1985	2,130
1995	4,680
2005	7,000
2010	18,500
2020	48,480
2025	1,00,135



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న మైలవరంలోని ఓ బంగారు షాపు

ఖాళీగా కనిపిస్తున్న గోల్డ్ షాపులు

కొనేవారు లేక యజమానుల దిగాలు

- ఇక కొనలేమంటున్న సామాన్య వినియోగదారులు
- వారంలో అక్షయ తృతీయ.. కష్టమేనంటున్న వ్యాపారులు



విస్సన్నపేటలోని ఓ షాపులో దిగాలుగా..

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి) : 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,00,135కు, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.92,900కు చేరుకోవడంతో జిల్లాలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు షాక్‌కు గురవుతున్నారు. 2020 నాటి ధరలతో పోలిస్తే ఈ ఐదేళ్లలో బంగారం ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. ఏప్రిల్ ప్రారంభం నుంచి ధరలు పెరుగుతూ వచ్చా యి. పెరుగుతున్న ఈ ధరలు పసిడి ప్రియులను, మధ్య తరగతి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.

మిగతా 6లో..

మాకు అందనంటోంది..



బంగారం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అందనంటూ పరుగెడుతోంది. బంగారం కొనే పరిస్థితి లేదు. ఒకప్పుడు బంగారం కొని దాచుకుందాం అనుకునే వాళ్లం. ఇప్పుడు ఇక అది సాధ్యపడే పనికాదని మిన్నకుంటున్నాం. బంగారం కొనడమంటే ఓ కలగా అనిపిస్తుంది. ధరలు తగ్గితే తప్ప బంగారం కొనలేం.

- కె.ఆదిలక్ష్మి, విస్సన్నపేట

పెట్టుబడి పెట్టలేకపోతున్నాం.



బంగారం పెరుగుదలతో మాకు పెట్టుబడి భారం పడుతోంది. పైగా పెరిగిన ధరలతో కొనే వారు లేక నగదు రొటేషన్ కావట్లేదు. ఇలా పెరుగుతూ ఉంటే మరింత నష్టం తప్పదు. నష్టాలు వస్తే బంగారం షాపులు మూతపడటం ఖాయం. బంగారం ధరలు పెరుగుతున్నా జనం ఎంతో కొంత బంగారం కొంటున్నారే తప్ప వెండివైపు వెళ్లట్లేదు. - కుక్కడపు సతీష్‌కుమార్, జ్యూయలరీ షాపు యజమాని

ఆగని

ఇసుక దుమారం



టెండర్లను రద్దుచేసే కుట్ర

ఇసుక టెండర్ల వివాదం రోజుకో దుమారం రేపుతోంది. ఈ టెండర్లలో స్థానికేతర సంస్థలు ఇష్టానుసారంగా పాల్గొనగా, ఇప్పుడు సదరు సంస్థలను కాపాడేలా అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. అస్మదీయ సంస్థలకు లబ్ధి చేకూరలేదన్న ఉద్దేశంతో ఏకంగా టెండర్లనే రద్దుచేసే కుట్ర జరుగుతుండటం, రద్దు చేస్తున్నట్టు ముందే లీకులు విడుదల చేయడం ఈ వి షయాన్ని ధ్రువీకరిస్తోంది.

- సిండికేట్ రింగ్ బాగోతం బయటపడటంతో తెరవెనుక పన్నాగాలు
- రాష్ట్రేతర కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే అధికారుల ఆలోచనలు
- టెక్నికల్ బిడ్లలో తిరస్కరించని అధికార యంత్రాంగం
- ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థలని తెలిసి కూడా పాస్
- తాజాగా టెండర్లను రద్దు చేసేసి.. మళ్లీ పిలిచే యోచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇసుక టెండర్ల రచ్చ చల్లారకపోగా, మరింత వి వాదాస్పదమవుతోంది. కృష్ణాజిల్లాలోని పామర్రు, పెనమలూరు మండలాల పరిధిలోని చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలకు పిలిచిన టెండర్లపై మరింత దుమారం రేగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు వేసిన సంస్థలపై అనర్హత వేటు వేయకపోగా, అసలు టెండర్లనే రద్దు చేయాలని చూడటంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సిండికేట్ అయిన కాంట్రాక్టు సంస్థల కనుసన్నల్లో జిల్లా అధికారులు పనిచేస్తున్నారన్న అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి.

జీఎస్టీలు మార్చిన విషయాన్ని మరిచారా?

ఇసుక టెండర్లలో స్థానికత అని చూపటానికి కేవలం జీఎస్టీలను తాత్కా లికంగా మార్చారు. వాటి ఫర్మ్ స్థానికేతరంగా ఉన్నపుడు అప్పుడైనా అనుమా నించి అధికారులు పక్కన పెట్టాలి. కానీ, అధికారులు ఆ పని చేయ లేదు. ఇక్కడ కూడా తప్పు జరిగింది. జీఎస్టీలు అవసరాన్ని బట్టి అడ్రస్ మార్చుకోవటం సహజమే అయినా, సంస్థ స్థానిక హోదాను అవి ప్రతిబింబించవు.

ఆ కంపెనీలు ఎక్కడి నుంచి వచ్చాయి?

ఇసుక టెండర్లలో కొన్ని సంస్థలు స్థానికంగా ఫర్మ్ రిజిస్ట్రేషన్ లేకుండా పాల్గొన్నాయి. ఇవి వేరే రాష్ట్రాల్లో వాటి ఫర్మ్ రిజిస్ట్రేషన్స్ చేసుకున్నట్టుగా తెలుస్తోంది. టెండర్లలో స్థానిక జిల్లాకు సంబంధించిన సంస్థలే పాల్గొనాలన్న నిబంధన ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఎలా ప్రవేశం కల్పించారన్నదే వివాదాస్పదంగా మారుతోంది.

టెక్నికల్ బిడ్లలో ఎందుకు పాస్ చేశారు?

టెండర్ల ప్రక్రియలో ముందుగా టెక్నికల్ బిడ్లను తెరుస్తారు. ఆ తర్వాతే ఫైనాన్షియల్ బిడ్లను తెరుస్తారు.

మిగతా 6లో..

స్థానికేతర సంస్థలకు వత్తాసు

ఈ టెండర్లలో నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతర సంస్థలు పాల్గొనటం ఓ ఎత్తయితే, ఆ సంస్థలను కాపాడేలా అధికా రులు వ్యవహరించటమే ఈ వివాదాలన్నిం టికీ కారణం. పొరుగు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు స్థానికతతో సంబంధం లేకుండా టెండర్లలో పాల్గొన్న విషయాన్ని జిల్లా యంత్రాంగం కూడా గుర్తించింది. నిబంధనల ప్రకారం.. ఆ సంస్థల టెక్నికల్ బిడ్లను తెరిచిన క్రమంలోనే పక్కన పెట్టాలి. కానీ, వాటిని పాస్ చేశారు. ఈ బాగోతం బహిర్గతమయ్యాక కూడా జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించలేదు. పైగా టెండర్లను రద్దు చేస్తున్నట్టు లీకులు ఇస్తోంది. జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లార్చటం, అస్మదీయ సంస్థలను కాపాడుకోవటం కోసమే అధికారులు ఇలా చేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. టెండర్లను పూర్తిగా రద్దు చేసేసి, తర్వాత అస్మదీయ సంస్థలకు అనుగుణంగా నిబంధనలను మార్చేసి మళ్లీ టెండర్లు పిలవాలని చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

వాయువేగంగా..

అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు

- ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన ఏపీఏడీసీఎల్
- టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ రిపోర్టు కోసం కసరత్తు
- ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్డు మధ్య ఏర్పాటు చేసే అవకాశం



విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (టీఈఎఫ్ఆర్) రూపకల్పనకు కన్సల్టెంట్ కోసం ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్) రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ను విడుదల చేసింది. రాజధాని అమరావతిలో 5వేల ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీఏడీసీఎల్ అధికారులు టీఈఎఫ్ఆర్ కోసం కన్సల్టెంట్ నియామకానికి శ్రీకారం చుట్టారు. ఈ ఎయిర్‌పోర్టు కోసం అవుటర్, ఇన్నర్ రింగ్‌రోడ్డు మధ్యలో భూములను సమీకరించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. సాంకేతిక, ఆర్థిక, సాధ్యాసాధ్యాలపై దృష్టిపెట్టింది. సమగ్ర నివేదిక ఇవ్వటానికి కన్సల్టెన్సీ సంస్థకు 32 వారాల సమయాన్ని ఏపీఏడీసీఎల్ ఇచ్చింది. ఆసక్తి కలిగిన కన్సల్టెన్సీలు చేయాల్సిన సర్వేలపై కూడా ఆర్ఎఫ్‌పీలో సమగ్ర వి వరాలను పొందుపరిచారు. ముందుగా అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి ప్రీ ఫీజిబిలిటీ స్టడీ చేయాలి.

మిగతా 6లో..

వారి జీతాలు ఆపేయండి

- పదవీ విరమణ చెందినా ఆర్‌డబ్ల్యూఎస్‌లో తిష్ట వేసుకున్న వారిపై ప్రభుత్వ యాక్షన్
- జీతాలు ఆపేయాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పదవీ వి రమణ చెందినా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో తిష్ట వేసుకుని కూర్చున్న ఉద్యోగుల జీతాలను తక్షణం నిలిపి వేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అనధికారికంగా కొనసాగుతున్న ఉద్యోగులను ఇప్పటికే టెర్మినేట్ చేయాల్సిందిగా ఈఎన్‌సీ ఆదేశాలు జారీ చేసినా ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ విద్యాసాగర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కలెక్టర్ లక్ష్మీశకు సమస్యను నివేదించారు. ఈలోపే విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో అనధికారికంగా కొనసాగుతున్న వారి జీతాలు ఆపేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసింది.

జరిగింది ఇదీ..


రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రాకు వచ్చిన ఉద్యోగుల్లో పలువురు.. మిగులు ఉద్యోగులుగా ఉపాధి కల్పన శాఖ సర్‌ప్లస్ మేనేజ్‌మెంట్ సెల్ (సీఎంసీ) పరిధిలోకి వచ్చారు. వీరంతా కార్పొరేషన్ల నుంచి రావటంతో వీరికి 58 ఏళ్ల పదవీ విరమణ హక్కుగా ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్ర విభజన జరిగిన కొత్తలో సీఎంసీలో ఉన్న వీరంతా వివిధ శాఖల్లో పోస్టింగ్‌లు పొందారు. ఈ పోస్టింగ్‌లు నిబంధనలకు విరుద్ధమని తర్వాత క్రమంలో న్యాయస్థానం అక్షింతలు వేసింది. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో చాలామంది వెనక్కి వచ్చేశారు. అయితే, ఆర్‌డబ్ల్యూఎస్‌లో కొనసాగుతున్న వారు రాలేదు. కలెక్టర్, ఉపాధి కల్పనా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు పదేపదే వస్తున్న ఆదేశాలను ఆర్‌డబ్ల్యూఎస్‌లోని ఈ

మిగతా 6లో..

ప్రైవేటు బస్సుల దందా!

సీజన్లలో పెంచేస్తున్న టికెట్ ధరలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల దందా నడుస్తోంది. పండగలు, పెళ్లిళ్ల సీజన్, వేసవి సెలవుల్లో టికెట్ ధరలు ఒక్కసారిగా పెంచేస్తున్నారు. కేవలం సీటుకే సుమారు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు దండుకుంటున్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను నడపటంతో అవి ఎక్కడపడితే అక్కడ మొరాయిస్తున్నాయి. ఆ సమయంలో ప్రత్యామ్నాయ సర్వీసు ఏర్పాటు చేయాల్సి ఉన్నా యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ఇదేంటని ప్రశ్నించిన ప్రయాణికులపై ట్రావెల్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



- ఫిట్‌నెస్ లేని బస్సులతో రాకపోకలు
- మార్గంమధ్యలో మొరాయిస్తున్న సర్వీసులు
- ప్రశ్నిస్తున్న ప్రయాణికులపై దురుసు ప్రవర్తన
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 30 వరకు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ఉన్నాయి. వీటి పరిధిలో 500 వరకు సర్వీసులు నడుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు వి జయవాడ కేంద్రంగా ప్రయాణికులను చేరవేస్తున్నాయి. వి జయవాడ - విశాఖపట్నం, విజయవాడ - హైదరాబాద్‌కు సాధారణ రోజుల్లో ఐదు వందల నుంచి ఏడు వందల రూపాయల వరకు ధరలు ఉంటాయి. అయితే సీజన్లలో మాత్రం ఈ ధరలు సాధారణ రోజుల్లో కంటే రెండు, మూడింతలు ఎక్కువగా ఉంటాయని ప్రయాణికులు చెబుతున్నారు. అదే దూరం అదే బస్సుకు ఎందుకంత డబ్బు వసూలు చేస్తున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు. ధరలను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని విమర్శలు వి నిపిస్తున్నాయి. బస్సు సీట్లకు కవర్లు కూడా ఉండవని, కనీసం శుభ్రపరిచే పరిస్థితి కూడా లేకపోవడంతో అనేక బస్సుల్లో సీట్లు దుర్వాసన వస్తున్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్న ట్రావెల్స్ ప్రయాణికులకు కనీస సదుపాయాలు కల్పించకపోయినా అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని చూస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొరాయిస్తున్న బస్సులు

ఓ సంస్థకు చెందిన ప్రైవేటు బస్సు సోమవారం రాత్రి 10 గంటలకు విజయనగరానికి బయలుదేరింది. సుమారు రాత్రి 12 గంటల సమయంలో హనుమాన్ జంక్షన్ టోల్‌గేట్

మిగతా 6లో..

ఒక్కోసారి గంటల తరబడి రోడ్లపైనే..

ప్రైవేటు బస్సులు మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయని, అలాంటి సందర్భాల్లో రోడ్లపైనే గంటల తరబడి వేచి ఉంచుతున్నారని పలువురు చెబుతున్నారు. లగేజీ, పిల్లలతో ప్రయాణిస్తున్న తమను మధ్యలో రోడ్లపైనే ఉంచడంతో అర్ధరాత్రి వేళ ఏం చేయాలో తెలియని స్థితిలో అయోమయానికి గురవుతు న్నామని వాపోతున్నారు. ఆ మార్గంలో వచ్చే బస్సుల్లో ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప తమ సంస్థకు చెందిన మరో బస్సును ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. ఒక వేళ డ్రైవర్లను ప్రశ్నిస్తే బస్సు ఆగిపోతే మేమేం చేస్తామని, కావాలంటే వేరే బస్సు వచ్చేంతవరకు ఉండండని సమాధానం చెబుతున్నారంటున్నారు.

సర్వోత్తమం.. పుస్తక పఠనం

- ఆరున్నర దశాబ్దాల చరిత్ర.. 62 వేల పుస్తకాలు

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం..

6



ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం అధికార బృందం పరిశీలించింది. దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, కనకదుర్గా దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలు ప్రధాన సలహాదారు, ఇంజనీరింగ్ నిపుణుడు కొండలరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కోటేశ్వరరావు, వైకంఠరావులు నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదం పోటు, అన్న ప్రసాద భవనం, తదితర నిర్మాణాలను పరిశీలించారు. ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అన్ని రకాలుగా సదుపాయాలు కల్పించి, సులభతరంగా దుర్గామల్లేశ్వరుల దర్శనం కల్పించేందుకు త్వరితగతిన అమలు పరిచేందుకు ఈ క్షేత్రస్థాయి పర్యటన చేశారు.



కలెక్టర్ లక్ష్మీశ కుటుంబసభ్యులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కనకదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

మలేరియా, డెంగ్యూ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

కలెక్టరేట్ : మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

అమరావతిలో ఆర్టీరియర్ రోడ్ల ఎలివేటెడ్ కారిడార్ డీపీఆర్‌కు టెండర్లు

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ప్రధాన ఆర్టీరియల్ రోడ్లను ఎలివేటెడ్ కారిడార్ విధానంలో నిర్మించేదుంకు వీలుగా డీపీఆర్ రూపకల్పనకు కన్సల్‌టెంట్ కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) టెండర్లను పిలిచింది. రాజధానిలో ఎన్ - 6, ఎన్ - 13, ఈ - 13, ఈ - 5 రోడ్లను ఆర్టీరియల్ రోడ్లు అంటారు. వీటిని ఎలివేటెడె కారిడార్ విధానంలో నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో ఎన్ 6 రోడ్డు విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కలిసిపోయింది కాబట్టి ఇది లేదు. ఇక మిగిలిన వాటిలో ఎన్ - 13 రోడ్డు శాఖమూరు నుంచి రాయపూడి వరకు ఉంటుంది. ఈ రోడ్డు కింద సర్వీసు రోడ్డు మాత్రమే ఉంటుంది. పైన 8 వరసల ఎలివేటెడ్ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు కృష్ణానది మీద ఐకానిక్ బ్రిడ్జికి అనుసంధానమౌతుంది. ఇది కాకుండా ఈ - 13 రోడ్డు ఎస్ఆర్ఎం యూనివర్శిటీ నుంచి నవులూరు మీదుగా ఎన్‌హెచ్ 16 కు అనుసంధానమౌతుంది. ఇది కూడా ఎలివేటెడ్ కారిడార్‌గా ఉంటుంది. ఈ - 5 రోడ్డు తుళ్ళూరు, పినపాక మీదుగా వెళుతుంది. ఈ రోడ్లన్నీ కూడా 8 వరుసలతో రాజధానికి అనుసంధానమౌతాయి.

ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలి

» ప్రజా సంఘాల జేఏసీ

గాంధీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. లెనిన్ 155వ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ దేశ సహజ సంపదను, ఆదివాసీ సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడాల్సిన పాలకులు కార్పొరేట్ సంస్థలకు ఏజెంట్లుగా మారి అమాయక ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ, ఆదివాసీ ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేసి వారిపై దాడులు చేస్తూ కార్పొరేట్ ఏజెంట్లకు అడవులను దోచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

సంపులో పడి బాలిక మృతి

» పాత ప్రభుత్వాసుపత్రిలో ఘటన

వన్‌టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో మానసిక పరిస్థితి సరిగా లేని బాలిక(8) మంగళవారం మృతి చెందింది. గంగూరు గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు ఇలియాస్ భార్యకు పాతప్రభుత్వాసుపత్రిలోనే కుమార్తె జన్మించింది. పుట్టినప్పటి నుంచి మానసిక స్థితి సరిగ్గా లేని బాలికకు తల్లిదండ్రులు పాత ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం అందిస్తున్నారు. ఎప్పటిలాగానే మంగళవారం బాలికను ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి డాక్టర్‌కు చూపించి తల్లిదండ్రులు మందులు తీసుకోవడానికి కౌంటర్ వద్దకు వెళ్లారు. తమ పక్కనే ఉండాల్సిన కుమార్తె కన్పించకపోవడంతో వారు స్థానిక ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి చెప్పారు. సీసీ పుటేజీ పరిశీలించగా, బాలిక నడుచుకుంటూ ఆసుపత్రి ప్రాంగణంలోని సంపు వద్దకు నడుచుకుంటూ వెళ్లి మురుగునీటిలో పడింది. వైద్యులు సిబ్బంది సాయంతో బాలికను బయటకు తీసి పరీక్షించగా అప్పటిక మృతి చెందింది. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాలిక మృతి చెందిందని బంధువులు ఆరోపించారు.

ఆగని ఇసుక దుమారం

(5వ పేజీ తరువాయి)

అర్హతల ప్రకారం వేశారా, లేదా అనే దానికి టెక్నికల్ బిడ్ల పరిశీలన కొలమానంగా భావిస్తారు. ఈ పరిశీలనలోనే స్థానికేతర సంస్థలను పక్కన పెట్టాలి. కానీ, వాటిని పాస్ చేశారు. అర్హత లేని సంస్థలను టెక్నికల్ బిడ్లలో పాస్‌చేయటంపై ముందుగా జిల్లా యంత్రాంగం వివరణ ఇవ్వాలి. కానీ, దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి వివరణ రాలేదు.

ఆ సంస్థలే నేరుగా పాల్గొన్నాయా?

వందల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన స్థానికేతర సంస్థలు నిజంగానే టెండర్లలో పాలు పంచుకున్నాయా..? వీటి పేర్లను ఉపయోగించుకుని ఎవరు లబ్ధి పొందాలనుకుంటున్నారు?.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. టెండరులో అందరూ ఒకే రేటు వేస్తే ఆ టెండరును ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఓ నిబంధన ఉంది. ఆ సంస్థల వార్షిక టర్నోవర్‌ను గమనించి, ఏది ఎక్కువగా ఉంటే దానికి టెండరును అప్పగిస్తారు. వార్షిక టర్నోవర్ సరిగ్గా లేని కొన్ని సంస్థలు ఈ టెండర్లలో పాల్గొనేందుకు సదరు బడా సంస్థల అంగీకారంతో ఆ పేర్లను వాడాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

సర్వోత్తమం.. పుస్తక పఠనం

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా..

చిన్నారుల నుంచి పెద్దల వరకు గ్రంథ పఠనం పెంచి అన్నిరకాల పుస్తకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తమవంతు కృషిచేస్తోంది విజయవాడ బెంజిసర్కిల్ సర్వోత్తమ భవనంలోని 'సర్వోత్తమ గ్రంథాలయం'. ఎంతో పురాతనమైన గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు, గ్రంథాలు దర్శనమిస్తాయి. సంవత్సరం మొత్తం (పబ్లిక్ హాలిడేస్ మినహా) గ్రంథాలయం పాఠకులకు అందుబాటులో ఉంటోంది.

(బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి)

» పిల్లల్లో, పెద్దల్లో పఠనాసక్తిని పెంచడమే లక్ష్యం

» ఆరున్నర దశాబ్దాల చరిత్ర.. 62 వేల పుస్తకాలు

» తెలుగు తాళపత్రాలు ఇక్కడ భద్రం



గ్రంథాలయంలో ఉంచిన పుస్తకాలు





ఆరున్నర దశాబ్దాల చరిత్ర..

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో పనిచేసే 'సర్వోత్తమ' గ్రంథాలయానికి ఆరున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. దీనిని 1960లో స్థాపించారు. అయితే 1986 వరకు లైబ్రరీ సైన్స్‌లో శిక్షణ పొందేవారికే పరిమితం కాగా.. పాఠకుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని దీనిని 1986 నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. రోజుకు సుమారు 140 నుంచి 160 మంది వరకు పాఠకులు ఇక్కడ పుస్తక పఠనం చేస్తూ ఉంటారు.

అందుబాటులో తెలుగు తాళపత్ర గ్రంథం

'సర్వోత్తమ' గ్రంథాలయంలో మహాభారతానికి సంబంధించి తెలుగులో లిఖించిన తాళపత్ర గ్రంథం ఇక్కడ ఉంది. ఇంగ్లీష్, తెలుగు సాహిత్యంతో పాటు పోటీ పరీక్షల రిఫరెన్స్ పుస్తకాలు, సోషల్ సైన్స్, కామర్స్, ఇంజనీరింగ్, మెడిసిన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెలిజియన్



పుస్తకాలు, నేతల జీవిత చరిత్ర, బాలమిత్ర, చందమామ, సన్మాన సంచికలు తదితర సుమారు 62వేల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలతో పాటు మ్యాగజైన్‌లు, న్యూస్ పేపర్లు కూడా చదవుకునే అవకాశం ఇక్కడ ఉంది. చిన్నారులకు సంబంధించిన పుస్తకాలను అబ్దుల్ కలాం చిల్డ్రన్స్ లైబ్రరీ పేరుతో ఏర్పాటుచేశారు. సెలవు దినాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు, మిగిలిన రోజుల్లో ఉదయం 9నుంచి రాత్రి 8గంటల వరకు ఈ లైబ్రరీ పనిచేస్తుంది. పోటీ పరీక్షలు రాసేవారు ఇక్కడకు వచ్చి పుస్తకాలను చదువుతుంటారు. గ్రంథాలయంలో 3,182 మంది సభ్యులు ఉన్నారు. నామమాత్రపు రుసుంతో ఇళ్లకు పుస్తకాలు ఇస్తూ పుస్తక పఠనం ప్రోత్సహిస్తున్నారు.

సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..



- కె.ధనాంక, యనమలకుదురు

సివిల్స్ ప్రిపరేషన్ కోసం గత నాలుగు నెలలుగా గ్రంథాలయానికి వస్తున్నా. పోటీ పరీక్షలకు ఉపయోగపడే అనేక గ్రంథాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. స్టడీస్‌కు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పోటీ పరీక్షలకు సమాయత్తం



- జి.సాయి ప్రసాద్, పటమట

పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. రిఫరల్ బుక్స్ కోసం వస్తున్నా.. ఎంతో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు ఉన్నాయి. అన్ని రకాల పుస్తకాలు ఉచితంగా ఒక చోట చదువుకునే అవకాశం ఈగ్రంథాలయంలో లభించింది. నిర్వాహకులకు అభినందనలు.

గ్రంథ పఠనం పెంచేందుకే..



- రావి శారద, గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి

పిల్లల నుంచి పెద్దల వరకు గ్రంథ పఠనం పెంచేందుకు కృషిచేస్తున్నాం. పాతకాలం నాటి పుస్తకాలతో పాటు అనేక కొత్త పుస్తకాలు కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాం. పిల్లలకు ప్రత్యేకంగా పుస్తకాలు ఉన్నాయి. పుస్తక పఠనమే కాకుండా చందాదారులకు నామమాత్రపు సభ్యత్వ రుసుంతో ఇళ్లకు పుస్తకాలు ఇచ్చి వారిలో పఠనాసక్తిని పెంచుతున్నాం.

తిరువూరు మున్సిపాలిటీలో

చైర్‌పర్సన్ వివాదం కొలిక్కి వచ్చేనా..!

తిరువూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రాజీనామా అంశం బుధవారం కౌన్సిల్ సమావేశంలోనైనా కొలిక్కి వచ్చేనా.. అంటూ స్థానికంగా చర్చ జరుగుతోంది. వైసీపీ కౌన్సిలర్ల మధ్య చైర్‌పర్సన్ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. గత్తం కస్తూరిబాయి చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నాటినుంచి వైసీపీ కౌన్సిలర్లలో వర్గపోరు మొదలైంది. బోర్డు ఏర్పడి నాలుగేళ్లు పూర్తవడంతో అసమ్మతి వాదులు అవిశ్వాసాన్ని తెరపైకి తెచ్చారు. ఏప్రిల్ 3న కౌన్సిల్ సమావేశం అనంతరం చైర్‌పర్సన్ తన రాజీనామాను కమిషనర్‌కు అందజేశారు. ఈనెల 17న ఆమోదానికి నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ అస్వస్థతకు గురవడంతో వాయిదా చేశారు. తదుపరి సమావేశం 23న నిర్వహించనున్నారు. ఒకే నెలలో మూడుసార్లు సమావేశం నిర్వహించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలోనైనా చైర్‌పర్సన్ రాజీనామా అంశం కొలిక్కివస్తుందా అనే మీమాస ప్రజల్లో నెలకొంది.



పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు

ఎల్‌హెచ్‌బీ బోగీలు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ టు చెన్నై ఇంటర్‌సిటీ డైలీ పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) బోగీల స్థానంలో లింక్ హాఫ్‌మెన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలను అనుసంధానం చేశారు. వీటివల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుందని విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. ఎల్‌హెచ్‌బి ఆధునీకరించిన డిజైన్‌తో తయారు చేయబడి, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు బోగీమీద బోగీ పడకుండా ఉంటాయి. కుదుపులు తక్కువగా ఉండి మెరుగైన శీతలీకరణ, లైటింగ్ సిస్టమ్‌లు ఉంటాయి. ఎల్‌హెచ్‌బి కోచ్‌లు గంటకు 160 కిలోమీటర్ల వేగానికి అనుకూలంగా రూపొందాయి. ప్రస్తుతం దేశంలో 130 కిలోమీటర్ల వేగం వరకే రైళ్లు నడుస్తున్నాయి. ఏసీ చైర్‌కార్, త్రీఏసీ, టూఏసీ, వన్ ఏసీ, స్లీపర్ బోగీలు ఉంటాయి. రాజధాని, శతాబ్ది, దురంతో ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఎల్‌హెచ్‌బి బోగీలను అనుసంధానం చేస్తున్నారు. ఇవి పట్టాలు తప్పే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. బోగీలు ఐసీఎఫ్ బోగీల కంటే తేలికగా ఉంటాయి. ఈ సందర్భంగా విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ మాట్లాడుతూ, ప్రయాణికులు ఆనందకరంగా గమ్యాలను చేరుకోవచ్చన్నారు.

నేడు బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలు మల్లవోలు హైస్కూల్‌లో ఉదయం 9గంటలకు జరుగుతాయని, క్రీడాకారుల బరువు స్త్రీలు 75కేజీలు, పురుషులు 85కేజీలు లోపు ఉండాలని తెలిపారు. అదేవిధంగా ఎంపికలకు ఉదయం 9గంటలకు హాజరుకావాలని, ఒరిజనల్ ఆధార్ కార్డుతో రావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు మేనెల 2న కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని, ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9704063555లో సంప్రదించాలని తెలిపారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలి

» ఎంబీ ఫౌండేషన్ ఉచిత క్యాంప్



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు, పి.పద్మ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సెర్వికల్ కేన్సర్ నివారణకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ తీసుకోవడం మహిళలకు చాలా అవసరమని, దీని ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆంధ్ర హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు అన్నారు. మంగళవారం నక్కలరోడ్డులోని ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాక్సిన్‌పై సమాజంలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద మహిళలకు వ్యాక్సిన్ ఉచితంగా అందించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. సినీహీరో మహేష్‌బాబు ఫౌండేషన్ (ఎంబీఎఫ్) సహకారంతో 9 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల లోపు బాలికలు, మహిళల కోసం విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్యాంపులో 9 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు 2 డోసులు, 14 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు వారికి 3 డోసుల చొప్పున అందిస్తామన్నారు. ఒక్కొక్క డోసుకు రూ. 2 వేల వరకు ఖర్చు అవుతుందని, ఎంబీ ఫౌండేషన్ ఈ క్యాంపు కోసం రూ. 40 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్టు డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. చీఫ్ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పాతూరి పద్మ మాట్లాడుతూ, హెచ్‌పీసీ వ్యాక్సిన్ మహిళలకు అందించడంలో సహకరిస్తున్న ఆంధ్ర హాస్పిటల్స్, ఎంబీ ఫౌండేషన్ నిర్వాహకులు మహేష్‌బాబు, నమ్రతలకు ధన్యవాదాలు తెలిపారు. సెర్వికల్ కేన్సర్ వల్ల ప్రతి 8 నిముషాలకు ఒక మహిళ ప్రాణాలు కోల్పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాక్సినేషన్ ఎంతో ఖరీదుతో కూడినదని, ప్రభుత్వ నేషనల్ వ్యాక్సిన్ ప్రోగ్రామ్‌లో హెచ్‌పీసీ లేని కారణంగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి, స్కూల్స్, హాస్పటల్స్‌లో బాలికలు, మహిళల కోసం క్యాంపులు నిర్వహించాలని కోరారు.

వారి జీతాలు ఆపేయండి

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగులే ఉన్నతాధికారులకు తెలియకుండా తొక్కిపడుతూ వచ్చారు. దీంతో 58 ఏళ్ల దాటిన కొంతమంది 62 ఏళ్ల వరకు పనిచేసుకుని పదవీ విరమణ చెందారు. మరికొందరు 62 ఏళ్ల దగ్గరకు కూడా వచ్చారు. పదవీ విరమణ చెందినా జీతాలు తీసుకుంటున్నారు. వీరిలో కొందరు పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తీసుకోవటానికి కూడా ట్రెజరీ అధికారులతో ఏర్పాట్లు చేసుకోవటం గమనార్హం. ఈ వ్యవహారం ఎప్పుడైతే వెలుగులోకి వచ్చిందో.. అప్పుడు ఎస్ఈ ఇన్‌చార్జి విద్యాసాగర్ అడ్డుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో ఇప్పటి వరకు అయాచితంగా లబ్ధి పొందుతున్న ఉద్యోగులకు ఝలక్ ఇచ్చినట్టు అయింది.

వెలవెలా..!

(5వ పేజీ తరువాయి)

దీంతో వినియోగదారులు 24, 22 క్యారెట్లకు బదులు 18, 14 క్యారెట్ గోల్డ్ జువెలరీపై మొగ్గు చూపే పరిస్థితులు నెలకొంటున్నాయి. పెరిగిన ధరలతో కొనుగోలుదారులు లేక షాపులు వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం 20 సార్లు ఆల్‌టైమ్ రికార్డులను తాకి రూ.లక్ష దాటేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బంగారు ఆభరణాల దిగుమతులపై సుంకాలు విధించడమే ఇందుకు కారణం. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కారణంగా డాలర్ బలహీనపడటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఏడాది చివరి నాటికి పది గ్రాముల బంగారం ధర రూ.1.23 లక్షలకు చేరుకునే అవకాశంలేకపోలేదంటున్నారు.

చిన్న షాపులకు సంకటమే..

పసిడి పరుగు చిన్న షాపుల యజమానులకు సంకటంగా మారింది. ధరలు అనూహ్యంగా రూ.లక్ష దాటడంతో బంగారం గిరాకీ బాగా తగ్గింది. సగానికి సగం వ్యాపారం తగ్గిందంటున్నారు. ఇప్పుడు పెరిగిన ధరలతో చిన్నచిన్న పట్టణాల్లో ఉన్న దుకాణాలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. అక్షయ తృతీయకు, పండుగలకు బడా బంగారం షాపుల వారు ఆఫర్లు పెట్టడంతో చాలామంది వాటివైపు వెళ్తున్నారని, ఇప్పుడు పెరిగిన ధరలు వ్యాపారాలపై పడుతున్నాయంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని కొండపల్లి, మైలవరం, జి.కొండూరు, తిరువూరు, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, విస్సన్నపేట, పెనుగంచిప్రోలులోని బంగారం దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి.

వారంలో అక్షయ తృతీయ

ఈనెల 30న అక్షయ తృతీయ. ఆరోజు ఎంతో కొంత బంగారం కొనేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారు. ఇప్పుడు ధర రూ.లక్ష దాటడం, వారంలో ధర ఎంత పెరుగుతుందోనని పసిడి ప్రియులు, సామాన్య మధ్యతరగతి వారు ఆందోళన చెందుతున్నారు. చాలామంది అక్షయ తృతీయకు బంగారం కొనకపోతే ఏమవుతుందిలే అనే ఆలోచనలో పడ్డారు.

ప్రైవేటు బస్సుల దందా!

(5వ పేజీ తరువాయి)

దాటాక బ్రేక్ ఫెయిలై ఆగిపోయింది. ఆ సమయంలో రోడ్లపై వెళ్తున్న వాహనాలను ఆపి అందులో ప్రయాణికులను సర్దుబాటు చేసి పంపించారు. బస్సు మొరాయిస్తే తామేం చేయగలమని, మరో బస్సు కావాలంటే ఉదయం 5 గంటల వరకు వేచి ఉండాలని, లేకపోతే ఈ దారిలో వచ్చిన వాహనాల్లో సర్దుకుని ప్రయాణించాలని సమాధానం చెప్పారు.

ప్రత్యామ్నాయ సర్వీసుల్లేవ్!

మార్గమధ్యలో బస్సుల్లో సాంకేతిక లోపాలు వచ్చినప్పుడు సదరు సంస్థ ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వారి వద్ద ఉన్న బస్సులన్నీ సర్వీస్ చేస్తుండటంతో ప్రయాణిస్తున్న బస్సుల్లో ఏదైనా ఆటంకం వస్తే ప్రయాణికులను ఆ మార్గంలో వచ్చే మరో బస్సులో పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరంగా వెళ్లాల్సిన వారి పరిస్థితి అయితే మరీ ఘోరంగా ఉంటుంది. వారికి ఏ బస్సు దొరికితే ఆ బస్సులో ఖాళీ లేకపోయినా సీట్ల మధ్య ఖాళీ స్థలంలోనో, డ్రైవర్ పక్కనో గేర్‌బాక్స్ దగ్గర సర్దుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. అయితే ట్రావెల్స్ యజమానులు బస్సులు బయలుదేరే ముందు తనిఖీ చేయకుండా కాలం చెల్లిన బస్సులను వినియోగిస్తుండడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అంటున్నారు.

భయపెడుతున్న అగ్నిప్రమాదాలు

ఇటీవల విజయవాడ నగరంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఓ ప్రైవేటు బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఫిట్‌నెస్ లేని బస్సుల వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు డొక్కు బస్సులు నడుపుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి.

కమీషన్ల కోసం అడ్డమైన హోటల్స్ వద్ద నిలుపుదల

ఉదయం, రాత్రి వేళల్లో భోజనం కోసం ట్రావెల్స్ డ్రైవర్లు కొన్ని హోటల్స్ వద్ద ఆపుతారు. అయితే హోటల్ యాజమానుల దగ్గర కమీషన్ కోసం ఆహారం బాగా లేకపోయినా కొన్ని హోటల్స్ వద్ద నిలుపుదల చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. భారీగా చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్స్ యజమానులు బస్సుల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలేదని విమర్శిస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులతో ప్రయాణిస్తున్న సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా వాహనాన్ని ఆపరని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, నిబంధనలు పాటించని యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్ఐ వేధిస్తున్నాడని

వీఆర్ఏ ఆత్మహత్యాయత్నం!



వీఆర్ఏ మస్తాన్

ఎ.కొండూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ కార్యాలయాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని ఆర్ఐ కిందిస్థాయి సిబ్బందిని దూషించడం, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ వీఆర్ఏ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎ.కొండూరు తహసీల్దార్ బి.ఆశయ్య పదోన్నతిపై బదిలీకాగా, డిప్యూటీ తహసీల్దార్ రాజ్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న దివ్యప్రసాద్ అదనంగా ఆర్ఐ బాధ్యతలు నిర్వహిస్తు కార్యాలయ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో గొల్లమందల వీఆర్ఏ షేక్ మస్తాన్ ఏడాది నుంచి నైట్ డ్యూటీలు చేస్తున్నారు. వేసవికాలం కావడంతో అనారోగ్యానికి గురికాగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనుమతితో రెండు రోజుల నుంచి మస్తాన్ కుమారుడు బాబ్జీని నైట్ డ్యూటీకి పంపుతున్నాడు. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఏసీ పాడుచేశాడని మస్తాన్‌ను ఆర్ఐ కార్యాలయానికి పిలిపించి తీవ్ర పదజాలంతో దూషించాడని, తండ్రీకొడుకులపై కేసు పెడతామని, ఉద్యోగం లేకుండా చేస్తామని హెచ్చరించడంతో మనస్థాపం చెందిన మస్తాన్ మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. భార్య కేకలు వేయడంతో స్థానికులు మస్తాన్‌ను రక్షించారు. ఆర్ఐ తనను వేధింపులకు గురిచేస్తు, కేసులు పెట్టి ఉద్యోగం లేకుండా చేస్తామని బెదిస్తున్నాడని, రక్షణ కల్పించాలని, ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు మస్తాన్, కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మస్తాన్ ఆత్మహత్యయత్నం ఘటన తన దృష్టికి వచ్చిందని, మస్తాన్ కుమారుడు బాబ్జి నైట్ డ్యూటీలో ఉండగా తహసీల్దార్ కార్యాలయంలోని ఏసీ, సీసీ కెమెరాలు చెడిపోవడంతో ఆర్ఐ మందలించినట్టు తెలిసిందన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి మేత!

» మోగులూరులో ఫీల్డ్ అసిస్టెంట్ మాయాజాలం

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో నివాసం ఉంటున్న వారిని పనికి వచ్చినట్టు చూపి హాజరు వేసి నిధులు స్వాహా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఉదంతం వెలుగుచూసింది. కంచికచర్ల మండలం మోగులూరు గ్రామంలో ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఫీల్డ్ అసిస్టెంట్స్ తూట్లు పొడుస్తున్నారు. గ్రామానికి చెందిన ఎఫ్ఏ బంకా ఆంజనేయులు ఎక్కడో నివాసం ఉంటున్న వారికి హాజరు వేసి వారి నుంచి కొంత సొమ్మును వసూలు చేయడంతో పాటు వచ్చిన వారిని పనులు లేవని తిప్పి పంపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నేత వెలగా నరసింహారావు ఈ ఉదంతంపై ఫిర్యాదు చేశారు. అసిస్టెంట్ పీడీ వెంకటేశ్వరరావు, ఏపీవో రమాదేవిలు ఈవిషయంపై గ్రామంలో విచారణ చేసి ఎఫ్ఏ అవినీతికి పాల్పడినట్టు నిర్ధారించారు. దీనిపై ఎంపీడీవో లక్ష్మీకుమారిని వివరణ కోరగా ఫిర్యాదు మేరకు అధికారులను విచారణకు పంపినట్టు చెప్పారు. గ్రామానికి చెందిన బంకా పుల్లయ్య విశాఖలో నివాసం ఉండగా అతడి పేరున జాబ్ కార్డు 10903 నంబరుపై 20 రోజులు హాజరు వేశారు. దంతమాల మురళీకృష్ణ ఇబ్రహీంపట్నంలో నివాసం ఉండగా అతడి జాబ్‌కార్డు 11089కు 15రోజులు, స్వయంగా ఎఫ్ఏకి సోదరి అయిన మెరుగుల దేవమ్మ జాబ్‌కార్డు నంబరు 11039కు 15 రోజులు హాజరు వేసినట్టు గుర్తించారు.

వాయువేగంగా..

(5వ పేజీ తరువాయి)

ఆ తర్వాత టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించాలి. దీని తర్వాత భూమికి సంబంధించి సమగ్ర వివరాలు అందించాలి. విమానాశ్రయ ప్రతిపాదిత స్థలానికి సంబంధించి సర్వే చేపట్టి, ఆ తర్వాత మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయాలి. ఫైనాన్షియల్ మోడల్‌పై కూడా నివేదిక ఇవ్వడంతో పాటు పర్యావరణ, సోషల్ ఇంపాక్ట్ సర్వే కూడా నిర్వహించాలి. డిమాండ్, మార్కెట్ అసెస్‌మెంట్ స్టడీ, కేస్ స్టడీ, బెస్ట్ ప్రాక్టీసెస్ వంటి వివరాలను కూడా కన్సల్టెన్సీ సంస్థ అందించాలి. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన విస్తీర్ణం, కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ డిమాండ్ అసెస్‌మెంట్ ఎకనామిక్-ఫైనాన్షియల్ వయబిలిటీ వంటివి కూడా పొందుపరచాలి. పాసెంజర్ టెర్మినల్, కార్గో టెర్మినల్ డిజైన్ల రూపకల్పనతో పాటు కార్లు, బస్సులు, కార్గో వెహికల్స్‌కు పార్కింగ్ ప్లేస్‌లు నిర్ణయించటం, పర్యాటకులకు విమానాశ్రయంలోనే వసతి సదుపాయాలు, భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు కూడా నివేదికలో పొందుపరచాలి.

27న ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ(స్పోర్ట్స్): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 27న పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో కృష్ణాజిల్లా అండర్- 13బాల బాలికల చెస్ చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తెలిపారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొదట రెండు స్థానాల్లో నిలిచిన వారిని జూన్‌లో జరిగే అండర్ 13స్టేట్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో టాప్ 3 స్థానాలకు బహుమతులు, అండర్- 15 లో మొదటి రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు. పాల్గొనదలచిన వారు శనివారం సాయంత్రం 6గంటల్లోగా తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోగలరని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

లబ్బీపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం కలుషితం కాకుండా యువత వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని చినాయి డిజైన్ మేనేజింగ్ డైరెక్టర్ వి. సందీపిని అన్నారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం, వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పర్యవరణంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచడం, వర్షం నీటిని సద్వినియోగం చేయడం, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడడం, గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణం తదితర కార్యక్రమాలు ఆచరణలో పెట్టడం వలన మనచుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. పర్యావరణం ఆరోగ్యంగా ఉంటే భూమి మీద ఉన్న జీవరాశులు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న వి.సందీపిని

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

మొగల్రాజపురం: భావి తరాల కోసం పర్యావరణ జాగ్రత్తలు పాటించకపోతే చమురు సంక్షోభం తలెత్తుతుందని, జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్ (నూజివీడు) డాక్టర్ జె.నవీన లావణ్య లత తెలిపారు. మంగళవారం మొగల్రాజపురం వీబీ సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం, గ్రీన్ క్లబ్, ఏపీ కాలుష్యనియంత్రణ మండలి సంయుక్తంగా కళాశాలలో ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పర్యావరణ హిత వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ రాజేష్ జంపాల, కాలుష్య నియంత్రణ మండలి ఎనలిస్టు జి.ప్రసన్న, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ టిఎస్. కృష్ణ, అధ్యాపకులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో

మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు.

ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

ఓబీసీ సంక్షేమ సంఘం

గాంధీనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ బీసీ, ఓబీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ విధానం అమలు చేయ డం సమంజసం కాదన్నారు. ఓబీసీ మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీదేవీ యాదవ్‌ను నియమిస్తూ నియామక ప్రతాన్ని ఆమెకు అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుజాన్ సింగ్, నగర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, జిల్లా కార్యదర్శి జి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఒక్కటే మార్గమని నగర కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. అమరావతి యోగా, యోరోబిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవడానికి సహజసిద్ధమైన, సులభమైన మార్గం యోగా మాత్రమేనని ఆయన చెప్పారు. యోగా సాధన దినచర్యగా మారిన నాడు ఔషధాల వినియోగం తగ్గుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు యోగా పట్ల అవగాహన, ఆసక్తి కలిగించేలా కృషి చేయాలిని కమిషనర్ కోరారు.


యోగా చేస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

కోర్టు ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీని ప్రారంభించిన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానందం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో బెజవాడ బార్ అసోసియేషన్ వద్ద ఐఏఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరంతర మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.సత్యానందం ప్రారంభించారు. దాదాపు 21 ఏళ్లుగా ఏటా మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు ఐఏఎల్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి షరీఫ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ న్యాయవాదులు కేవీ సుధాకరరాజు, పీవీ గిరిప్రసాద్, ఈఎస్ ప్రసాద్, లంక రామ్మోహన్, గోలి నర్సింహారావు, బీబీఏ ప్రధాన కార్యదర్శి ఏవీ రంగారావు, లైబ్రేరియన్ కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బుక్ హంట్ పోటీలకు 25 మంది

బెంజిసర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన బుక్ హంట్ (పుస్తకాల వేట) పోటీలకు నగరంలోని పలు కళాశాల నుంచి 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరు గ్రంథాలయంలోని వివిధ ర్యాక్‌ల్లో పొందుపరిచిన పుస్తకాలను పోటీలకు అనుగుణంగా అన్వేషించారు. పోటీల్లో విజేతలకు బుధవారం గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో అందజేస్తారు.


పుస్తకాల వేట పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

టాయ్ లైబ్రరీ ప్రారంభోత్సవం నేడే

స్థానిక సర్వోత్తమ భవనంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం 5గంటలకు టాయ్ లైబ్రరీని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు శ్రీముఖి అనుమోలు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె. పట్టాభిరామయ్య, డాక్టర్ రావి శారద హాజరుకానున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలి

పటమట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆరవ తరగతి నుంచి ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ప్రథమ బాషగా ఉర్దూ బోధించేందుకు ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షతన పటమటలోని పలు పాఠశాలల్లో హెచ్ఎంలకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ రహమన్, రహీమ్‌షేక్ సిలర్, షేక్ అహమ్మద్, కాజీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


హెచ్ఎం మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం మైనార్టీనేతలు

ఉత్సాహంగా బాలవినోదం



మొగల్రాజపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో, నృత్యాలతో చిన్నారులు, విద్యార్థులు సందడి చేశారు. మొగల్రాజపురం సిద్ధార్థనగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల వార్షికోత్సవం బాల వినోదం మంగళవారం సున్నబట్టీల సెంటర్‌లోని అమ్మ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి, ప్రిన్సిపాల్ సుధాప్రవీణ ముక్తేవి పరీక్షలలో, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై సిమెంట్ బిళ్లల ఏర్పాటుకు అంచనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అవుట్‌ఫాల్ డ్రెయిన్(ఫైల్ ఫొటో)

రాణిగారితోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 16వ డివిజన్ కరకట్ట సర్వీస్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై సిమెంట్ బిళ్లలు వేయడానికి అంచనాలు రూపొందించినట్లు మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ జి.సామ్రాజ్యం తెలిపారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో ఆదమరిచారో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈఈ సిమెంట్ బిళ్లల నిర్మాణానికి అంచనాలు రూపొందించామని, ఈ అంచనాలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆమోదం తెలిపి, టెండర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పనులు చేపడతామని తెలిపారు.


గమేళా బజారు రోడ్డో వారం రోజుల నుంచి నిలిచిన మురుగునీరు


వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

చెత్త, వ్యర్థాలతో అవుట్‌ఫాల్ డ్రెయినేజీ

● నిలిచిన మురుగునీరు
● వారం రోజులుగా మురుగులో గమేళా బజార్ రోడ్డు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ఏపీఐఐసీ కాలనీ సమీపంలోని గమేళా బజార్ రోడ్డు వెంబడి ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయినేజీ చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో మురుగునీరు ప్రవహించడం లేదు. అసలే డ్రెయిన్లు అంతంతమాత్రంగా ప్రవహిస్తాయి. దానికి తోడు ఇటీవల ఈ రోడ్డు వెంబడి అండర్ గ్రౌండ్ వైర్‌లను ఏర్పాటు చేశారు. వాటికోసం గుంతలు తీసినపుడు మట్టి డ్రెయినేజీలో పడడంతో మురుగు నీరు పారుదల పూర్తిగా ఆగిపోయింది. దీంతో వారం రోజుల నుంచి మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. ఈ రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడలు

కార్పొరేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో మే ఒకటో తేదీ నుంచి 31 వరకు స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, స్కేటింగ్ తదితర క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నగరపాలక సంస్థ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్విమ్మింగ్... సర్ విజ్జీ స్విమ్మింగ్ పూల్ (గాంధీనగర్), గురునానక్ కాలనీ స్విమ్మింగ్ పూల్ (గురునానక్ కాలనీ), డాక్టర్ కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్(చిట్టినగర్)

బ్యాడ్మింటన్.. దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం (ఎంజీ రోడ్డు), చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం (పటమట)

స్కేటింగ్.. దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం(ఎంజీ రోడ్డు), జీవీఎస్ శాస్త్రి పార్క్ (సత్యనారాయణపురం), రోజ్ గార్డెన్ పార్క్(భవానీపురం)

యోగా .. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, పటమట

పైన పేర్కొన్న క్రీడలలో పాల్గొనడానికి ఎటువంటి దరఖాస్తు ఫీజు చెల్లించనవసరం లేదని లత పేర్కొన్నారు. ఎంచుకున్న క్రీడలకు సంబంధించిన దుస్తులు, క్రీడా పరికరాలు వారే సమకూర్చుకోవాలని, నగరపాలక సంస్థకు ఎటువంటి బాధ్యత ఉండదని తెలిపారు. వేసవి కాలంలో జరిగే ఈ క్రీడలను నగర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఫీజు వివరాలను సంబంధిత ఇన్‌చార్జ్‌లను సంప్రదించాలని లత కోరారు.

పాత్రికేయుల సొసైటీ స్థలంలో కార్యాలయ గది

● సభ్యుల విజ్ఞాపనపై కలెక్టర్ అంగీకారం ● సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా:యార్లగడ్డ

కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) :విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్' స్థలంలో సొసైటీ కార్యాలయంగా ఓ గది నిర్మించుకోవడానికి కలెక్టర్ లక్ష్మీశ అనుమతించారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో రూరల్ మండల తహసీల్దార్ సుగుణ ఆధ్వర్యంలో సొసైటీ స్థలంలోని ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సమక్షంలో మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశను సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు పలువురు కలిసి ధన్యవాదాలు తెలిపారు. హౌసింగ్ సొసైటీ స్థలం తిరిగి దురాక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అయితే ప్రస్తుతానికి స్థలం సరిహద్దుల వెంబడి మొక్కలు నాటిద్దామని కలెక్టర్ చెప్పారు. చిన్నపాటి కార్యాలయ గది ఏర్పాటు చేసుకొంటామని కోరగా, కలెక్టర్ అందుకు అంగీకరించారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి సీసీఎల్‌ఏ కమిషనర్ జయలక్ష్మి దృష్టికి ఈ స్థలం విషయం తీసుకొని వెళ్లాలని కలెక్టర్ పాత్రికేయులకు సూచించారు. పాత్రికేయుల దీర్ఘకాల సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా సహకరించాల్సిందిగా ప్రభుత్వ విప్ వెంకట్రావ్ కలెక్టర్‌ను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను త్వరలోనే కలిసి సమస్యను వారి దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు. రానున్న కొద్దిరోజుల్లోనే శంకుస్థాపన కూడా జరిగేలా జిల్లా యంత్రాంగం సహకరించేలా కలెక్టర్ చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సొసైటీ అధ్యక్షుడు చిగురుపాటి సతీష్‌బాబు నేతృత్వంలో డైరెక్టర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.


కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమైన పాత్రికేయుల సొసైటీ సభ్యులు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

విజ్ఞాన యాత్రల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధి, ప్రజల సమస్యలు పూర్తిగా గాలికొదిలేసి విహార యాత్రలు, ల్యాప్‌టాప్‌ల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే అధికారం వైసీపీ, కూటమి కార్పొరేటర్లకు ఎవరిచ్చారని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ ప్రశ్నించారు. విచ్చలవిడి వ్యవహారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రశ్నించేవారు లేకపోవడంతో వీరి అరాచకాలకు అడ్డులేకుండా పోతుందని ఆరోపించారు. మంగళవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల వైసీపీ పాలనలో కార్పొరేటర్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని మూడు సార్లు విజ్ఞాన యాత్రల పేరుతో ఇప్పటివరకు సుమారు రూ.2.48 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఈ యాత్రల వల్ల నగరానికి, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఖజానా ఖాళీ అయిపోయిందని చెప్పి అభివృద్ధిని అటకెక్కించి, కనీసం కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కావాల్సిన వందల కోట్ల రూపాయల గ్రాంట్లు, ఇతర నిధుల కోసం ప్రభుత్వాల వద్దకు వెళ్లి అడిగే ధైర్యం, చిత్తశుద్ధి కూటమి కార్పొరేటర్లకు లేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కూటమి, వైసీపీ కార్పొరేటర్లు ప్రజా సమస్యలను విస్మరించారని విమర్శించారు. దీనిని ప్రజలు గమనించి నిలదీయాలని కోరారు. ఈ సమావేశంలో బోయి సత్యబాబు పాల్గొన్నారు.

సారూ.. కాస్త ఫ్యాన్లు బిగించండి

● అంబేడ్కర్ కల్యాణ మండపంలో ఫ్యాన్లు పోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: పేదలు, మధ్యతరగతి ప్రజలంటే అధికారులకు ఎంత ప్రేమో రాణిగారితోటలో కోట్ల రూపాయలతో నిర్మించిన అంబేడ్కర్ కల్యాణమండపం చూస్తే అర్థమవుతుంది. రాణిగారితోటలో గతంలో ఉన్న మల్లెల తిరుపతమ్మ కూరగాయల మార్కెట్‌ను తొలగించి స్థానికుల అవసరాల కోసం దాదాపు కోటి రూపాయలు ఖర్చుచేసి కల్యాణ మండపాన్ని నిర్మించారు.


మండపం లోపల ఫ్యాన్ల స్థానంలో దర్శనమిస్తున్న రాడ్లు

ఇందులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి అద్దెకు ఇస్తున్నారు. అయితే అద్దె చెల్లించి కల్యాణ మండపంలో ఎవరైనా కార్యక్రమాలు చేసుకుంటే వంట సామాగ్రితో పాటు ఫ్యాన్లు అద్దెకు తీసుకోవాలనే నిబంధన తప్పనిసరిగా పాటించాలి. ఈ భవనంలో ఒక్క ఫ్యాన్ కనిపించదు, కేవలం ఫ్యాన్ బిగించే రాడ్లు మాత్రమే దర్శనమిస్తాయి. ఇక్కడ బిగించిన ఫ్యాన్లు చోరీకి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు, గత సంవత్సరం వచ్చిన వరదల కారణంగా ఈ భవనాన్ని షెల్టర్ జోన్‌గా ఏర్పాటు చేయగా ఆ తరువాత నుంచి ఫ్యాన్లు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ విషయం అధికారుల దృష్టిలో ఉన్నా ఫ్యాన్లు బిగించే చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఎండాకాలం ప్రారంభమవడంతో ఎండలతో ఉక్కపోత పెరిగి కార్యక్రమాలు చేసుకునే వారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, నాయకులు

రాణిగారితోట అంటేనే అన్ని పార్టీల హడావుడికి పెట్టింది పేరు. ఇక్కడ రాజకీయ నాయకులకు, కార్యకర్తలకు కొదవలేదు.

అయినా కల్యాణ మండపంలో సమస్య మాత్రం ఎవరికీ పట్టదు. స్థానిక కార్పొరేటర్ ఎన్నికల అనంతరం ప్రజలకు, డివిజన్‌కు దూరంగా ఉండడంతో ఈ సమస్యకు పరిష్కారం ఎవరు చూపుతారని స్థానికులు ఎదురుచూస్తూ సారూ కాస్త ఫ్యాన్లు బిగించండి అంటూ అందరినీ అడుగుతున్నారు.





రైతుల కష్టం.. దళారుల భోజ్యం..!

గన్నవరం మండలంలో ప్రారంభించని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ● అధికారులు, మిల్లర్లు సిండికేట్ అయ్యారని రైతుల ఆరోపణ

దళారుల దెబ్బకు దాళ్వా రైతులు కుదేలవుతున్నారు. ధాన్యం కొనుగోలు చేయమని ప్రభుత్వం నెలక్రితం ప్రకటించినా గన్నవరం మండలంలో ప్రారంభానికి నోచుకోలేదు. రైతులు ధాన్యం కోసి రెండు వారాలకు పైనే అవుతోంది. అధికారులు పట్టించుకోవటం లేదని, మిల్లర్లతో సిండికేట్ అయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం 75 కేజీల ధాన్యం బస్తా రూ.1750 ప్రకటించింది. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటంతో దళారులు రూ.1250 నుంచి రూ.1450 వరకు కొంటున్నారు. రూ.300 నుంచి రూ.500 వరకు రైతులు నష్టపోతున్నారు.

- గన్నవరం, ఆంధ్రజ్యోతి

గన్నవరం మండలంలో సూరంపల్లి, ముస్తాబాద, కేసరపల్లి ప్రాంతాల్లో 500 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగుచేశారు. పంట చేతికొచ్చి కల్లాల్లో ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయమని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కనీసం సంచులన్నా ఇస్తే ఎత్తి పక్కన పెట్టుకుంటామన్నా ఇవ్వటం లేదని చెబుతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తుండటంతో భయాందోళన చెందుతున్నామని, అకాల వర్షం వస్తే పంటంతా వర్షార్పణమవుతుందని చెబుతున్నారు. అయితే ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ప్రారంభించాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు చేస్తామని కాగితాలిచ్చి ఈరోజు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో దళారులను ఆశ్రయించటం తప్పటం లేదని, ఎన్ని రోజులు పంటను కల్లాల్లో పెట్టి కాపల కాస్తామని అంటున్నారు. ఎకరానికి రూ.35వేలు ఖర్చయిందని దళారులకు ధాన్యం వేయటంతో సుమారు మరో రూ.10వేలు నష్టపోతామంటున్నారు.

అధికారులు పట్టించుకోవటం లేదు..



మాలావతు రూప్‌బాబు, కౌలు రైతు

అధికారులు పట్టించుకోవటం లేదు. సరైన సమాచారం ఇవ్వటం లేదు. పంట కోసి రెండు వారాలవుతోంది. అదేమంటే మిల్లర్లు సంచులివ్వటం లేదని చెబుతున్నారు. మిల్లర్లు, అధికారులు సిండికేట్ అయ్యారని తెలుస్తోంది. కనీసం సంచులన్నా ఇస్తే ఎత్తి పక్కన పెట్టుకుంటామని. వాతావరణం బాగాలేదని చెప్పినా వినలేదు.

ధాన్యం కొనుగోలు చేయాలి



మాగంటి ప్రభాకరరావు, రైతు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తక్కువకి అమ్మాలంటే బాధేస్తోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయమని చెప్పి నెల రోజులవుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలి.

ఏపీటీడీసీ బస్సులో బాలికపై అసభ్య ప్రవర్తన

- మద్యం మత్తులో అనధికార ప్రయాణికుడి వికృత చేష్టలు
- తమిళనాడు నుంచి తిరుపతికి వచ్చే బస్సులో ఘటన
- తమిళనాడు సీఎం స్టాలిన్ ఆగ్రహం
- మెయిల్ ద్వారా ఓ మోటార్ కంపెనీ అధినేత ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన ఏపీటీడీసీ ఎండీ
- బాధ్యులను విజయవాడకు పిలిపించి విచారణ

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థకు (ఏపీటీడీసీ) చెందిన బస్సులో తమిళనాడు బాలిక పట్ల ఓ అనధికార ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించటంతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు నుంచి తిరుపతికి రెగ్యులర్‌గా ఏపీటీడీసీ బస్సులను నడుపుతోంది. తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన ఏపీటీడీసీకి చెందిన టీఎన్07ఏటీ8229 నంబరు బస్సు కోయంబత్తూరు నుంచి తిరుపతికి యాత్రికులను తీసుకు వస్తుంటుంది. కొద్ది రోజుల కిందట తమిళనాడుకు చెందిన ఒక మోటార్ కంపెనీ అధినేత బంధువులు కుటుంబ సమేతంగా ఈ బస్సులో ప్రయాణించారు. బస్సు కెపాసిటీ 35 సీట్లు అయినప్పటికీ సగం బస్సు ఖాళీగా ఉంది. వెనుక సీట్లు ఖాళీగా ఉండటంతో ఆ కుటుంబానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఆ సీట్లలో పడుకుంది. కాసుల కక్కుర్తితో మార్గమధ్యంలో టూర్ ప్యాకేజీతో సంబంధం లేని ఒక వ్యక్తిని ఏపీటీడీసీ సిబ్బంది బస్సులో ఎక్కించుకున్నారు. అతను మద్యం సేవించినట్టు తెలుస్తోంది. బస్సులో అందరూ నిద్రిస్తుండగా.. ఆ వ్యక్తి వెనుక సీట్లో పడుకున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక కేకలు వేయడంతో సిబ్బంది ఆ వ్యక్తిని బస్సు నుంచి దించివేశారు. అయితే, ఈ విషయం చాలా రోజుల వరకు బయటకు రాలేదు. బాలిక బంధువైన ఓ మోటార్ కంపెనీ అధినేతకు ఈ విషయం తెలిసి ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఈ-మెయిల్‌లో ఫిర్యాదు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దృష్టికి కూడా ఆయన తీసుకువెళ్లడంతో ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్టాలిన్ స్థానికంగా విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు తమిళనాడు రిజిస్ట్రేషన్ బస్సులేవీ తమవద్ద లేవని, అది ఏపీటీడీసీ బస్సు అని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ గుర్తించి ఆ మెయిల్‌ను ఏపీటీడీసీకి ఎండీకి ఫార్వర్డ్ చేశారు. దీంతో ఏపీటీడీసీ ఎండీ కూడా విచారణకు ఆదేశించారు. తిరుపతి యూనిట్‌కు చెందిన బాధ్యులైన బస్సు డ్రైవర్లు, ఇతర సిబ్బందిని విజయవాడలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. డ్రైవర్లను సస్పెండ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఎర్రజెండా

● లెనిన్ జయంతి సభలో వక్తలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్రజెండా మాత్రమే ప్రత్యామ్నాయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోషలిస్టు రాజ్య స్థాపకుడు వీఐ లెనిన్ జయంతిని పురస్కరించుకుని మార్క్స్, ఎంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష నేతలు మంగళవారం గవర్నర్‌పేట లెనిన్ విగ్రహం వద్ద పూలరింగును ఉంచి నివాళులర్పించారు. వామపక్ష నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ సోవియట్‌లో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల సాయుధ పోరాటం చేసి విజయం సాధించి సుదీర్ఘకాలం ఎర్రజెండా పాలన చేసిన ఘనత లెనిన్‌దేనన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాగిస్తున్న ఆర్థిక అరాచకం వల్ల దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆక్వా, మిర్చి వంటి వాటికి ధరలు సరిగా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీ ప్రసాద్ మాట్లాడుతూ మార్క్స్ సిద్ధాంతాలు, లెనిన్ పోరాటం స్ఫూర్తితో ముందుకు సాగాలని వామపక్షాలకు పిలుపు నిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, పాపులర్ సంస్థ అధినేత చుక్కపల్లి విజయ్‌కుమార్, విశ్రాంత ఆచార్యుడు సీ నరసింహారావు, సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, నేతలు పంచదార్ల దుర్గాంబ, జమలయ్య, సూర్యారావు, వివిధ సంఘాల ప్రతినిధులు దివికుమార్, లక్ష్మయ్య, వై చెంచయ్య, సుబ్బరావమ్మ, అక్కినేని చంద్రారావు, అరసం ప్రతినిధి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



లెనిన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు

కాలేజీలో ఫోన్ వాడొద్దన్నందుకు.. ఫ్యాకల్టీ సభ్యురాలిపై విద్యార్థిని చెప్పుతో దాడి

విశాఖపట్నం/భీమునిపట్నం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తన సెల్‌ఫోన్ తీసుకున్నారనే కోపంతో ఓ విద్యార్థిని ఏకంగా ఎన్‌సీసీ ఫ్యాకల్టీ సభ్యురాలిని బూతులు తిడుతూ చెప్పుతో దాడి చేసిన ఘటన విశాఖ జిల్లాలోని దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగింది. మంగళవారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురవాడకు చెందిన ఓ విద్యార్థిని ఈసీఈ సెకండియర్ చదువుతోంది. సోమవారం నిబంధనలకు విరుద్ధంగా కళాశాల ప్రాంగణంలో ఫోన్ మాట్లాడుతుండగా, ఎన్‌సీసీ ఫ్యాకల్టీ సభ్యురాలు నాగమణి ఆ ఫోన్ తీసుకున్నారు. ఫోన్ ప్రిన్సిపాల్‌కు అప్పగిస్తానని చెప్పగా.. ఆ విద్యార్థిని వెంటపడి ఫోన్ ఇస్తావా? లేదా? అంటూ గొడవకు దిగింది. 'నువ్వు ఎవ్వరే ఫోన్ తీసుకోవడానికి..' అని బూతులు తిడుతూ నాగమణిపై చెప్పుతో దాడి చేసింది. ఈ ఘటనను విద్యార్థులు వీడియో తీసి వైరల్ చేశారు. యాజమాన్యం దృష్టికి వెళ్లడంతో తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. అమ్మాయి మానసిక పరిస్థితి బాగోలేక ఇలా చేసిందని సంజాయిషీ ఇచ్చి విద్యార్థినిని ఇంటికి తీసుకువెళ్లారు. ఆ విద్యార్థిని గతంలోనూ సహ విద్యార్థులను తిట్టిందని, దీనిపై ఫిర్యాదులు రావడంతో యాజమాన్యం తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లిందని తెలిసింది.



లెక్చరర్‌పై చెప్పుతో దాడి చేస్తున్న విద్యార్థిని

వ్యక్తిగత జీవితంలో జోక్యం వద్దు!

» విజయవాడ డీసీపీ, ఎస్‌హెచ్‌వోలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విశ్రాంత అసిస్టెంట్ కన్జర్వేటర్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎంవీవీఎస్ఎన్ మూర్తి వ్యక్తిగత జీవితం, స్వేచ్ఛలో జోక్యం చేసుకోవద్దని విజయవాడ డీసీపీ, మాచవరం ఎస్‌హెచ్‌వోలను హైకోర్టు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ అధికారులకు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌పై ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. తన కిడ్నాప్‌కు సంబంధించి ఇంటెలిజెన్స్ అధికారుల ముందు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఉపసహరించుకోవాలంటూ డీసీపీ, ఎస్‌హెచ్‌వో ఒత్తిడి చేస్తున్నారని మూర్తి పిటిషన్ వేశారు.

ఆధార్ లింక్ చేసి మద్యం విక్రయించాలి

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన డాక్టర్ ఎస్.షిరిన్ రెహ్మాన్ హైకోర్టులో పిల్ వేశారు. 21 ఏళ్లలోపు వారికి మద్యం విక్రయించకుండా నిలువరించేందుకు ఆధార్ లింక్ చేసి మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎడిక్షన్ సెంటర్ల పని తీరు, రోగులకు అందుతున్న చికిత్సలను పర్యవేక్షించేలా ఆదేశించాలని కోరారు.

నిర్దేశించిన విద్యార్హతలోనే 50 % మార్కులు ఉండాలి

» డీఎస్సీకి 29,800 దరఖాస్తులు: పాఠశాల విద్యాశాఖ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల మార్కుల శాతం విషయంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు వివరణ ఇచ్చారు. పోస్టుకు నిర్దేశించిన విద్యార్హతలో మాత్రమే 50 శాతం మార్కులు రావాలని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అంటే డిగ్రీ విద్యార్హతతో దరఖాస్తు చేసుకునే పోస్టులకు డిగ్రీలోనే 50 శాతం మార్కులు ఉండాలని, ఇంటర్మీడియట్, పదో తరగతిలో 50 శాతం తప్పనిసరి కాదని వివరించారు. ఓపెన్ కేటగిరీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరుకుంటేనే సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలన్నారు. ఐదేళ్ల ఓరియెంటల్ కోర్సు చదివిన అభ్యర్థులకు ఇంటర్ ఉండదు కాబట్టి ఇంటర్ ఆప్షన్ వద్ద నో అని పెట్టాలని సూచించారు. 2024-డీఎస్సీ అభ్యర్థులు ఆధార్ నంబరు ద్వారా ఈ డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలని, ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే అదనంగా పెట్టుకున్న పోస్టులకు ఫీజులు చెల్లించాలని వివరించారు. శాప్ నిబంధనల మేరకు స్పోర్ట్స్ కోటా పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. కాగా, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయిన మూడోరోజుకు 29,800 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

డీసెట్ నోటిఫికేషన్ విడుదల

రెండేళ్ల ప్రాథమిక విద్యలో డిప్లొమా కోర్సులో అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ డీసెట్ నోటిఫికేషన్ ఇచ్చింది. మే 5 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని, జూన్ 2, 3 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని, 10న ఫలితాలు విడుదలవుతాయని పేర్కొంది. అర్హత సాధించినవారు ప్రభుత్వ డైట్‌లు, ప్రైవేటు ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో అడ్మిషన్లు పొందవచ్చని సూచించింది.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును బోర్డు పొడిగించింది. సప్లిమెంటరీ, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

రేపటి నుంచి బడులకు వేసవి సెలవులు

» ఇంటర్ కాలేజీలకు కూడా.. జూన్ 12న పునఃప్రారంభం

పాఠశాల విద్యాశాఖ బడులకు వేసవి సెలవులు ప్రకటించింది. ఈ విద్యా సంవత్సరానికి బుధవారం చివరి పనిదినం అని, గురువారం నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు, తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలల పునఃప్రారంభ సంసిద్ధత కార్యక్రమాల అమలు కోసం జూన్ 5 నుంచి టీచర్లు విధులకు హాజరుకావాలని ఆయన సూచించారు. ఇంటర్ కాలేజీలకు కూడా రేపటి నుంచి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఏటా జూన్ 1న ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం సంస్కరణల్లో భాగంగా ఏప్రిల్ 1నే ప్రారంభమైంది. తిరిగి జూన్ 1న కాలేజీలు ప్రారంభమవుతాయి.

లిఫ్టులో చిక్కుకున్న భక్తులు

» 20 నిమిషాల పాటు ఉక్కిరిబిక్కిరి.. తిరుమలలో ఘటన

తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల గోవిందసాయి అతిథి గృహంలోని లిఫ్టు మంగళవారం నిలిచిపోవడంతో ఐదుగురు భక్తులు చిక్కుకుపోయారు. పూర్తిగా కిందకు దిగని లిఫ్టులో డోర్లు తెరుచుకోక 20 నిమిషాలు భయాందోళనతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కడపకు చెందిన ఓ కుటుంబం తిరుమలకు వచ్చింది. గోవిందసాయి అతిథిగృహంలో గదులను అద్దెకు తీసుకున్నారు. మంగళవారం ఉదయం పైఅంతస్థు నుంచి కిందకు వచ్చేందుకు లిఫ్ట్ ఎక్కారు. కిందకు చేరుకునే సమయంలో కరెంట్ పోవడంతో లిఫ్ట్ ఆగిపోయింది. డోర్లు తెరుచుకోకపోవడంతో అందులో ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు ఉండిపోయారు. భయపడుతున్న చిన్నారులను ఓదార్చి బయటున్న తమవారికి ఫోను ద్వారా సమాచారమిచ్చారు. సిబ్బంది సమాచారంతో టెక్నీషియన్ లిఫ్ట్ డోర్ తీయడంతో భక్తులు సురక్షితంగా బయటపడ్డారు.



లిఫ్టులో ఇరుక్కుపోయిన చిన్నారిని బయటకు తీసుకొస్తున్న టెక్నీషియన్

వేట నిషేధ భృతికి మార్గదర్శకాలు

» మత్స్యకారులకు మేలు చేసేలా గత నిబంధనల సవరణ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు వేట నిషేధ కాల భృతి విషయంలో గత ప్రభుత్వ నిబంధనలను సవరిస్తూ.. ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలు జారీచేసింది. గతంలో మత్స్యశాఖ చట్టం-1958 ప్రకారం మర బోట్లు, మోటార్, నాటు, నాన్ మోటార్ బోట్లను నమోదు చేసుకొని, ఏపీఎంఎఫ్ఆర్ చట్టం-1995 కింద లైసెన్స్ ఉండి, లబ్ధిదారుల ఎంపిక సమయానికి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉన్న సభ్యులకు మాత్రమే భృతి దక్కేది. తాజా మార్గదర్శకాల్లో...1958 చట్టప్రకారం నమోదైన అన్ని బోట్లకు వర్తింపజేస్తూ.. ఏటా ఏప్రిల్ 14న వేట నిషేధం విధించే నాటికి చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉంటే సరిపోతుందని ప్రభుత్వం పేర్కొంది. సముద్రంలో వేటకు వెళ్లే అన్ని రకాల పడవలకు రాయితీ డీజిల్ తీసుకోవడంతో నిమిత్తం లేకుండా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నది. గత ప్రభుత్వంలో ఏదైనా పథకం కింద లబ్ధి పొందితే.. వేట నిషేధ భృతికి అనర్హులను చేయగా, ఇప్పుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో మత్స్యకార పెన్షన్ లబ్ధిదారు అయి ఉండకూడదని పేర్కొంది.

సీనియర్ సిటిజన్ కార్డు కోసం

సచివాలయంలో దరఖాస్తు

● వెరిఫికేషన్ అనంతరం పీడీఎఫ్ ఫార్మెట్‌లో కార్డు జారీ

బెంజిసర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మీకు 60 ఏళ్లు నిండాయా.. అయితే సీనియర్ సిటిజన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం ఎక్కడికో వెళ్లనక్కరలేదు. సమీపంలోని వార్డు, గ్రామసచివాలయాల్లో వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. వెరిఫికేషన్ అనంతరం సీనియర్ సిటిజన్ కార్డు స్వంతం చేసుకోవచ్చు. 60 ఏళ్లు నిండినవారు తమ సమీపంలోని వార్డు లేదా గ్రామసచివాలయాలకు వెళితే అక్కడ సిబ్బంది ఒక దరఖాస్తు ఫారం ఇస్తారు. దాన్ని నింపి ఒక పాస్‌పోస్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు ఇవ్వాలి. పుట్టిన తేదీ, అడ్రస్ నిర్ధారణకు ఆధార్ కార్డు సరిపోతుంది. స్వయంగా సీనియర్ సిటిజనే సచివాలయానికి వెళితే పాస్‌పోర్టు సైజ్ ఫొటో కూడా అక్కరలేదు. సిబ్బందే డిజిటల్ ఫొటో తీస్తారు. అయితే సీనియర్ సిటిజన్‌కు హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయిఉండాలి. లేదంటే అనర్హులు. వెళ్లేటప్పుడు రిజిస్టర్ మొబైల్ ఫోన్ తీసుకువెళ్లాలి. దానికే ఓటీపీ వస్తుంది. ఈ ప్రాసెస్ చేసినందుకు రూ.40చెల్లించి రసీదు పొందాలి. ఈ డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో జమవుతాయి. ప్రాసెస్ పూర్తయ్యాక సీనియర్ సిటిజన్ కార్డు మీస్వంతం.

డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల తేదీలు మార్చాలి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఇబ్బంది లేకుండా రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల తేదీ ల్లో మార్పులు చేయాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమ యం హేమంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చే శారు. ఈమేరకు మంత్రి లోకేశ్‌కు లేఖ రాసినట్టు తెలిపారు. జూన్ 16 నుంచి జూలై 16 వరకు డీఎస్సీ, జూన్ 16 నుంచి 26 వరకు ఏపీపీఎస్సీ వారు పరీక్షలు నిర్వహిస్తూ షెడ్యూల్‌ను విడుదల చేశారన్నారు. ఒకేరోజు రెండు పరీక్షలు షెడ్యూల్ పడితే అభ్యర్థులు నష్టపోయే అవకాశముందన్నారు. ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మే 4న నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షకు సుమారు 13వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. మే 4న ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. పరీక్ష నిర్వహణకు నగర పరిధిలో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు వీలుగా ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. డీఈవో యూవీ సుబ్బారావు, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్, సిటీ కో-ఆర్డినేటర్ ఎస్.ఆదిశేష శర్మ, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని బ్యాగ్‌లో

నగదు, బంగారం, వెండి వస్తువులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం-1 లోని క్లోక్‌రూమ్‌లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కొంతకాలం కిందట ఒక గ్రేబ్లాక్ రంగుతో ఉన్న బ్యాగ్‌లో రూ.9,70,200 నగదు, మరికొన్ని బంగారం, వెండి వస్తువులు ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం రైల్వే డాగ్ స్క్వాడ్‌లోని జూలియా జాగిలం ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం ఉత్తరం వైపున్న సామగ్రి భద్రపరిచే క్లోక్‌రూమ్‌లోకి ప్రవేశించింది. అనుమానిత బ్యాగ్ దగ్గర ఆగిపోవటంతో పోలీసులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌పై 3463 టోకెన్ నెంబరు ఉంది కానీ, ఎవరిదన్నది తెలియరాలేదు. క్లోక్‌రూమ్‌లోని గుమస్తాను అడగ్గా ఈనెల 10వ తేదీ నుంచి ఆ బ్యాగ్ ఉందని, ఊరు, పేరు తెలియదని సమాధానం చెప్పాడు. పోలీసులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం మధ్యవర్తుల సహాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏపీ రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు ఉత్తర్వుల మేరకు రైల్వే విజయవాడ జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జి.రత్నరాజు పర్యవేక్షణలో సీఐ జేవీ రమణ ఆధ్వర్యంలో జీఆర్‌పీ సిబ్బంది, ఆర్‌పీఎఫ్ సీఐ ఆలీబేగ్, సీఐడీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఎస్ఐ మకత్‌లాల్ స్టేషన్‌లో గత కొద్ది రోజులుగా విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా 16 మంది పాత నేరస్థులను గుర్తించి పట్టుకున్నారు. మరో ఘటనలో క్లోక్‌రూమ్‌లో భారీ మొత్తంలో డబ్బు, వెండి, బంగారు వస్తువులు గల గుర్తుతెలియని వ్యక్తి బ్యాగ్‌ను గుర్తించటం విశేషం. పోలీసు జాగిలం సహకారంతో ఇటువంటి మరికొన్ని ప్రక్రియలు చేసే అవకాశం ఉంది.





ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు, శ్రేణులు

రాయితీల పేరుతో రైడింగ్ యాప్‌ల మోసం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

విజయవాడ ఐ/సత్యనారాయణపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓలా, ఉబర్, రాపిడో వంటి బడా సంస్థలు యాప్‌ల పేరుతో ఒకవైపు ప్రయాణికులను, మరోవైపు ఆటో కార్మికులను దోచుకుంటున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. మంగళవారం బీఆర్టీఎస్ రోడ్డులో సీఐటీయూ అనుబంధ సంస్థ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వందలాది ఆటోలను నిలిపి కార్మికులు ఆందోళన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుడ్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల గొంతు కోస్తూ బడా సంస్థలకు మద్దతు తెలపడం బాధాకరమన్నారు. ప్రైవేటు కంపెనీలకు లాభాల కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల అధికార దుర్వినియోగం అవుతుందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్థలకు చెందిన యాప్‌లను నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశీనాథ్ మాట్లాడుతూ ఆటో కార్మికులందరికీ వాహన మిత్ర పథకం ద్వారా గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10వేలను రూ.15వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం 10 నెలలు గడిచినా నోరు మెదపడం లేదని విమర్శించారు. ర్యాలీలో సీపీఎం కార్యవర్గ సభ్యుడు దుర్గారావు, హనుమంతరావు, రూబేన్, కరీముల్లా, దుర్గావళి, కోటయ్య, తిరుపతయ్య, భాస్కర్, చిన్న పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రూ.10 లక్షల విలువైన 22 ఎలక్ట్రిక్ బైక్‌ల స్వాధీనం

గుణదల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ దొంగతనాలు చేసే అనుమానితులపై మాచవరం పోలీసులు పూర్తి నిఘా పెట్టడంతో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారని వారి నుంచి రూ.10లక్షల విలువైన 22 ఎలక్ట్రిక్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆదేశాలతో నగరంలో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈక్రమంలోనే మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు తమ వాహనాన్ని వెనక్కి తిప్పుకుని వెళ్లే ప్రయత్నం ఈఎస్ఐ హాస్పటల్ వద్ద చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలతో వారు ప్రయాణిస్తున్న వాహనంతో పాటు మరికొన్ని వాహనాలు చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన షేక్ బాషా (35), ఉండికి చెందిన జక్కంశెట్టి దుర్గాప్రసాద్ (26), విజయవాడ వాంబేకాలనీకి చెందిన సయ్యద్ యూసఫ్ (28)ను అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరు పర్చారు. సీఐ ప్రకాష్, ఎస్ఐ ఏవీ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సీహెచ్ రమేష్, ఎం సుభాష్ కుమార్, ఏ తరుణ్ కుమార్ వర్మను సీపీ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఇన్‌చార్జ్ డీసీపీ కె.జి.వి.సరిత అభినందించారన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపర్చిన సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్





ఓ వైపు ఉద్యోగం చేస్తూ.. మరో వైపు గృహిణిగా ఇంటి వ్యవహారాలను చూసుకొంటూ సివిల్స్‌లో 451 ర్యాంకు సాధించారు నగరానికి చెందిన రాపర్తి ప్రీతి. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె... చిన్నప్పటి నుంచీ తన తండ్రి కష్టాన్ని చూసి పెరిగారు. నాన్న తనపై పెట్టుకున్న నమ్మకం... భర్త ప్రోత్సాహం... కోచింగ్ లేకుండానే సివిల్స్ ర్యాంకు సాధించిన ప్రీతిని 'నవ్య' పలుకరించింది.

వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ

"మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మాది. మధ్య తరగతి కుటుంబం. ఆర్థికంగా చాలా వెనుకబడి ఉండడంతో కుటుంబం కోసం మా అమ్మ అర్చన, నాన్న రాపర్తి నందకిశోర్ చాలా కష్టపడ్డారు. అన్నయ్య, నేను... ఇద్దరు సంతానం. నేను కీస్ హైస్కూల్‌లో చదివాను. 2016లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను.

పాపను చూసుకొంటూ...

సివిల్స్‌కు నేను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. 2019లో మొదటిసారి సివిల్స్ పరీక్ష రాస్తే... మెయిన్స్ వరకు వెళ్లాను. 2021లో నాకు పెళ్లయింది. నా పెళ్లి తరువాత మా నాన్న చనిపోయవారు. నాకు మూడేళ్ల పాప. తనను చూసుకొంటూనే ఉద్యోగం చేసుకుంటున్నాను. కొవిడ్ నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ కావడం కాస్త కలిసొచ్చింది. ఇంట్లో పాపను, కుటుంబాన్ని చూసుకుంటూ ఉద్యోగం చేసుకొనే అవకాశం లభించింది.

మావారి ప్రోత్సాహంతో...

ఎలాగైనా సివిల్స్ సాధించాలన్నది నా కల. మావారు ఆదిమూలం శివప్రసాద్ నాకు అండగా నిలిచారు. నన్ను ప్రోత్సహించారు. అయితే చంటిపాప, ఇంటి పనులు, ఉద్యోగం... వీటన్నిటితో సివిల్స్‌కు సన్నద్ధమవ్వడం సాధ్యం కాదేమోననే సందేహం కలిగింది. అదే విషయం ఆయనకు చెబితే... 'ఇంటి పనులు, ఉద్యోగం వదిలేసైనా సరే సివిల్స్ కోచింగ్‌కు వెళ్లమన్నారు. సివిల్స్ పరీక్ష రాసి నాలుగేళ్లు అవుతుందని, కొత్త తరంతో పోటీపడడం కష్టమని అన్నాను. కానీ ఆయన నాలో స్ఫూర్తి నింపారు. దాంతో రెండేళ్ల కిందట పట్టుదలగా సివిల్స్ కోసం ప్రిపరేషన్ ప్రారంభించాను.

ఆన్‌లైన్‌లోనే...


కోచింగ్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సమాచారం సేకరించాను. నాకున్న సందేహాలను కూడా ఆన్‌లైన్ ద్వారానే నివృత్తి చేసుకున్నా. వర్క్ ఫ్రమ్ హోమ్ నాకు చాలా కలిసివచ్చింది. అప్పుడప్పుడూ ఆఫీసుకు వెళ్లేదాన్ని. మా కుటుంబం కూడా అండగా నిలిచింది. అన్నీ సమన్వయం చేసుకుంటూ కష్టపడ్డాను. ఇంటర్వ్యూకు ఎంపికయినప్పుడు కూడా ఎలాంటి కోచింగ్‌కూ వెళ్లలేదు. ఇంటర్వ్యూ విధానం... జవాబులివ్వాల్సిన పద్ధతి తదితర విషయాలన్నీ ఆన్‌లైన్‌లోనే తెలుసుకున్నా.

హైడ్రా గురించి ఆరా...

ఇంటర్వ్యూలో హైడ్రా గురించి అడిగారు. తెలంగాణలో చిన్న జిల్లాల ఏర్పాటుతో లాభనష్టాలు, రాష్ట్రం అప్పుల్లో కూరుకపోవడానికి గల కారణాలను కూడా అడిగారు. ఇక నేను చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి సంబంధించి ప్రశ్నలు వేశారు. ఎక్కడా తడబడకుండా నాకు తెలిసిన విషయాలను చెప్పాను. ఇంటర్వ్యూ నాకు చాలా సంతృప్తినిచ్చింది. 451 ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉంది. ర్యాంకు వస్తుందని ఊహించలేదు. చంకలో బిడ్డ, ఉద్యోగం, కుటుంబం... అన్నీ చూసుకొంటూ సివిల్స్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వడం కష్టమే. కానీ... నా లక్ష్యం ముందు అవన్నీ చిన్నవే అనిపించాయి."

• బయ్యు దామోదర్

విన్నర్



'గోడలకు ఉన్న బీటలు బలహీనతలు కావు... అవి కాంతి లోపలికి రావటానికి కారణాలు'... శక్తి దూబేకు అత్యంత ఇష్టమైన మాటలివి. ఆమె దృష్టిలో బలహీనతలనేవి పరాజయాలకు కారణాలు కావు. కొత్త కొత్త మార్గాలను అన్వేషించటానికి మార్గాలు. ఈ మాటలను గాఢంగా నమ్మిన శక్తి దూబే మంగళవారం యూపీఎస్‌సీ విడుదల చేసిన జాబితాలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

మార్పు కోరే 'శక్తి'

సాధారణంగా యూపీఎస్‌పీ పరీక్షలో మొదటి ర్యాంకుల్లో నిలిచినవారు ఏళ్ల తరబడి చదువుతూనే ఉంటారని, బయట ప్రపంచాన్ని పట్టించుకోరని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ శక్తి దూబే ప్రస్థానం చూస్తే వారి అభిప్రాయం కచ్చితంగా మారుతుంది. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ)లో చదువుతున్న సమయంలో హాస్టల్‌లో స్నేహితులతో కూర్చుని మన చుట్టూ జరిగే అనేక విషయాల గురించి చర్చించటం, అర్ధరాత్రి దూరంగా ఎక్కడో పోలీస్ సైరన్ వినిపిస్తే 'నాకు ఏం పర్వాలేదు' అనుకోవటం లాంటి రకరకాల ఘటనలు ఆమెను ముందుకు నడిపించాయి. విజేతగా నిలిచేలా చేశాయి. శక్తి స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్. ఆమె తండ్రి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తారు. తల్లి గృహిణి. ప్రయాగ్‌రాజ్‌లో స్కూలు చదువు పూర్తయిన తర్వాత శక్తి వారణాసిలోని బీహెచ్‌యూలో చేరారు. అక్కడ హాస్టల్ వాతావరణం తనకు అనేక పాఠాలు నేర్పిందంటారు శక్తి. 'స్టూడెంట్ డిబేటింగ్ కమిటీ'కి నేతృత్వం వహించటంవల్ల ఆమెకు అనేక కొత్త విషయాలు తెలియటం మొదలయింది. "నాకు వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలనే కోరిక ఉండేది. వాటిని ఎలా మెరుగుపరచాలనే విషయాన్ని ఆలోచించేదాన్ని" అంటారు శక్తి.

స్ఫూర్తి అదే...

యూపీఎస్‌సీ పరీక్షలు రాయాలనే స్ఫూర్తి ఇతరులను చూసి వస్తుంది. కుటుంబంలో ఎవరైనా సివిల్ సర్వెంట్స్ ఉంటే వస్తుంది. కానీ శక్తికి మాత్రం క్యాంపస్‌లో రాత్రిళ్ల అదనపు క్లాసులకు వెళ్లివస్తున్నప్పుడు పోలీస్ జీప్ సైరన్ విన్నప్పుడు వచ్చింది. "దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్‌లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది" అంటారు శక్తి. "ఆ ఆలోచన పదేపదే రావడంతో నా కుటుంబ సభ్యులతో ఈ విషయం గురించి మాట్లాడాను. ధైర్యం కలగటం అనేది భావోద్వేగాలకు సంబంధించిన విషయం. కానీ దాని

> **"దూరంగా ఎక్కడో పోలీస్ పెట్రోల్ వాహనం సైరన్ వింటే నాకు చాలా ధైర్యం కలిగేది. 'పబ్లిక్ సర్వీస్‌లో ఉంటే ప్రజలకు ఎంతో ధైర్యం ఇవ్వవచ్చు' అనే ఆలోచన నాలో చాలా ఆలోచనలు రేకెత్తించింది."**

వెనక ఒక బలమైన లాజిక్ ఉంది. ఈ రెండూ కలిసి ఉన్నాయి కాబట్టే యూపీఎస్‌సీ పరీక్షలు రాయాలనుకున్నాను. అమ్మ, నాన్న నాకు అండగా నిలిచారు" అన్నారు శక్తి.

ఆ కవితలు...

శక్తికి కవితలు రాయటం ఒక అలవాటు. సాధారణంగా కవయిత్రులు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ శక్తి దానికి పూర్తి విరుద్ధం. తన అభిప్రాయాలను చాలా సూటిగా, స్పష్టంగా చెబుతారు. సామాన్య ప్రజల అవసరాలను పట్టించుకోకుండా చేసే సంస్కరణలవల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదనేది ఆమె స్పష్టమైన అభిప్రాయం. "మన దేశంలో పోలీసు వ్యవస్థ 1861 పోలీస్ చట్టం పరిధిలోనే ఇంకా పని చేస్తోంది. ఆ సమయంలో ఈ చట్టాన్ని ప్రజలను నియంత్రించడానికి ప్రవేశపెట్టారు. సేవ చేయటానికి కాదు. ప్రస్తుతం మన అవసరాలు వేరు. వాటికి తగ్గట్టుగా మారాలి. పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు కానిస్టేబుల్ స్థాయి నుంచి మొదలవ్వాలి. ఉన్నతాధికారుల నుంచి కాదు" అంటారు శక్తి. యూనిఫాం సివిల్‌కోడ్ విషయంలో కూడా ఆమెకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. "యూపీ విషయాన్నే తీసుకుందాం. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు అనేక రకాల ఇబ్బందులు పడుతూ ఉంటారు. యూనిఫాం సివిల్ కోడ్‌వల్ల మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి. గృహ హింస, కట్నాల కోసం వేధింపులు తగ్గుతాయి" అంటారామె. అయితే దీనిని అమలు చేయటం అంత సులభం కాదనే విషయం కూడా శక్తికి తెలుసు.

"ఒకేసారి యూనిఫాం సివిల్‌కోడ్‌ను అమలు చేస్తే విమర్శలు, వ్యతిరేకత రావచ్చు. అందరి అభిప్రాయాలూ తీసుకొని నిదానంగా ప్రవేశపెడితే మంచిది" అంటారామె. యూపీఎస్‌సీలో ఆమె అంతర్జాతీయ సంబంధాలను ఒక సబ్జెక్ట్‌గా ఎంచుకున్నారు. ప్రస్తుత ప్రపంచంలో మన దేశానికి ఉన్న ప్రాధాన్యత గురించి ఆమెకు స్పష్టమైన అవగాహన ఉంది. "పర్యావరణ విషయంలో మనం ఇతరులకు మార్గదర్శకంగా ఉన్నాం. అంతర్జాతీయ సోలార్ అలయెన్స్ లాంటి వాటికి నేతృత్వం వహిస్తున్నాం" అని చెబుతున్నారు శక్తి.

చిత్రజ్యోతి
SINCE 1965



జూన్ 14న గద్దర్ అవార్డులు

తెలుగు సినీ రంగంలో అవార్డుల ప్రధానోత్సవానికి రంగం సిద్ధమైంది. జూన్ 14న గద్దర్ తెలుగు ఫిల్మ్ అవార్డులను అందించనున్నట్లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో నిర్వహించిన గద్దర్ అవార్డుల జ్యూరీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గద్దర్ అవార్డులను ఇవ్వడానికి 15మందితో కూడిన జ్యూరీ ని ఏర్పాటుచేశామన్నారు. ఆ జ్యూరీ కమిటీ 2024 ఏడాదిలో వచ్చిన సినిమాలలో కొన్నింటిని ఎంపిక చేసి మే చివరి నాటికి "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు" కమిటీకి పంపుతుందన్నారు. ఆ తరువాత జ్యూరీ పంపిన వివరాలను పరిశీలించి, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కాగా మంగళవారం ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన జ్యూరీ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గద్దర్ సినిమా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నభూతో న భవిష్యత్తు అన్నట్టుగా జరపాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ప్రపంచ స్థాయిలో సినిమా అవార్డుల ఫంక్షన్ ఏ విధంగా నిర్వహిస్తారో అందుకు ఏమాత్రం తగ్గకుండా గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాదులో నిర్వహించబోయే గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకొనే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు సూచించారు. రాగద్వేషాలకు అతీతంగా అవార్డులకు సినిమాలను ఎంపిక చేయాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టిన వ్యక్తుల పేరిట అవార్డులు ఇస్తున్నామని, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)



మంచి సినిమా చేశాననే తృప్తినిచ్చింది

- విజయశాంతి

'ఓ మంచి సినిమా చేశాననే తృప్తిని 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' ఇచ్చింది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు సీనియర్ నటి విజయశాంతి. కల్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలై సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా విజయశాంతి మీడియాతో మాట్లాడుతూ 'చాలా విరామం తర్వాత ఒక శక్తిమంతమైన పాత్రలో నటించాను. ప్రేక్షకులు విజయశాంతిని ఎలాంటి పాత్రలో చూడాలని అనుకున్నారో ఈ సినిమాతో అది నెరవేరింది. ఇప్పుడు యాక్షన్ అనేది ఒక రకంగా నాకు ఛాలెంజ్. అయినా చేశాను. పోలీస్ పాత్రలకు నేనైతేనే బాగుంటుందని ప్రేక్షకులు కూడా బలంగా ఫిక్స్ అయిపోయారు. తల్లీకొడుకుల బంధాన్ని, వారికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఈ సినిమాలో బలంగా చూపించాం. చాలా మంది మహిళలు ఫోన్ చేసి సినిమా అద్భుతంగా ఉంది అని అంటున్నారు' అని చెప్పారు.

ఆస్కార్ అవార్డులు.. సరికొత్త మార్పులు



వచ్చే ఏడాది జరగనున్న 98వ ఆస్కార్ అవార్డు వేడుక వివరాలను కమిటీ ప్రకటించింది. 2026 మార్చి 15న ఈ వేడుకను నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే, కొన్ని నూతన నిబంధనలను ప్రవేశపెట్టింది. ఓటింగ్ విధానంలో కఠిన నిబంధనలతో మార్పులు చేసింది. ఇకపై సినిమాకు ఓట్ చేసే ముందు నామినేట్ అయిన ప్రతీ చిత్రాన్నీ అకాడమీ సభ్యులు తప్పనిసరిగా వీక్షించాలని పేర్కొంది. ఈ విధానం సరిగ్గా అమలు పరిచేందుకు అకాడమీ సభ్యుల వాచింగ్ హిస్టరీపై నిఘా ఉంచనుంది. అలాగే, అఛీవ్‌మెంట్ ఇన్ కాస్టింగ్ అనే కేటగిరినీ ప్రవేశపెట్టడంతో పాటు, ఈ విభాగంలో రెండు దశల్లో ఓటింగ్ జరుగుతుందని వెల్లడించింది. ఆస్కార్ కోసం పోటీపడుతున్న చిత్రాలను వచ్చే ఏడాది జనవరి 22న ప్రకటించనున్నారు.

ఇకపై ఏఐ చిత్రాలకూ అవార్డులు

ఇటీవల సినిమాల్లో కృతిమ మేధ పరిజ్ఞానాన్ని వాడుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఏడాది నుంచి ఏఐ కేటగిరీలో తెరకెక్కిన చిత్రాలకూ పురస్కారాలు అందించనున్నారు. అయితే, ఈ సాంకేతికతతో తెరకెక్కిన చిత్రాల వల్ల ఇతర సినిమాల విజయావకాశాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆస్కార్ కమిటీ పేర్కొంది. మానవసృజనకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది.

యాక్టర్‌నే కానన్నారు



'ఇండస్ట్రీలోకి రాకముందు నా జాతకం చూపిస్తే 'నువ్వు యాక్టర్‌వి కాలేవు' అని చెప్పారు. నేను అవన్నీ పట్టించుకోలేదు. మా అమ్మ తన కొడుకు ఏమైపోతాడో అని అలా జాతకం చూపించారు. కానీ నేను నా మీద నమ్మకంతో ఇండస్ట్రీలోకి వచ్చాను. చేసే పని మీద నమ్మకం పెట్టుకుంటున్నానంతే' అని అన్నారు హీరో ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ప్రియదర్శి మీడియాతో మాట్లాడుతూ 'కామన్ మ్యాన్ పాత్ర ఎక్కువ మందికి కనెక్ట్ అవుతుందని నా నమ్మకం. 'మల్లేశం', 'సారంగపాణి' లాంటి సగటు జీవి పాత్రలను మన చుట్టూ చూస్తుంటాం. ఓ కామన్ మ్యాన్ కథే ఈ సినిమా. జాతకాలు నమ్మాలి అని కానీ, నమ్మకూడదు అని కానీ మేం చెప్పలేదు. ఒకరి నమ్మకాలను ఇంకొకరి మీద రుద్దితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూపించాం' అని చెప్పారు.

బుమ్రా, మంధానకు విజ్డెన్ అవార్డులు





లండన్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ అవార్డు దక్కింది. గతేడాది పురుషుల క్రికెట్‌లో ప్రదర్శన ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. మొత్తం మూడు ఫార్మాట్లలో బుమ్రా 86 వికెట్లు తీశాడు. వెస్టిండీస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగానూ నిలిచిన విషయం తెలిసిందే. గతంలో భారత్ నుంచి సచిన్, సెహ్వాగ్, విరాట్ కోహ్లీలకు ఈ పురస్కారం దక్కింది. ఇక, మహిళల క్రికెట్‌లో స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన లీడింగ్ క్రికెటర్‌గా అవార్డుకు ఎంపికైంది. గతేడాది ఆమె అన్ని ఫార్మాట్లలో కలిపి 1659 పరుగులు చేసి టాప్‌లో నిలిచింది. ఇక టీ20 ఫార్మాట్‌లో లీడింగ్ క్రికెటర్‌గా విండీస్ బ్యాటర్ నికోలస్ పూరన్‌ను ప్రకటించారు. 21 టీ20ల్లో అతను 464 పరుగులు సాధించాడు.

టైటిల్ చేరువలో హంపి

8వ రౌండ్ డ్రా

పుణె: మహిళల చెస్ గ్రాండ్ ప్రీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతూ టైటిల్‌కు చేరువైంది. మంగళవారం జరిగిన 8వ రౌండ్‌లో అలీనా కష్లిన్‌స్కయా (పోలెండ్)తో గేమ్‌ను హంపి డ్రా చేసుకొంది. సలోమ్ మెలియా (జార్జియా)తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక, సలిమోవా (బల్గేరియా)తో గేమ్‌ను వైశాలి డ్రా చేసుకొన్నారు. కాగా, చైనా గ్రాండ్‌మాస్టర్ జు జినర్ చేతిలో దివ్యా దేశ్‌ముఖ్ ఓటమిపాలైంది. మొత్తంగా 8 రౌండ్ల నుంచి హంపి, జు జినర్ చెరో 6 పాయింట్లతో సంయుక్తంగా అగ్ర స్థానంలో నిలిచి టైటిల్ కోసం పోటీపడుతున్నారు. దివ్య (5) మూడో స్థానంలో, హారిక (4) ఐదో స్థానంలో ఉన్నారు. టోర్నీలో మరో రౌండ్ మాత్రమే మిగిలి ఉంది.


జ్యోతి, నందినికి స్వర్ణాలు





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగమ్మాయిలు యర్రాజి జ్యోతి, అగసర నందిని జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలతో మెరిశారు. ఈ ప్రదర్శనతో వీళ్లిద్దరు.. వచ్చేనెల కొరియాలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్స్‌కు అర్హత సాధించారు. మంగళవారం కొచ్చిలో జరిగిన ఈ పోటీల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి 13.23 సెకన్లలో రేసు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. హెప్టాథ్లాన్‌లో నందిని 5813 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. పోల్‌వాల్ట్‌లో దేవ్ కుమార్ మీనా జాతీయ రికార్డును బద్దలుకొట్టి స్వర్ణం గెలిచాడు. మహిళల 400 మీటర్ల పరుగులో రూపల్ చౌదరి, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజాస్ అశోక్ స్వర్ణాలు నెగ్గారు.

తల్లిదండ్రులైన జ్వాల దంపతులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వెటరన్ షట్లర్ గుత్తా జ్వాల, తమిళ నటుడు విష్ణు విశాల్ దంపతులు తల్లిదండ్రులయ్యారు. జ్వాల ఆడబిడ్డకు జన్మనిచ్చిందని విష్ణు సోషల్ మీడియా ద్వారా తెలిపాడు. వీరి పెళ్లి 2021లో జరిగింది.

పెళ్లి కాని మిశ్రా.. భార్యను వేధించాడట!



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ అమిత్ మిశ్రా (42)కు విచిత్రమైన అనుభవం ఎదురైంది. మిశ్రాకు వివాహం కాకపోయినా.. కట్నం కోసం భార్యను వేధించాడంటూ అతడిపై కేసు నమోదైందనే వార్త నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీంతో ఈ వార్తలను మిశ్రా ఖండించాడు. రూ. కోటి పరిహారం కోరుతూ అమిత్‌పై భార్య కేసు వేసిందని, పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 10 లక్షల నగదు, కారు డిమాండ్ చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొందట. ఇది పూర్తిగా తప్పుడు వార్త అని మిశ్రా చెప్పాడు. అసలు తనకు పెళ్లి కాలేదన్న విషయం అందరికీ తెలుసన్నాడు. తనకు సంబంధంలేని కథనాలకు తన ఫొటోను వాడితే చట్టపరంగా చర్యలు తీసుకొంటానని హెచ్చరించాడు.

'రోస్టర్' వల్లే కామెంట్రీ చేయలేదు

వ్యాఖ్యాత హర్షా భోగ్లే

న్యూఢిల్లీ: ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లకు తనను పక్కనబెట్టారనే వార్తలను కామెంటేటర్ హర్షా భోగ్లే ఖండించాడు. రోస్టర్ విధానం కారణంగా సోమవారం కోల్‌కతా-గుజరాత్ మ్యాచ్‌లో కామెంట్రీ చేయలేదని ఎక్స్‌లో తెలిపాడు. సొంత జట్టుకు క్యూరేటర్ సహకరించకపోతే నైట్‌రైడర్స్‌ను మరో సిటీకి తరలించాలని భోగ్లే, సైమన్ డౌల్ సూచించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈడెన్‌లో జరిగే మ్యాచ్‌లకు వీరిద్దరినీ పక్కనబెట్టాలని బెంగాల్ క్రికెట్ సంఘం.. బీసీసీఐకి లేఖ రాసింది. ఫలితంగానే ఈడెన్‌లో గుజరాత్‌తో మ్యాచ్‌కు భోగ్లే దూరమయ్యాడన్న వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే భోగ్లే పైవిధంగా స్పందించాడు.

ఆధిక్యంలో బంగ్లా

సిల్హట్: నజ్ముల్ షంటో (60 బ్యాటింగ్) ఆదుకోవడంతో.. జింబాబ్వేతో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ పోరాడుతోంది. వర్ష ప్రభావితమైన మూడో రోజైన మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 57/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 194/4 స్కోరు చేసింది. మొత్తంగా బంగ్లా 112 పరుగుల ఆధిక్యంలో ఉంది. మోమినుల్ హక్ (47), హసన్ జాయ్ (33) ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 191, జింబాబ్వే 273 రన్స్ చేశాయి.

నేటి మ్యాచ్

హైదరాబాద్ x ముంబై

వేదిక హైదరాబాద్

రా.7.30 నుంచి

రైజర్స్ గెలిస్తేనే..?

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భీకర బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిలకడలేమి ఆటతో తడబాటుకు గురవుతోంది. బుధవారం ముంబై ఇండియన్స్‌తో తమ 8వ మ్యాచ్ ఆడనున్న రైజర్స్‌కు ఇక్కడ నుంచి ప్రతీ పోరులో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఒక్కటి ఓడినా ప్లేఆఫ్స్ ఆశలు అడుగంటుతాయి. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఐదింట్లో ఓడి 9వ స్థానంలో ఉన్న రైజర్స్ రాత మారాలంటే టాపార్డర్ బ్యాటర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. మరోవైపు హ్యాట్రిక్ విజయాలతో ఊపులో ఉన్న ముంబై తమ సొంతగడ్డ వాంఖడేలో రైజర్స్‌ను ఓడించి అన్ని విభాగాల్లో పైచేయి కనబర్చింది. రోహిత్ ఫామ్‌లోకి రావడం కూడా ఆ జట్టుకు పెద్ద సానుకూలాంశం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
ముంబై	8	4	4	0	8	0.483
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఢిల్లీ సిక్సర్

లఖ్‌నవూపై ఘన విజయం
రాహుల్, పోరెల్ అర్ధసెంచరీలు



పేసర్ ముకేశ్‌కు నాలుగు వికెట్లు



1 ఐపీఎల్‌లో వేగంగా (130 ఇన్నింగ్స్) 5వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా రాహుల్. వార్నర్ (135)ను అధిగమించాడు.

లఖ్‌నవూ: తాజా సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నిలకడ కొనసాగుతోంది. ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆరో విజయంతో పట్టికలో గుజరాత్‌తో పోటీపడుతోంది. ఇక తన పాత జట్టుపై కేఎల్ రాహుల్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో చెలరేగాడు. అంతకుముందు బౌలింగ్‌లో ఢిల్లీ పేసర్ ముకేశ్ కుమార్ (4/33) అద్భుత ప్రదర్శనతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఏమాత్రం కుదురుకోలేకపోయింది. ఫలితంగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (33 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 52), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 45), ఆయుష్ బదోని (21 బంతుల్లో 6 ఫోర్లతో 36) ఆకట్టుకున్నారు. ఛేదనలో ఢిల్లీ 17.5 ఓవర్లలో 161/2 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 51), కెప్టెన్ అక్షర్ పటేల్ (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 34 నాటౌట్) రాణించారు. మార్‌క్రమ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముకేశ్ నిలిచాడు.

రాహుల్, పోరెల్ దూకుడు: ఛేదనను ఢిల్లీ ధాటిగా ఆరంభించింది. ప్రతీ బ్యాటర్ మెరుగ్గా ఆడడంతో లఖ్‌నవూ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. ఆరంభం నుంచే ఓపెనర్లు అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ (15) బౌండరీలపైనే దృష్టి సారించారు. తొలి ఓవర్‌లోనే కరుణ్ రెండు ఫోర్లు, పోరెల్ ఫోర్‌తో 15 రన్స్ సమకూరాయి. అయితే నాలుగో ఓవర్‌లో సిక్సర్ సాధించిన కరుణ్‌ను మార్‌క్రమ్ బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పోరెల్‌కు రాహుల్ కలవడంతో ఢిల్లీ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఆరో ఓవర్‌లో చెరో ఫోర్‌తో పవర్‌ప్లేను జట్టు 54/1తో ముగించింది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో 7-9 ఓవర్ల మధ్య బౌండరీ రాలేదు. ఈ జోడీ కూడా షాట్లకు వెళ్లలేదు. చివరకు పదో ఓవర్‌లో పోరెల్ ఫోర్‌తో స్కోరు ముందుకు కదిలింది. తర్వాతి ఓవర్‌లోనే చెరో సిక్సర్ బాదడంతో 16 రన్స్ వచ్చాయి. అలాగే పోరెల్ 33 బంతుల్లో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే మార్‌క్రమ్ మరోసారి లఖ్‌నవూకు రిలీఫ్‌నిస్తూ పోరెల్ వికెట్ తీశాడు. అప్పటికే రెండో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. అక్షర్ రాగానే ధాటిని ప్రదర్శించాడు. బిష్ణోయ్ ఓవర్‌లో అక్షర్ రెండు సిక్సర్లతో జట్టు చకచకా లక్ష్యం వైపు సాగింది. 16వ ఓవర్‌లో శార్దూల్ 14 రన్స్ ఇవ్వడంతో సమీకరణం 24 బంతుల్లో 19కి మారింది. ఇద్దరూ మరింత జోరు చూపడంతో 13 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. అలాగే రాహుల్ 40 బంతుల్లో ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు.

శుభారంభం దక్కినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు మార్‌క్రమ్, మిచెల్ మార్ష్ ఆడిన తీరుకు మిగతా బ్యాటర్లకు సంబంధం లేకుండా పోయింది. ఈ జోడీ క్రీజులో ఉన్నంత సేపు లఖ్‌నవూ భారీ స్కోరు చేసేలా కనిపించింది. పది ఓవర్ల పాటు ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ చెత్త బంతులను బౌండరీలుగా మల్చడంతో తొమ్మిది పరుగుల రన్‌రేట్‌తో స్కోరు సాగింది. కానీ మధ్య ఓవర్లలో పేసర్ల ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడం జట్టును దెబ్బతీసింది. కెప్టెన్ పంత్ (0) చేతికి గాయం కావడంతో ఏడో నెంబర్‌లో బరిలోకి దిగాడు. ఆరంభంలో మార్‌క్రమ్ వేగం చూపాడు. అతను నాలుగో ఓవర్‌లో 4,6 బాదగా, మార్ష్ ఆరో ఓవర్‌లో సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 51 పరుగులతో మెరుగ్గా కనిపించింది. విప్రజ్ ఓవర్‌లో సిక్సర్ సాధించిన మార్‌క్రమ్ 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో అతడికిది నాలుగో ఫిఫ్టీ కావడం విశేషం. కానీ పదో ఓవర్‌లో మార్‌క్రమ్‌ను పేసర్ చమీర అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడి నుంచి లఖ్‌నవూ అనూహ్యంగా తడబడింది. రెండు వరుస ఫోర్లతో జోరు మీదున్న నికోలస్ పూరన్ (9) కోసం పేసర్ స్టార్క్‌కు బంతినివ్వడం ఫలితాన్నిచ్చింది. వరుసగా ఐదో ఇన్నింగ్స్‌లోనూ పూరన్‌ను స్టార్క్ అవుట్ చేయగలిగాడు. 14వ ఓవర్‌లో సమద్ (2), మార్ష్ (45)లను వెనక్కి పంపి ముకేశ్ ప్రత్యర్థికి గట్టి ఝలకిచ్చాడు. 12 పరుగుల వ్యవధిలోనే ముగ్గురు అవుటవడంతో మిల్లర్ (14 నాటౌట్), బదోని జాగ్రత్త కనబర్చారు. ముకేశ్ ఓవర్‌లోనే బదోని సులువైన క్యాచ్‌ను స్టబ్స్ అందుకోలేకపోయాడు. చివరి ఓవర్‌లో బదోని హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నా, అతడితో పాటు పంత్‌ను ముకేశ్ అవుట్ చేశాడు. ఆఖరి పది ఓవర్లలో 72 పరుగులే చేయడంతో లఖ్‌నవూ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) స్టబ్స్ (బి) చమీర 52, మార్ష్ (బి) ముకేశ్ 45, పూరన్ (బి) స్టార్క్ 9, సమద్ (సి అండ్ బి) ముకేశ్ 2, మిల్లర్ (నాటౌట్) 14, బదోని (బి) ముకేశ్ 36, పంత్ (బి) ముకేశ్ 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 159/6; వికెట్ల పతనం:** 1-87, 2-99, 3-107, 4-110, 5-159, 6-159; **బౌలింగ్:** అక్షర్ 4-0-29-0, స్టార్క్ 4-0-25-1, ముకేశ్ 4-0-33-4, చమీర 3-0-25-1, విప్రజ్ 1-0-14-0, కుల్దీప్ 4-0-33-0.

ఢిల్లీ: అభిషేక్ పోరెల్ (సి) మిల్లర్ (బి) మార్‌క్రమ్ 51, కరుణ్ నాయర్ (బి) మార్‌క్రమ్ 15, కేఎల్ రాహుల్ (నాటౌట్) 57, అక్షర్ పటేల్ (నాటౌట్) 34, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.5 ఓవర్లలో 161/2; వికెట్ల పతనం:** 1-36, 2-105; **బౌలింగ్:** శార్దూల్ 2-0-28-0, దిగ్వేష్ 4-0-24-0, ప్రిన్స్ 2.5-0-23-0, మార్‌క్రమ్ 3-0-30-2, అవేశ్ 3-0-19-0, బిష్ణోయ్ 3-0-36-0.

అలుపన్నది లేదా.. సోనా!



- రూ.లక్ష దాటిన పసిడి ధర
- ఢిల్లీలో మరో రూ.1,800 పెరిగి రూ.1,01,600కు తులం బంగారం
- సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరిక

న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపట్లేదు. రూ.లక్ష మైలురాయినీ దాటేసి సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్తోంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం మరో రూ.1,800 పెరిగి రూ.1,01,600కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,01,100కు ఎగబాకింది. ఈ రెండు స్వచ్ఛత లోహాల రేటు రూ.లక్ష మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు తులం బంగారం ధర రూ.22,650 (దాదాపు 29 శాతం) పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో దీని ధర వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకుతోడు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు నిల్వలు పెంచుకునేందుకు ఎగబడుతుండటం దేశీయంగా గోల్డ్ డిమాండ్‌ను మరింత పెంచింది. ఈనెలాఖరున (ఏప్రిల్ 30) అక్షయ తృతీయ కూడా. హిందువులు ఈ పండుగను పసిడి కొనుగోలుకు మంచి రోజుగా భావిస్తారు.

ఎంసీఎక్స్‌లోనూ రూ.లక్ష క్రాస్

మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లోనూ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు (ఆగస్టు డెలివరీ) ధర సైతం రూ.లక్ష దాటేసింది. ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ రేటు గడిచిన ఏడాది కాలంలో 41 శాతం పెరిగింది. ఎంసీఎక్స్ 2003 నవంబరులో గోల్డ్ కాంట్రాక్ట్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించింది. అప్పట్లో 10 గ్రాముల రేటు రూ.5,858గా ఉంది. గడిచిన 21 ఏళ్లలో ధర 17 రెట్లకు పైగా పెరిగింది.

3,500 డాలర్లకు ఔన్స్ గోల్డ్

అంతర్జాతీయ మార్కెట్లోనూ గోల్డ్ సరికొత్త శిఖరానికి ఎగబాకింది. స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 75.55 డాలర్లు లేదా 2.2 శాతం పెరుగుదలతో 3,499.92 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర ఏకంగా 83.76 డాలర్లు లేదా 2.44 శాతం వృద్ధితో తొలిసారిగా 3,500 డాలర్ల స్థాయికి చేరింది. ఔన్స్ సిల్వర్ 32.70 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వడ్డీ రేట్ల తగ్గింపునకు సంబంధించి యూఎస్ ఫెడరల్ రిజర్వ్ జీరోమ్ పావెల్‌పై ఒత్తిడి తెస్తుండటం బంగారం ధరను సరికొత్త గరిష్ఠానికి ఎగదోసింది.

మిడ్ మార్కెట్ జీసీసీ హబ్‌గా భారత్

హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలపైనే దృష్టి
నాస్కామ్-జిన్నోవ్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ క్రమంగా మిడ్ మార్కెట్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కు కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం మన దేశంలోని వివిధ నగరాల్లో 480కు పైగా మిడ్ మార్కెట్ జీసీసీలు ఉన్నాయి. దేశంలో ఇప్పటి వరకు ఏర్పాటైన జీసీసీల్లో ఇవి నాలుగో వంతని నాస్కామ్-జిన్నోవ్ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన ఒక నివేదిక తెలిపింది. 'ఇది చాలా పెద్ద మార్కెట్. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వార్షిక టర్నోవర్ 10 కోట్ల డాలర్ల నుంచి 100 కోట్ల డాలర్ల వరకు ఉన్న మిడ్ మార్కెట్ కంపెనీలు 1.3 లక్షల నుంచి 1.5 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో 30,000 నుంచి 40,000 కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇది భారత్‌కు మంచి అవకాశం' అని ఆ నివేదిక పేర్కొంది.

కీలక కేంద్రాలుగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై: మధ్య రకం కంపెనీల్లో ఎక్కువ కంపెనీలు తమ జీసీసీలను బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల్లో ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్)గా అందించే కంపెనీలు, ప్రొడక్ట్ ఆధారిత మిడ్ సైజ్ కంపెనీలు తమ జీసీసీల ఏర్పాటుకు బెంగళూరుపై మొగ్గు చూపుతున్నాయి. డిజిటల్, ఇంజనీరింగ్ రంగాలకు చెందిన మిడ్ మార్కెట్ కంపెనీల జీసీసీలకు హైదరాబాద్, చెన్నై కేంద్రాలుగా మారుతున్నాయి. మౌలిక సదుపాయాలు, స్థానిక ప్రభుత్వాల ప్రోత్సాహం, నిపుణులైన ఉద్యోగుల అందుబాటూ ఇందుకు తోడవుతున్నాయి.

భారత ఈ-కామర్స్‌పైనా అమెరికా కన్ను



అమెజాన్, వాల్‌మార్ట్‌లపై ఆంక్షలు తొలగించాలని ఒత్తిడి

వద్దంటున్న కిరాణా వ్యాపారులు

రిలయన్స్ రిటైల్, డీమార్ట్‌లకూ ముప్పే

న్యూఢిల్లీ: దాదాపు 12,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.10.65 లక్షల కోట్లు) స్థాయికి చేరిన దేశీయ ఈ-కామర్స్‌పైనా అమెరికా కన్నేసింది. తన అమెజాన్, వాల్‌మార్ట్ కంపెనీలకూ భారత్ ఈ-కామర్స్ మార్కెట్ తలుపులు బార్లా తెరవాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది. ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలోనూ ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయాన్ని గట్టిగా ప్రస్తావించినట్టు సమాచారం. అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జామీసన్ గ్రీర్ కూడా ఈ విషయంలో పట్టుదలతో ఉన్నారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించడంతో పాటు వివక్షాపూరితమైన ఆంక్షలనూ తొలగించాని డిమాండ్ చేశారు.

ఎందుకంటే?

దేశీయ ఈ-కామర్స్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. క్విక్ కామర్స్ కంపెనీలైతే దేశంలోని దాదాపు 100 ప్రధాన నగరాల్లోకి చొచ్చుకుపోయాయి. ఈ మార్కెట్లో ప్రస్తుతం అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ భారత అనుబంధ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌దే హవా. మరో అమెరికా రిటైల్ దిగ్గజం అమెజాన్ కూడా ఈ రంగంలో నువ్వా నేనా అన్నట్టు పోటీపడుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం విదేశీ ఈ-కామర్స్ సంస్థలు ఇతర సంస్థల వస్తు,సేవలకు మార్కెట్ వేదికలుగా మాత్రమే పని చేయాలి. అవి నేరుగా వస్తువులను తయారు చేసి.. స్టోర్ చేసి తమ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు వీల్లేదు. వివక్షాపూరితమైన ఈ ఆంక్షలను ఎత్తివేయాలని అమెరికా ప్రస్తుతం మోదీ సర్కారుపై ఒత్తిడి చేస్తోంది.

కిరాణాకు ఉరితాడే!

ఈ విషయంలో ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోతే దేశంలోని కిరాణా దుకాణాలకు అది ఉరితాడులా మారుతుందని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) హెచ్చరిస్తోంది. ఈ-కామర్స్ సంస్థల అడ్డగోలు ధరలు, డిస్కౌంట్‌లకు తట్టుకోలేక గత రెండు మూడేళ్లలో దాదాపు 10 లక్షల కిరాణా దుకాణాలు మూతపడిలక్షల మంది ఉపాధి లేక రోడ్డున పడిన విషయాన్ని గుర్తు చేసింది. అమెరికా ఈ-కామర్స్ దిగ్గజాలకూ సమాన అవకాశాలు కల్పించడం అంటే రిలయన్స్ రిటైల్, డీమార్ట్ వంటి దేశీయ రిటైల్ దిగ్గజాలకూ ముప్పని హెచ్చరించింది.

పెరగనున్న సిమెంట్ ధర

4% వరకు పెరిగే అవకాశం: క్రిసిల్



టన్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సిమెంట్ పరిశ్రమకు బాగానే కలిసొస్తుందని క్రిసిల్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ధర 2 నుంచి 4 శాతం, గిరాకీ 6.5 నుంచి 7.5 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. కీలక మౌలిక ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు 10 శాతం పెరగడం, గ్రామీణ గృహ నిర్మాణ రంగం పుంజుకోవడం, ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు ఇందుకు కలిసి రానున్నాయి.

నిరాశపరిచిన 2024: గత ఆర్థిక సంవత్సరం (2023-24) సిమెంట్ పరిశ్రమకు పెద్దగా కలిసి రాలేదు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గిరాకీ 4.5 నుంచి 5.5 శాతం మాత్రమే పెరిగింది. లోక్‌సభ ఎన్నికలు, భారీ వర్షాలు ఇందుకు ప్రధాన కారణం. దీంతో గత ఆర్థిక సంవత్సరం ధరలు కూడా పరిశ్రమను బాగా నిరాశ పరిచాయి. తెలుగు రాష్ట్రాల్లో ఒక దశలో ప్రముఖ కంపెనీల 50 కిలోల సిమెంట్ బస్తా రూ.300కి కూడా పడిపోయింది. ప్రసుతం కోలుకుని రూ.350 నుంచి రూ.360 మధ్య ట్రేడవుతోంది.

ఆరో రోజూ మార్కెట్ ముందుకే..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 416 పాయింట్ల మేర ఎగబాకి 79,824 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 187.09 పాయింట్ల లాభంతో 79,595.59 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41.70 పాయింట్ల వృద్ధితో 24,167.25 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. గడిచిన ఆరు సెషన్లలో సెన్సెక్స్ 5,748.44 పాయింట్లు (7.78 శాతం), నిఫ్టీ 1,768.1 పాయింట్లు (7.89 శాతం) బలపడ్డాయి. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.33.55 లక్షల కోట్ల వృద్ధితో రూ.427.37 లక్షల కోట్లకు (5.02 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ రూ.15 లక్షల కోట్లు: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరో రికార్డును నమోదు చేసింది. బ్యాంక్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) తొలిసారిగా రూ.15 లక్షల కోట్ల మైలురాయికి చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో లిస్టెడ్ కంపెనీ ఇదే. బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ఒక దశలో 2.23 శాతం పెరిగి రూ.1,970.65 వద్ద సరికొత్త జీవితకాల రికార్డును నమోదు చేసింది. చివరికి షేరు ధర 1.78 శాతం లాభంతో రూ.1,961.90 వద్ద స్థిరపడింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.15.01 లక్షల కోట్లుగా నమోదైంది.

ఈ నెల 28 నుంచి ఏథర్ ఎనర్జీ ఐపీఓ: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీదారు ఏథర్ ఎనర్జీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని మాత్రం బాగా తగ్గించుకుంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా నిధుల సేకరణను కంపెనీ గతంలో ప్రకటించిన రూ.3,100 కోట్ల నుంచి రూ.2,626 కోట్లకు తగ్గించుకుంది.

బిజినెస్

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ. 4,307 కోట్లు

ఒక్కో షేరుకు రూ.18 డివిడెండ్

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.4,307 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 8.1 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఆదాయం 6.1 శాతం పెరిగి రూ.30,246 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ.1,17,055 కోట్లకు, నికర లాభం 11 శాతం వృద్ధితో రూ.17,390 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.18 చొప్పున డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

కొత్తగా 2,665 నియామకాలు

పరిశ్రమ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా హెచ్‌సీఎల్ టెక్ గత ఆర్థిక సంవత్సరం 2,665 కొత్త నియామకాలు చేపట్టింది. దీంతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 2,23,420కు చేరింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా ప్రతి మూడు నెలలకు 2,000 మంది చొప్పున ఫ్రెషర్స్‌ను నియమించుకోనున్నట్లు హెచ్‌సీఎల్ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	400
చిత్తూరు	440	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	117
వరంగల్	120	గుంటూరు	105
కరీంనగర్	120	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	80
కర్నూలు	120	నెల్లూరు	85
విశాఖపట్నం	111	అనంతపురం	85
గోదావరి	117		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,350 ▲	92,900 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	91,000 ▼	99,000 ▼
విశాఖపట్నం	1,00,950 ▲	92,900 ▲	1,11,000 ▲
రాజమండ్రి	1,01,350 ▲	92,900 ▲	99,400 ▲
ప్రొద్దుటూరు	1,00,000 ▲	92,090 ▲	98,500 ▼
ముంబై	98,484 ▲	90,211 ▲	95,607 ▼

కశ్మీర్‌లో నెత్తుటేర్లు



ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి వెళ్తున్న భద్రతా బలగాలు



ఉగ్రదాడిలో చనిపోయిన ఓ పర్యాటకుడు

● పోయి.. మోదీకి చెప్పు..!!

"పో.. ఇక్కడి జరిగింది మోదీకి చెప్పు".. నన్ను కూడా చంపేయండి అని తన భర్తను చంపిన ఉగ్రవాదుల ఎదుట రోదించిన మహిళకు ఓ ఉగ్రవాది ఇచ్చిన సమాధానమిది. కర్ణాటకలోకి షిమోగకు చెందిన మంజునాథ్, పల్లవి, తమ కుమారుడు అభిజయ్‌తో కలిసి కశ్మీరు పర్యటనకు వెళ్లి పహల్గాం సందర్శనకు వెళ్లగా.. మంజునాథ్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. "ముగ్గురు, నలుగురు మాపై దాడి చేశారు. నా కళ్ల ముందే నా భర్తను కాల్చారు. ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నా భర్తను చంపారుగా నన్ను కూడా చంపేయండి.. అని వాళ్లని అడిగా.. మేము నిన్ను చంపం.. పోయి ఇక్కడ జరిగింది మోదీకి చెప్పు.. అని వాళ్లలో ఒకరు బదులిచ్చారు" దాడి అనంతరం పల్లవి చెప్పిన మాటలివి.

● హనీమూన్‌లో విషాదం...

"నేను, నా భర్త బేల్‌పూరీ తింటున్నాం. తుపాకీ పట్టుకున్న ఓ వ్యక్తి హఠాత్తుగా వచ్చి.. మీది ఏ మతం అని అడిగాడు. హిందువు అని నిర్ధారించుకుని నా భర్త తలపై తుపాకీ పెట్టి కాల్చేశాడు".. ఈ మధ్యనే పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని అందంగా ప్రారంభించాలని హనీమూన్‌కు కశ్మీరు వచ్చి ఉగ్రదాడిలో భర్తను కోల్పోయిన యువతి ఆ షాక్ నుంచి కాస్త తేరుకున్న తర్వాత చెప్పిన మాటలివి. రక్తపుమడుగులో పడి ఉన్న భర్త మృతదేహం పక్కన విషణ్ణ వదనంతో ఆ యువతి కూర్చున్నప్పుడు తీసిన ఓ ఫొటో ఆమె ఆవేదనను వివరించింది.

(మొదటిపేజీ తరువాయి)

26 మంది మరణించారు. మరో 20 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. మృతుల్లో ఇద్దరు విదేశీయులు (ఇజ్రాయెల్, ఇటలీ దేశస్థులు), ఇద్దరు స్థానికులు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైసారన్ ప్రాంతంలో ఉల్లాసంగా తిరుగుతున్న 40 మందికి పైగా పర్యాటకులను సమీప అడవిలో నుంచి వచ్చిన ఉగ్రవాదులు చుట్టుముట్టారు. లోయ అందాలను ఆస్వాదిస్తున్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. చాలామంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలతో అక్కడ భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండడంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసారన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ల ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. తర్వాత 26కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాదాపు ఐదుగురు ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. "నా భర్త తలలోకి తుపాకీ గుండు దూసుకెళ్లింది. మరో ఏడుగురు కూడా తీవ్రంగా గాయపడ్డారు" అని ఓ మహిళ పీటీఐ వార్తా సంస్థకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి, కాపాడాలని వేడుకున్నారు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగానే భయంతో పరుగులు తీసినప్పటికీ.. పెద్ద మైదాన ప్రాంతం కావడంతో తప్పించుకోవడానికి దారిలేకపోయిందని మరో మహిళ చెప్పారు. ఉగ్రవాదులు పేరు అడిగి మరీ కాల్చి చంపారని మరో మహిళ వెల్లడించారు. బైసారన్‌లో ఉగ్రదాడి జరిగిన సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నారు. దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను పటిష్ఠ భద్రత నడుమ పహల్గాం క్లబ్‌కు తరలించారు. అనంతనాగ్ జిల్లా యంత్రాంగం, పోలీసులు, అంబులెన్సులను ఘటనా స్థలానికి రప్పించారు. సైనికులు, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు బైసారన్ చేరుకున్నారు.



గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానిక వ్యక్తి

పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ముష్కరులను మట్టుబెట్టేందుకు సమీప అటవీ ప్రాంతాన్ని భద్రతాబలగాలు జల్లెడ పడుతున్నాయి. పెద్దఎత్తున ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు గాను అనంతనాగ్, శ్రీనగర్‌లో అత్యవసర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఓ వైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనలో ఉండగా మరోవైపు ప్రధాని మోదీ సౌదీ పర్యటనకు వెళ్లిన సమయంలో కశ్మీరులో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడులకు పాల్పడడం గమనార్హం.

హైదరాబాద్ వాసి మృతి

ఉగ్రదాడిలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి మృతి చెందారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగి మనీశ్ రంజన్ కుటుంబ సభ్యులతో కలిసి కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. బైసారన్ పర్యటనలో ఉండగా.. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆయన మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత నౌకాదళ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్(26) కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. హరియాణాకు చెందిన వినయ్‌కు కోచిలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ నెల 16న ఆయనకు వివాహమైనట్లు అధికారులు చెప్పారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన ఆయన ఉగ్రదాడిలో మరణించారు.

● ఈ ఉగ్రదాడి తమ పనేనని 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' సంస్థ ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా నుంచి టీఆర్ఎఫ్ ఉద్భవించింది. జమ్మూకశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇది పుట్టుకొచ్చింది. లష్కరేకు చెందిన సాజిద్ జట్, సజ్జద్ గుల్, సలీం రెహ్మానీ టీఆర్ఎఫ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. 2023 జనవరిలో కేంద్ర హోం శాఖ ఈ సంస్థపై నిషేధం విధించింది.

వాళ్లు జంతువులు: జమ్మూకశ్మీరు సీఎం ఒమర్

బైసారన్‌లో ఉగ్రదాడి ఘటన తెలిసి షాక్‌కు గురైనట్లు జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. పర్యాటకులపై కాల్పులకు తెగబడడం అత్యంత హేయమైన చర్య అని, వారు జంతువులని పేర్కొన్నారు. ఈ దాడిని ఖండించడానికి ఇంతకంటే మాటలు రావడం లేదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల సంఖ్య పెరుగుతోందని, ఆ వివరాలను ఇప్పుడే చెప్పలేమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జమ్మూకశ్మీరులో పౌరులపై నేరుగా జరిగిన అతిపెద్ద ఉగ్ర దాడి ఇదేనన్నారు.

అమర్‌నాథ్ యాత్ర వేళ..

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ ఉగ్రదాడి జరగడం గమనార్హం. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జూలై 3 నుంచి ప్రారంభం కానుంది. లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం మార్గంలోనే యాత్ర 48 కి.మీ. మేర ఉంది. 14 కి.మీ. మార్గం గండేర్బల్ జిల్లా మీదుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడడం ఆందోళన కలిగిస్తోంది.



కర్ణాటక వ్యాపారి మృతి..

ఉగ్రవాదుల దాడిలో కర్ణాటకకు చెందిన స్థిరాస్తి వ్యాపారి మంజునాథ రావు మరణించారు. ఆయన భార్య పల్లవి, ఎనిమిదేళ్ల కుమారుడు క్షేమంగా ఉన్నారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన పలువురు కన్నడిగులు ప్రమాదంలో ఉండడంతో సీఎం సిద్దరామయ్య అప్రమత్తమయ్యారు. మంగళవారం సాయంత్రం సీఎస్, పోలీసు ఉన్నతాధికారులు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. కర్ణాటక వాసులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అధికారులను వెంటనే కశ్మీరుకు పంపారు. ఉగ్రదాడిలో మరణించిన మంజునాథ శివమొగ్గలోని విజయ్‌నగర్ వాసి. భార్య, కుమారుడితో కలిసి ఈ నెల 19న కశ్మీరు పర్యటనకు వెళ్లారు.

రక్తం మరిగిపోతోంది: సిన్హా

పహల్గాం ఉగ్రదాడి బాధ్యులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. ఈ దాడిపై యావత్ దేశం ఆగ్రహం వ్యక్తం చేస్తోందని, మన బలగాల రక్తం మరిగిపోతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు మన బలగాలు రంగంలోకి దిగాయన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.



శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. అధికారులతో సమీక్ష

కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం రాత్రికి శ్రీనగర్ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, నిఘా విభాగం డైరెక్టర్ తపన్ డేకాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీరు డీజీపీ నళిన్ ప్రభాత్ పహల్గాం ఉగ్ర దాడి వివరాలను తెలియజేశారు. పహల్గాంలో పరిస్థితిపై ఉన్నతాధికారులతో షా సమీక్షించారు. బుధవారం ఆయన ఘటనా స్థలానికి వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.



ఆస్పత్రిలో ఉగ్రదాడి క్షతగాత్రులు



అనంత్‌నాగ్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద క్షతగాత్రులను తరలించిన అంబులెన్స్

ఆ ఉగ్రమూకను వదిలిపెట్టం: మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: పహల్గామ్‌లో ఉగ్రదాడిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పౌరులు, పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'నని రాష్ట్రపతి పేర్కొన్నారు. అత్యంత హేయమైన ఉగ్రదాడి వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని, వారిని వదిలిపెట్టబోమని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదని, ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం మరింతగా బలపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనకు సౌదీ అరేబియా వెళ్లిన ప్రధాని.. ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో పర్యటనను కుదించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి సౌదీ ప్రభుత్వ అధికారిక విందులోనూ మోదీ పాల్గొనలేదు. బుధవారం ఆయన భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా.. మంగళవారం రాత్రే బయల్దేరుతున్నట్లు తెలిపారు. అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులు కఠిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి మానవత్వానికి మచ్చ అని, ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఏకతాటిపై నిలుస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయంటూ డొల్ల ప్రకటనలను కట్టిపెట్టి, బాధ్యత తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారు. ఇలాంటి దారుణాలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి వార్త కలచివేస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు మద్దతుగా నిలుస్తామని ట్రంప్‌తో పాటు ఇజ్రాయెల్, అర్జెంటినా దేశాలు కూడా తెలిపాయి.

ఉగ్రదాడి అనాగరిక చర్య : స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని, అనేకమంది విలువైన ప్రాణాలను బలిగొన్న అనాగరిక ఉగ్రదాడిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు ఇటువంటి చర్యలకు పాల్పడటాన్ని ఆయన తీవ్ర ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితుల్లో తమిళనాడుకు చెందినవారు ఉండటం బాధాకరమన్నారు.

ఉగ్రదాడిపై పవన్ ఆందోళన

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడి వార్త నన్ను తీవ్రంగా బాధించిందని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. 'పదుల సంఖ్యలో అమాయకుల మరణం, తీవ్రంగా గాయపడిన సంఘటన భయంకరమైనది. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం' అని తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు.

ప్రశాంత కశ్మీరంలో.. మళ్లీ ఉగ్ర కలకలం

జమ్మూకశ్మీర్, ఏప్రిల్ 22: జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉంటూ.. కశ్మీరీలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో.. పహల్గాం ఘటన మళ్లీ ఉగ్ర కలకలాన్ని రేపింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రేరేపిత లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రమూకలకు అడ్డాలుగా ఉన్న ప్రాంతాలు క్రమంగా శాంతి నెలకొంటున్న క్రమంలో.. మరోమారు కల్లోలం రేగింది. ఇప్పుడిప్పుడే పర్యాటకం జోరందుకుంటున్న దశలో.. ఉగ్రవాదుల దాడితో పర్యాటకుల భద్రత మళ్లీ ప్రశ్నార్థకంలో పడుతోంది.

బాలీవుడ్ గీతాలకు నెలవు

"యే చాంద్ స రోషన్ చహరా.. జుల్ఫోంకీ రంగ్ సునెహరా.." అంటూ 1980ల వరకు బాలీవుడ్ పాటలకు కేరాఫ్‌గా కశ్మీర్ లోయలోని అందమైన సరస్సులు.. హిమనీనదాలు నిలిచాయి. ఆ తర్వాతి కాలంలో ఉగ్రమూకలు కశ్మీరీ పండిట్ల ఊచకోతలతో అట్టుడికించారు. అడపాదడపా అమర్నాథ్ యాత్రికులను, జవాన్లను టార్గెట్‌గా చేసుకుని, దాడులు చేస్తున్నారు. 2016 సెప్టెంబరు 18న ఉడీలోని సైనిక శిబిరంపై దాడిలో 17 మంది జవాన్లు.. 2019 ఫిబ్రవరి 14న జవాన్ల కాన్వాయ్‌పై జరిగిన మానవబాంబు దాడిలో 44 మంది దుర్మరణంపాలయ్యారు. ఆ తర్వాత అతిపెద్ద ఉగ్రదాడి మంగళవారం నాటిదే..!

ప్రశాంతత నెలకొంటుండగా..

2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేశాక.. జమ్మూకశ్మీర్ రెండుగా విడిపోయింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత కశ్మీరీ పండిట్లు క్రమంగా తమ స్వస్థలాలకు రావడం ప్రారంభించారు. నియోజకవర్గాల పునర్విభజన పూర్తై.. మళ్లీ ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం ఏర్పాటై, ఇప్పుడిప్పుడే పర్యాటకం ఊపందుకుంటోంది. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడితో మరోమారు కలకలం రేగుతోంది.



అనంతనాగ్‌లో భద్రతా దళాల తనిఖీలు



ఉగ్రదాడికి వ్యతిరేకంగా కశ్మీర్‌లో స్థానికుల నిరసన ప్రదర్శన

మతం అడిగి మారణకాండ

పేర్లు అడిగి, ఖురాన్ సూక్తులు చెప్పించి..
ముస్లింలు కాదని నిర్ధారించుకుని మరీ కాల్చివేత
హిందువులు, పురుషులే లక్ష్యంగా ఉగ్రవాదుల దాడి

రక్తపు మడుగులు, ఆ మడుగుల్లో అక్కడక్కడా మృతదేహాలు.. ఆ మృతదేహాల పక్కన రక్తంతో తడిచి, విషణ్ణ వదనంతో కూర్చున్నవారు కొందరు.. అయినవారిని తమ కళ్ల ముందే ఎవరో తుపాకీతో కాల్చేస్తే చూసి గుండెలవిసేలా ఏడుస్తున్నవారు మరికొందరు. భయ్యా.. నా భర్తను కాపాడండి.. దయచేసి సాయం చేయండి, మమ్మల్ని రక్షించండి.. అని చేతులు జోడించి వేడుకుంటున్న వారు ఇంకొందరు.. హనీమూన్‌కు వచ్చి భర్తను కోల్పోయి రోదిస్తున్న నవవధువు ఓ వైపు ఉంటే.. తండ్రి చావుని చూసి రోదిస్తున్న కుమార్తె మరో వైపు.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం రక్తధారలతో తడిచిన పచ్చికబయళ్లలో కనిపించిన హృదయ విదారక పరిస్థితి ఇది. ఎక్కడి నుంచో హఠాత్తుగా వచ్చిన ఉగ్రవాదులు.. హిందువులు, మరీ ముఖ్యంగా పురుషులే లక్ష్యంగా కాల్పులు జరిపారు. పేర్లు, మతం అడిగి.. ఖురాన్‌లోని సూక్తులు పలికించి.. మతాన్ని నిర్ధారించుకుని మరీ తలపై తుపాకీలు పెట్టి కాల్చిపారేశారు. ఇదంతా ఎందుకు జరిగిందో ? వారు చేసిన తప్పేంటో? ప్రాణాలు కోల్పోయిన వారికి తెలియదు. ఇక, అయినవారిని కళ్ల ఎదుటే కోల్పోయిన వారి ఆవేదనలు హృదయాలను కలచి వేస్తుండగా.. అందాల కశ్మీరం రక్తకన్నీరు పెట్టింది.

ఖురాన్ సూక్తులు పలికించి మా నాన్నని కాల్చేశారు..

"ఖురాన్‌లో ఏవో మాటలను సరిగ్గా పలకలేకపోయేసరికి మా నాన్న తలపై తుపాకీతో కాల్చేశారు. ఆ తర్వాత చెవి భాగంలో, వీపుపైనా కాల్చేశారు" ఉగ్రదాడిలో తండ్రి చావును కళ్లారా చూసిన పుణెకు చెందిన అస్వారి(26) అనే యువతి కన్నీటిపర్యంతమవుతూ చెప్పిన మాటలివి. అస్వారి కథనం ప్రకారం.. పుణెకు చెందిన సంతోష్ జగదలే దంపతులు, వారి కుమార్తె అస్వారి మరో ఇద్దరు కలిసి కశ్మీర్ పర్యటనకు వచ్చారు. కాల్పుల శబ్దం వినగానే వీరంతా సమీపంలోని ఓ గుడారంలోకి వెళ్లి నేలపై పడుకున్నారు. కాసేపటికి ఆ గుడారం వద్దకు వచ్చిన ఉగ్రవాదులు.. చౌదరి గారు బయటికి రండి అంటూ బెదిరించగా వారంతా బయటికి వచ్చారు. అనంతరం ప్రధాని మోదీని దూషించిన ఉగ్రవాదులు.. ఖురాన్‌లోని కొన్ని మాటలు పలకమని అస్వారి తండ్రిని ఆదేశించారు. ఆ మాటలు చెప్పలేకపోయే సరికి ఉగ్రవాదులు ఆయన్ను కాల్చేశారు. అనంతరం వారితో ఉన్న మరో వ్యక్తిని కూడా ఉగ్రవాదులు హతమార్చారు.

ప్రాణభయంతో ఉరుకులు పరుగులు

ఉగ్రదాడి మొదలైన తర్వాత ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఘటనాస్థలిలో ఉన్న స్థానికులు, పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రాణభయంతో ఉరుకులు పరుగులు పెట్టారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు గాయాలపాలయ్యారు. అయితే, ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్న నాగ్‌పూర్‌కు చెందిన దంపతులు తమకు ఎదురైన భయానక అనుభవాన్ని విలేకరులకు వెల్లడించారు. ఉగ్రదాడి మొదలవ్వడానికి సరిగ్గా 20 నిమిషాల ముందు తాము ఘటనాస్థలి నుంచి దూరంగా వచ్చి ప్రాణాలతో బయటపడ్డామని పేర్కొన్నారు. ఇక, పరుగెత్తే క్రమంలో కాలు విరిగి ఆస్పత్రిపాలైన అతని భార్య విలేకరులతో మాట్లాడుతూ.. కాల్పులు జరుగుతున్నాయి, పారిపోండి.. అంటూ జనం కేకలు పెడుతూ పరుగెత్తారని, చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రాణభయంతో అందరూ పరుగులు తీశారన్నారు.

అమరావతిలో క్వాంటమ్ విలేజ్

- దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు.. 50 ఎకరాల్లో నిర్మాణం
- టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ ప్రతినిధులతో అధికారుల భేటీ

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా అమరావతి మారడానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ విలేజ్‌ను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. హైటెక్ సిటీని తలదన్నేలా ఐకానిక్ క్వాంటమ్ కంప్యూటింగ్ విలేజ్‌ను రాజధానిలో నిర్మించేందుకు రాష్ట్ర ఐటీ శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. మంగళవారం వెలగపూడి సచివాలయంలో రియల్‌టైమ్ గవర్నెన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎంఓ కార్యదర్శి ప్రద్యుమ్న, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన 50 ఎకరాల్లో క్వాంటమ్ విలేజ్ ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఈ విలేజ్ నిర్మాణంలో అత్యంత కీలకమైన ఐకానిక్ భవన నిర్మాణ డిజైన్‌ను అందించడానికి ఎల్అండ్‌టీ సంస్థ ముందుకొచ్చింది. అవసరమైన అత్యాధునికమైన కంప్యూటర్ సిస్టమ్‌లను ఐబీఎం అందించనుంది. ఇక్కడే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్టేట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ క్వాంటమ్ విలేజ్ దేశానికే గుర్తింపు తెచ్చే సాంకేతిక విజ్ఞాన కేంద్రంగా మారుతుందని అధికారులు చెప్పారు. ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ విలేజ్ పనులు వేగవంతం చేయాలని ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో 'గ్లాడియేటర్' పాలన

- 'ఒక' మనిషిని ఇరికించేందుకు దొంగ సాక్ష్యాల సృష్టి
- సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ అరెస్టు పరాకాష్ఠ: పీఏసీలో జగన్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో 'గ్లాడియేటర్' పాలన సాగుతోంది. చరిత్రలో తొలిసారి 'ఒక' మనిషిని ఇబ్బంది పెట్టేందుకు, ఇరికించేందుకు దొంగ సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయడం దానికి పరాకాష్ఠ" అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జగన్ అధ్యక్షతన ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగన్ మాట్లాడారు. "కూటమి వైసీపీ మీద బురద జల్లుతోంది. దుర్మార్గంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. రోమన్ రాజుల కాలంలో గ్యాలరీల్లో ప్రజలను పెట్టి, బరిలోకి గ్లాడియేటర్‌లను(మల్లయోధులు) వదిలి మనుషులను చంపుకునే పోటీలను పెట్టేవారు. వినోదం పేరుతో రోజుకో దుర్మార్గమైన ఆట పెట్టి, ప్రజలను అందులో మునిగేలా చేసేవారు. అదే తరహాలో ఏదైనా ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్య బయటకు వచ్చిందంటే వెంటనే చంద్రబాబు డైవర్ట్ చేస్తున్నాడు. ఏమీ లేకపోతే నామీద ఎవరో ఒకర్ని తీసుకువచ్చి మాట్లాడిస్తున్నారు. లేకపోతే ఎవరో ఒకర్ని అరెస్టు చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక భయాన్ని సృష్టించేందుకే చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక మనిషిని ఇరికించేందుకు అనేక మందిని భయపెడుతున్నారు, ప్రలోభపెడుతున్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. ఈ రాష్ట్రం ఎటువెళ్తుందో అర్థం కావడంలేదు. కేసులకు భయపడటం లేదు. కేసులు పెట్టి జైలుకు పంపించినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచి వేయలేరు. ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, పన్నాగాలు తాత్కాలికమే. ప్రజలకు చేసిన మంచి ఆయా కుటుంబాల్లో బతికే ఉంది. చంద్రబాబుపై వ్యతిరేకతను కప్పిపుచ్చడానికి వాళ్ల మీడియా ప్రయత్నిస్తోంది. కాని, వైసీపీకి మీడియా సపోర్టు లేదు. వైసీపీ యుద్ధ వాతావరణంలో పుట్టింది. రానున్న ఆరు నెలల్లో సంస్థాగతంగా కమిటీలను వేస్తాం. పార్టీకి దిశానిర్దేశం చేస్తాం' అని జగన్ అన్నారు.

వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ సస్పెన్షన్

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై పార్టీ అధ్యక్షుడు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నోటి దురుసు నేతగా, వివాదాస్పద ఎమ్మెల్సీగా దువ్వాడ జిల్లాలో గుర్తింపు పొందారు. దివ్వెల మాధురితో సంబంధం నేపథ్యంలో రచ్చకెక్కిన కుటుంబ వివాదాలు దువ్వాడ ఇమేజ్‌ను మరింత మసకబార్చాయి. ఆమేరకు పార్టీపై కూడా ప్రభావం పడింది. జిల్లాలో పార్టీ పూర్తిగా నష్టపోయిన ఏడాది తర్వాత అధిష్ఠానం కళ్లు తెరిచి, దువ్వాడను నుంచి సస్పెండ్ చేసింది.

ప్రతి శుక్రవారం నియోజకవర్గ గ్రీవెన్స్: పల్లా

తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు తమ తమ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ప్రజావినతుల స్వీకరణ(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఇకపై ప్రతి శుక్రవారం నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బుధవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఇకపై శుక్రవారం నిర్వహించాలన్నారు.

ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం: నిమ్మల

విజయనగరం కలెక్టరేట్, శ్రీకాకుళం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించారు. ఆనందపురంలో బ్యారేజ్ పనులను, తారకరామ తీర్థసాగర్ పనులను, శ్రీకాకుళం జిల్లాలోని మదనగోపాల సాగర్‌ను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. విజయనగరంలోనూ, సిక్కోలులో మరో మంత్రి అచ్చెన్నతో కలసి మీడియాతో మాట్లాడారు. 'పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. పోలవరం ఎడమ కాలువ నిర్మాణాన్ని ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేసి, గోదావరి-వంశధార నదుల అనుసంధానంతో ఉత్తరాంధ్రకు సాగు నీరందిస్తాం. ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులనూ పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం' అని నిమ్మల చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, పూసపాటి అదితిగజపతిరాజు, కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశవ్యాప్తంగా పది ప్రాంతాల్లో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) భావిస్తోంది. విశాఖపట్నంతోపాటు పుణె, మనేసర్, కొల్లం, సూరత్, భువనేశ్వర్, అసాన్సోల్, నాగపూర్, పాండునగర్, మర్గావ్‌లలో ఈ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం తెలిపారు.

'ఆడుదాం.. కోట్లాట' అపర్ణ ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు.. ఆమె బ్యాంకు ఖాతాల్లో కోట్లలో నగదు

నందిగామ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం- కోట్లాట' కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నందిగామకు చెందిన అపర్ణ అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేశారు. మంగళవారం సాయంత్రం ఆమె తన నివాసంలో ఎలుకల మందు తిన్నారు. దీంతో ఆమె భర్త హుటాహుటిన నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. పూర్వాపరాల్లోకి వెళితే.. కొద్దిరోజుల క్రితం శాప్‌లో డీఈగా పని చేస్తున్న సిద్ధయ్య, ఆయన అనుచరులు తన ఇంటిపై దాడి చేశారంటూ అపర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై దర్యాప్తు జరుపుతున్న తరుణంలో ఆమె బ్యాంకు ఖాతాలో కోట్లాది రూపాయల లావాదేవీలు బయటపడ్డాయి. ఈ క్రమంలోనే ఆడుదాం-ఆంధ్రాలో కార్యక్రమంలో జరిగిన స్కామ్‌కు సిద్ధయ్యకు సంబంధాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. పోలీసులు ఆమె ఫిర్యాదుపై విచారణ చేస్తూనే ఆడుదాం- ఆంధ్రా కుంభకోణంపైనా దృష్టి సారించారు. ఆమె ఆస్తులపై నందిగామ సీఐ నాయుడు ఆరా తీశారు. ఆమె బ్యాంకు ఖాతాలు, స్థిరాస్తుల డాక్యుమెంట్లు సేకరించారు. ఆమె బ్యాంకు ఖాతాలకు ఎవరెవరి నుంచి డబ్బు వచ్చిందన్న ఆధారాలు సేకరించారు. అపర్ణ ఖాతాలకు సిద్ధయ్య, ఆయన స్నేహితుల నుంచి సొమ్ము వచ్చినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ కేసు వివరాలను సిద్ధం చేసి, ఫైలును ఏసీబీకి పంపే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో అపర్ణ ఆత్మహత్యాయత్నం చేయడంతో కలకలం రేగింది. కాగా, అది తన తండ్రి ఉద్యోగం ద్వారా సంపాదించిన సొమ్ము అని, ఆ సొమ్మును వడ్డీలకు ఇచ్చామని అపర్ణ పోలీసులకు తెలిపారు. ఆడుదాం కేసుకు, ఈ సొమ్ముకు సంబంధం లేదని చెప్పారు. తనపై పత్రికలు, మీడియా చానళ్లు తప్పుగా కథనాలు ప్రచురిస్తున్నాయని ఆరోపించారు.

అమరావతిలో 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం!?

డీపీఆర్ తయారీకి కన్సల్‌టెంట్ కోసం టెండర్లు

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు భారీ విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) అధికారులు మంగళవారం దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) నివేదిక కోరుతూ కన్సల్‌టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. నీరుకొండపై ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల కిందట మునిసిపల్ మంత్రి పి.నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి గుజరాత్ పర్యటనలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించారు. అమరావతిలో కూడా ఇదే విధమైన విగ్రహాల ఏర్పాటు కోసం అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. కాగా, డీపీఆర్ వచ్చిన తర్వాతే ఎన్టీఆర్ విగ్రహం ఎత్తుపై పూర్తి స్పష్టత రానుంది. ప్రాథమిక అంచనాల మేరకు 600 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో నీరుకొండ ఎత్తు 300 అడుగులు ఉంటుంది. దీని మీద 100 అడుగుల ఎత్తులో బేస్‌ను నిర్మిస్తారు. ఈ బేస్‌లోనే ఎన్టీఆర్ మెమోరియల్ హాల్, ఎన్టీఆర్ మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్రను తెలుసుకునేలా కళాఖండాలు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్ ఉంటాయి. ఈ బేస్ పైన 200 అడుగుల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. ఎన్టీఆర్ విగ్రహం పాదాల చెంతకు వెళ్లటానికి వీలుగా ఎస్కలేటర్లు కానీ, బేస్ కింద నుంచి లిఫ్ట్ మార్గాలలో చేరుకునేలా ఏర్పాట్లు చేస్తారు.




కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు, రామ్మోహన్, పెమ్మసాని తదితరులు


కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన రామ్మోహన్


కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు

అమరావతికి మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబు.. మంగళవారం అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్ర ప్రాజెక్టులు, పథకాల గురించి చర్చించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబును అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక నిర్ణయాలతో రాజధాని నిర్మాణం ఐదేళ్లు వెనక్కు వెళ్లిందని, ఈ పరిస్థితిని సరిదిద్ది ఏపీ ప్రజలకు ఒక భవ్యమైన రాజధానిని త్వరితగతిన నిర్మించేందుకు కేంద్రం పూర్తి మద్దతునివ్వాలని కోరారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు గత 10 నెలల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన అమిత్ షాకు వివరించారు. కాగా, జగన్ హయాంలో పెద్దఎత్తున జరిగిన మద్యం కుంభకోణం గురించి కూడా చంద్రబాబు ఆయనకు వివరించినట్టు తెలిసింది. దీనితో పోలిస్తే ఢిల్లీ మద్యం కుంభకోణం చాలా చిన్నదని, దాని ద్వారా వచ్చిన అక్రమ ఆదాయాన్ని అనేక రకాలుగా మళ్లించారని ఆయన చెప్పినట్టు సమాచారం.

కేంద్ర మంత్రులతో భేటీ

జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్ర నిధుల మంజూరుపై కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు చర్చించారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సాయం చేయాలని కోరారు. అదేవిధంగా కేంద్ర అటల్ భూజల్ యోజనపైనా కేంద్రమంత్రితో చర్చించారు. భూగర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, ఈ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సీఎం సమావేశమయ్యారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కాగా, ఏపీలోని ఆక్వా రైతులను ఆదుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమెరికా సుంకాల కారణంగా ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చించారు. సీఫుడ్‌పై విధించిన 26శాతం సుంకాలు ఆక్వా రంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని వివరించారు. అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు టీడీపీ ఎంపీలు ఉన్నారు.

కేంద్రమంత్రి మేఘవాల్ ఇంట్లో 'సైకిల్'పై చర్చ

టీడీపీ ఎంపీ అప్పలనాయుడుపై ప్రశంసల వర్షం

సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో సైకిల్‌పై ఆసక్తికర చర్చ జరిగింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఇంట్లో సైకిల్ బొమ్మను గమనించిన ఎంపీ అప్పలనాయుడు.. టీడీపీ చిహ్నాన్ని కేంద్ర మంత్రి ఇంట్లో చూడడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కలుగజేసుకుని.. మేఘవాల్ ఒకప్పుడు పార్లమెంటుకు సైకిల్‌పైనే వెళ్లేవారని చెప్పారు. ఈ సమయంలో చంద్రబాబు కలుగజేసుకొని.. 'మన అప్పలనాయుడు కూడా ప్రమాణ స్వీకారం రోజు నుంచి ఈరోజు వరకు సైకిల్‌పైనే పార్లమెంటుకు వెళ్తున్నారు. కాలుష్య నియంత్రణ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందనీయం. అప్పలనాయుడు ఒక నిజమైన సమాజ సేవకుడు' అని ప్రశంసించారు. అప్పలనాయుడు సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్తుండగా తాను కూడా చూశానని, అది గొప్ప పని అని మేఘవాల్ సైతం కొనియాడారు.

జూన్‌లో 3 లక్షల ఇళ్లకు ప్రారంభోత్సవాలు!

- రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. జూన్ 12 నాటికి ఏడాది పాలన పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేందుకు రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి ఫిబ్రవరి ఒకటో తేదీనే 1.14లక్షల ఇళ్లకు సామూహిక ప్రారంభోత్సవాలు చేయించాలని ముహూర్తం నిర్ణయించింది. అయితే, అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌తో దాన్ని వాయిదా వేశారు. ఈలోగా రాష్ట్రంగా వివిధ దశల్లో నిలిచిపోయిన మరో 1.70 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. మరో 60 వేల ఇళ్లను కూడా జూన్‌లోపే పూర్తి చేసేందుకు అవకాశం ఉండటంతో ఆ మేరకు పనులు వేగవంతం చేశారు. మొత్తంగా జూన్ లోపు 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి వాటికి సామూహిక ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇంకా సొంత గూడులేని అర్హులైన పేదలను గుర్తించి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేసి.. వాటిలో నాణ్యమైన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే సర్వే ప్రారంభించింది.

అదనపు సాయంతో గృహనిర్మాణానికి ఊపు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభమై వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తాజాగా రూ.300 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ కింద రూ.1.87 లక్షలు కాకుండా ప్రభుత్వ పూచీకత్తుతో స్వయం సహాయక సంఘాల ద్వారా మరో రూ.35 వేల రుణాన్ని అందించేలా చర్యలు తీసుకుంది. ఇదికాకుండా మరో అడుగు ముందుకు వేసి ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఈ అదనపు సాయం అందించేందుకు మరో రూ.202 కోట్లు విడుదల చేసింది.

టీడీపీ నేత దారుణ హత్య

ఒంగోలులో తన కార్యాలయంలో ఉన్నప్పుడే దుండగుల దాడి



ఒంగోలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో ప్రముఖ టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి (47)ని గుర్తుతెలియని వ్యక్తులు కిరాతంగా హత్య చేశారు. ఆయన మంగళవారం రాత్రి 7.45 గంటల సమయంలో ఒంగోలులోని తన వ్యాపార కార్యాలయంలో ఉన్న సమయంలో నలుగురు దుండగులు ప్రవేశించి కత్తులతో విచక్షణా రహితంగా 38 సార్లు పొడిచారు. చివరగా గొంతు కోశారు. వచ్చిన దుండగులు 2 నిమిషాల్లోనే హత్య చేసి పరారయ్యారు. వీరయ్యను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అందిన సమాచారం మేరకు.. ఒంగోలు మంగమూరు రోడ్డు సర్కిల్‌కు సమీపంలో ఉన్న భవనంలోని రెండో అంతస్తులో వీరయ్య వ్యాపార కార్యాలయం ఉంది. అందులో మంగళవారం సాయంత్రం ఆయన ఒక్కరే కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో రెండు మోటారు సైకిళ్లపై వచ్చిన నలుగురు దుండగులు మెట్ల మీదుగా పైకి వెళ్లి వీరయ్య గదిలోకి ప్రవేశించి తలుపులు మూసేశారు. ఆ వెంటనే కత్తులతో ఆయన మెడ మీద, గుండెలపైన విచక్షణా రహితంగా పొడిచారు. తర్వాత నలుగురూ మోటారుసైకిళ్లపై గుంటూరు వైపు పరారయ్యారు. వీరయ్య గది పక్కనే మరో గదిలో ఉన్న వ్యక్తి ఈ ఘటనను గుర్తించి వెంటనే కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వీరయ్యను సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి రిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుండగులను పట్టుకునేందుకు వెంటనే రంగంలోకి దిగారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. పోలీసు జాగిలాన్ని రంగంలోకి దింపారు. కాగా, ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుకు విషయం తెలిసిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. వెంటనే ఒంగోలు వెళ్లాలని మంత్రులు వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికి ఆదేశించారు. సీఎంతో పాటు వ్యక్తిగత పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ కూడా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం ఆదేశాలతో ముందస్తుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలు వచ్చి పార్టీ నేతలతో సమీక్షించారు. అలాగే హోంశాఖ మంత్రి అనిత.. సీఎం ఆదేశాలతో మంగళవారం అర్ధరాత్రి ఒంగోలు చేరారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకు చేరుకుని అంతిమయాత్రలో పాల్గొంటారని తెలిసింది. అయితే అధికారికంగా కార్యక్రమం ఖరారు కాలేదు. కాగా, వీరయ్య హత్యకు గురైన విషయం తెలియగానే అతని మేనమామ, మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు గుండెపోటుకు గురయ్యారు. టీడీపీలో 1994 నుంచి వీరయ్య చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో ఆయన నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేశారు. అమ్మనబ్రోలులో ముందస్తు జాగ్రత్తగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.


నిత్యం రద్దీగా ఉండే అనంతపురం టీవీ టవర్ రోడ్డు నిర్మానుష్యంగా...

భగ్గుమన్న భానుడు

రాష్ట్రవ్యాప్తంగా ఠారెత్తించిన ఎండలు


- అనేక చోట్ల 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా నంద్యాల జిల్లాలో 43.9, కడపలో 43.8 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రోహిణి రాకముందే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు, వడగాల్పులు అనూహ్యంగా పెరిగాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నమోదుకానంత అత్యధిక ఉష్ణోగ్రతలు మంగళవారం పలు ప్రాంతాల్లో నమోదయ్యాయి. అత్యధికంగా నంద్యాల జిల్లా దొర్నిపాడులో 43.9, కడప జిల్లా సిద్ధవటంలో 43.8, కడప నగరంలో 43.8, కర్నూలులో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆళ్లగడ్డలో 43.76, కోసిగి మండలం సాతనూరులో 43.5, పాణ్యం మండలం గోనవరంలో 43.34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అన్నమయ్య జిల్లా వతలూరులో 42.9, ప్రకాశం జిల్లా పెద్దడోర్నాలలో 42.8, పల్నాడు జిల్లా నర్మలపాడులో 42.4, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 195 ప్రాంతాల్లో 40 డిగ్రీలపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. 5 మండలాల్లో తీవ్రంగా, 18 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. బుధ, గురువారాల్లో ఎక్కువ మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

ఎండదెబ్బకు ఒక్క ప్రాణమూ పోకూడదు

- వడగాలి మృతులకు 4లక్షల పరిహారం: హోంమంత్రి అనిత



అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాతావరణ మార్పులకు తగ్గట్టు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ వేసవిలో వడదెబ్బకు ఏ ఒక్క ప్రాణం పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్దేశించారు. వడదెబ్బకు మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.4లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వేసవి వాతావరణ పరిస్థితులపై మంగళవారం తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు. వడగాడ్పులు, రానున్న వర్షాకాలానికి సంసిద్ధతపై రెవెన్యూ, పోలీస్, ఫైర్, విపత్తుల నిర్వహణ తదితర శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ 'ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులంతా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎండలు, వడగాడ్పుల ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామస్థాయిలో 'ఆపదమిత్ర'లకు సీపీఆర్ సహా అన్ని అంశాలపై శిక్షణ ఇచ్చి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలి' అని అధికారులను ఆదేశించారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు పురపాలక శాఖ డైరెక్టర్ సంపత్ తెలిపారు. వడదెబ్బ బారిన పడిన వారి కోసం 5,145 పడకలు, 768 అంబులెన్స్‌లు సిద్ధం చేసినట్లు వైద్య అధికారులు చెప్పారు. సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఎండీ కూర్మనాథ్, ఈడీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

డిస్కమ్‌ల నష్టాలకు ప్రైవేటీకరణే పరిష్కారం కాదు

డిస్కమ్‌ల బలోపేతంపై నెలాఖరుకు ముసాయిదా: మంత్రి యశోనాయక్

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా సంక్షోభంలో చిక్కుకుంటున్న విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లను కాపాడుకోవాలంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమే పరిష్కారం కాదని కేంద్ర పునరుద్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ అధ్యక్షతన జరిగిన నాలుగో రాష్ట్రాల ఇంధన శాఖా మంత్రుల సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వాలు సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవాలంటే.. కరెంటు కొనుగోలు వాస్తవ వ్యయాన్ని డిస్కమ్‌లు రాబట్టుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయడంపై ఈ నెలాఖరులోగా ముసాయిదా నివేదికను వెలువరిస్తామని యశోనాయక్ వెల్లడించారు. ధనికుల్లో 15శాతం మంది దాకా విద్యుత్తు చార్జీలు చెల్లించడం లేదని.. ఇదే సమయంలో రైతులు.. పేదవారు సకాలంలో బిల్లులు కట్టకపోతే వెంటనే విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నారని సమావేశం అసహనం వ్యక్తం చేసింది. ధనికులు ఛార్జీలు చెల్లించకపోతే వారికీ తక్షణం విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వ కార్యాలయాలు.. స్థానిక సంస్థలు విద్యుత్తు ఛార్జీలు చెల్లించడం లేదని.. వీటివల్ల డిస్కమ్‌లకు వచ్చే నష్టాలు గణనీయంగా పెరిగిపోతున్నాయని పేర్కొంది. విజయవాడ వేదికగా డిస్కమ్‌ల బలోపేతంపై కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, కేంద్ర ఇంధన శాఖ (విద్యుత్తు సంస్థల సంస్కరణల విభాగం) సంయుక్త కార్యదర్శి శంశాంక్ మిశ్రా, తదితరులు హాజరయ్యారు. కాగా, రాష్ట్రంలో విద్యుత్తు రంగ బలోపేతానికి తక్షణ ఆర్థిక సాయం అవసరమని కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభ్యర్థించారు. విద్యుత్తు రంగాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పునరుత్పాదక విద్యుత్తు రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి వివరించారు. పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాల కోసం గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టుకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించండి

- ప్రభుత్వాన్ని కోరిన ఏపీఎన్జీవో నేతలు



విజయవాడ గాంధీనగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీ కమిషనర్‌ను తక్షణమే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు శివారెడ్డి, విద్యాసాగర్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, గురుకుల పాఠశాల, ప్రైవేట్ రంగ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించిన 14 డిమాండ్లతో వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. ఈ డిమాండ్లపై ఈ నెల 19న సీఎస్‌తో చర్చించామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.6,300 కోట్ల బకాయిలు చెల్లించిందని చెప్పారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు స్వేచ్ఛగా ఉన్నారని తెలిపారు. ఏపీ జేఏసీ ప్రభుత్వానికి ఇచ్చిన 14 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు, కోశాధికారి ఎ.రంగారావు, సహాధ్యక్షుడు వి.దస్తగిరిరెడ్డి, ఉపాధ్యక్షుడు డీవీ రమణ, వై.ప్రసాద్, పి.శ్రీనివాస్, జె.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్ కసిరెడ్డికి రిమాండ్

» విజయవాడ జైలుకు తరలింపు.. హోరాహోరీగా వాదనలు



మంగళవారం అర్ధరాత్రి విజయవాడ జైలు వద్ద రాజ్ కసిరెడ్డి

విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆయనను పోలీసులు విజయవాడ జైలుకు తరలించారు. సిట్ అధికారులు రాజ్ కసిరెడ్డికి మంగళవారం సాయంత్రం ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించి... ఏసీబీ కోర్టు జడ్జి భాస్కర్ రావు ముందు హాజరు పరిచారు. సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్యాణి వాదనలు వినిపించారు. "రాజ్ కసిరెడ్డి ప్రతినెలా రూ.50 కోట్ల నుంచి 60 కోట్లు ముడుపులు తీసుకునేలా మద్యం పాలసీ రూపొందించారు. ఐదేళ్లలో రూ.3250 కోట్లు లిక్కర్ కంపెనీల నుంచి కమీషన్లు తీసుకున్నారు. పేరుకు ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా ఉన్నప్పటికీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో చక్రం తిప్పారు. అప్పుడు స్పెషలాఫీసర్‌గా ఉన్న సత్యప్రసాద్, బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి వాంగ్మూలాల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. సత్యప్రసాద్‌ది ఈ రాష్ట్రం కానప్పటికీ... కన్ఫర్డ్ ఐఏఎస్ ఇప్పిస్తామని హామీ ఇచ్చి వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఇక్కడికి తీసుకొచ్చారు. ఈ కేసులో 29 మంది నిందితులున్నారు. లోతుగా విచారణ జరగాలి" అని కోరారు. ఇక... కసిరెడ్డి తరఫున మాజీ అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. 'సిట్'కు అసలు చట్టబద్ధతే లేదన్నారు. రాజ్ కసిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగి కాదని... ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం వర్తించదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం... మంగళవారం అర్ధరాత్రి దాటాక రాజ్ కసిరెడ్డికి 6వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

లిక్కర్ స్కామ్ దొంగల బట్టలు సగమే విప్పారు

» మిగతావీ విప్పేందుకు పూర్తిగా సహకరిస్తా : విజయసాయి

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ దొంగల బట్టలు (సిట్ అధికారులు) సగమే విప్పారని.. మిగతా బట్టలు విప్పేందుకు తాను పూర్తిగా సహకరిస్తానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్‌లో తనది విజిల్ బ్లోయర్ పాత్ర అని తెలిపారు. దొరికిన దొంగలు .. దొరకని దొంగలు.. ఇద్దరూ తన పేరును ఈ వ్యవహారంలో బయటకు లాగుతున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. మద్యం వ్యవహారంలో రూపాయి కూడా తాను ముట్టలేదని విజయసాయి తెలిపారు.

వంశీ రిమాండ్ మే 6 వరకూ పొడిగింపు

విజయవాడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు రిమాండ్‌ను వచ్చే నెల ఆరో తేదీవరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలిచ్చారు.

వైసీపీ కార్యకర్త కృష్ణవేణికి రిమాండ్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త పాలేటి కృష్ణవేణికి వచ్చే నెల 5 వరకు రిమాండ్ విధిస్తూ నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవళిక మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామానికి చెందిన ఆమె ఈ నెల 11న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రదర్శనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ చిత్రపటాలపై చెప్పులతో కొట్టినట్లు మార్ఫింగ్ ఫొటోతో ఎక్స్‌లో ప్రచారం చేయడంపై నరసరావుపేట బరంపేటకు చెందిన రేషన్ డీలర్ విష్ణు నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పీఎస్సార్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఐదేళ్ల కిందట పీఎస్సార్ ఆంజనేయులు 2.20 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అందులోనే ఫామ్‌హౌస్ నిర్మించుకుని అక్కడే నివసిస్తున్నారు. పీఎస్సార్ కోసం సోమవారం సాయంత్రమే సీఐడీ బృందాలు విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లాయి. అయితే... పోలీసులు చేరుకునే సమయానికి ఆయన ఫామ్‌హౌస్‌లో లేరు. హైదరాబాద్ నగరంలోని కుందన్‌బాగ్‌లో ఉన్న వియ్యంకుడి ఇంటికి చేరుకున్నారు. దీంతో సీఐడీ అధికారులు మంగళవారం ఉదయం అక్కడికే వెళ్లి పీఎస్సార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను అక్కడి నుంచి మొయినాబాద్ ఫార్మ్ హౌస్‌కు తీసుకెళ్లి... సోదాలు నిర్వహించారు. అక్కడ కొన్ని పత్రాలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పీఎస్సార్‌ను అరెస్టు చేస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి... మధ్యాహ్నానికి విజయవాడ కానూరులో ఉన్న సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించి విచారించారు. ఆయనకు బుధవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి... కోర్టులో హాజరు పరచనున్నారు.


మొయినాబాద్ మండలం అమడాపూర్‌లోని పీఎస్సార్ ఫాంహౌస్

ఇదీ కేసు నేపథ్యం...

జగన్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌ను ముంబైలో నమోదైన కేసు నుంచి బయటపడేసేందుకు అప్పట్లో భారీ స్కెచ్ వేశారు. ఆయనపై ఫిర్యాదు చేసిన నటి కాదంబరి జత్వానీని బెదిరించి దారికి తెచ్చుకుని... కేసు వాపస్ చేసుకునేలా స్కెచ్ గీశారు. ఇందులో... కీలకపాత్ర అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులుదే! ఆయన ఆదేశాల మేరకు అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీ కదిలారు. వ్యూహాత్మకంగా... జత్వానీపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేత ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే పోలీసులు ముంబైకి విమాన టికెట్లను బుక్ చేసుకున్నారు. ఇదేదో జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యమున్న కేసులాగా... ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీయే నేరుగా ముంబైకి వెళ్లి జత్వానీని అదుపులోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాదంబరి జత్వానీ తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. కుక్కల విద్యాసాగర్, పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ, అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్యనారాయణ, పశ్చిమ జోన్ ఏసీపీ హనుమంతరావుతోపాటు మరి కొంతమందిపై ఐపీసీ 192, 211, 218, 220, 354(డి), 467, 420, 471 రెడ్ విత్ 120(బి), ఐటీ యాక్ట్66(ఎ) సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ తర్వాత ఐపీసీ 193, 195, 166, 166(ఎ), 167, 342 రెడ్‌విత్ 34 సెక్షన్లను కూడా చేర్చి... సీఐడీకి బదిలీ చేశారు. కాంతి రాణా, విశాల్‌గున్నీ, హనుమంత రావు, సత్యనారాయణ తమపై కేసు కొట్టివేయాలని హైకోర్టులో ఇప్పటికే పిటిషన్లు దాఖలు చేశారు.

నాకేం సంబంధం?

కాదంబరి 'బ్యాడ్ లేడీ'.. సీఐడీ విచారణలో పీఎస్సార్

కాదంబరి జెత్వానీ అక్రమ అరెస్టుతో తనకేమీ సంబంధం లేదని పీఎస్సార్ ఆంజనేయులు పేర్కొన్నట్లు తెలిసింది. సీఐడీ కార్యాలయంలో ఆయనను మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 వరకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ప్రశ్నించారు. "జెత్వానీ బ్యాడ్ లేడీ. ఆమె అరెస్టు అప్పుడు నేను ఇంటెలిజెన్స్ చీఫ్‌ను. నాకు ఈ కేసుతో ఏం సంబంధం? ఇది లోకల్ పోలీసులకు సంబంధించిన కేసు. నన్ను ఎందుకు అరెస్టు చేశారు" అని ఎదురు ప్రశ్నించినట్లు సమాచారం.

అరెస్టు చేసినా అదే బాసిజం

» నిందితుడు పీఎస్సార్‌పట్ల పోలీసుల 'ఉదారత'

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీఎస్సార్ ఆంజనేయులు సీనియర్ ఐపీఎస్ అధికారే కావొచ్చు. కానీ...ఆయన ఇప్పుడు నిందితుడు! కానీ... పోలీసులు మాత్రం ఆయనను 'ఎంతో జాగ్రత్తగా... మర్యాదగా' చూసుకున్నారు. సెల్యూట్ కొట్టడమొక్కటే తక్కువ. సాధారణంగా... నిందితులను పోలీసు వాహనంలోనే తరలిస్తారు. కానీ... పీఎస్సార్ విషయంలో మాత్రం అత్యంత మర్యాదగా నడుచుకున్నారు. 'సార్... వచ్చి కార్లో కూర్చుంటారా' అని వినయంగా పిలిచారు. 'ఆగండి స్నానం చేసి, రెడీ అయి వస్తా' అంటూ ఆయన లోపలికెళ్లి, ఆఫీసుకు వెళ్లే అధికారిలా రెడీ అయ్యారు. బ్లూ జీన్స్‌పైన వైట్ షర్ట్ టక్ చేసుకుని దర్జాగా బయటికి వచ్చారు. అప్పటి దాకా వేచి చూసిన సీఐడీ అధికారులు కారు డోరు తీసి... 'రండి సార్' అంటూ ముందు సీటులో జాగ్రత్తగా కూర్చోబెట్టారు. ఇక... విజయవాడలో సీఐడీ కార్యాలయానికి వచ్చిన పీఎస్సార్... నిందితుడిలా కాకుండా కారు దిగి వాటర్ బాటిల్ చేతిలో పట్టుకుని కార్యాలయాన్ని తనఖీ చేసేందుకు వచ్చిన అధికారిలా దర్పం ప్రదర్శించారు.

అప్పుడు ఇలా...

విపక్ష నేతగా ఉన్న చంద్రబాబును జగన్ హయాంలో అర్ధ రాత్రి అరెస్టు చేశారు. ఏ కేసు పెట్టారో తెలియదు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పలేదు. 'మాతో రావాల్సిందే' అంటూ ఏడుపదుల వయసున్న చంద్రబాబును రాత్రికి రాత్రి రోడ్డు మార్గంలో నంద్యాల నుంచి విజయవాడకు తరలించారు. విజయవాడ సీఐడీ కార్యాలయంలో సాధారణ చెక్క కుర్చీలో గంటల కొద్దీ కూర్చోబెట్టారు. దాదాపు మూడు రోజులు ఆయనకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు ఈ తతంగం మొత్తం నడిపించినట్లు అధికారులు చెబుతారు. ఇక... అచ్చెన్నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నా, ఆపరేషన్ చేయించుకుని కొన్ని రోజులే అయినా... పన్నెండు గంటలపాటు కార్లో కూర్చోబెట్టి గుంటూరు దాకా తీసుకొచ్చారు. ఇక రఘురామను పుట్టిన రోజునే అరెస్టు చేశారు. సీఐడీ కార్యాలయంలో ఆయనను చిత్రహింసలకు గురి చేశారు. ఇవన్నీ గుర్తు చేస్తూ... 'పీఎస్సార్‌కు ఇన్ని మర్యాదలా' అని సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు.

జగన్ హయాంలో పీఎస్సార్ ఆంజనేయులు ఐదేళ్లలో నాలుగు కీలక పోస్టులు చేశారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు రవాణా శాఖ కమిషనర్ పోస్టు, ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్ భాస్కర్‌ను వేధించేందుకు కమిషన్ కార్యదర్శి పదవి, అచ్చెన్న అరెస్టు కోసం ఏసీబీ చీఫ్, జగన్ పొలిటికల్ అజెండా అమలుకోసం నిఘా చీఫ్ పదవులను వాడుకున్నట్లు చెబుతారు.

ఐపీఎస్ కాదు.. వైపీఎస్!

» ఐపీసీని కాదని వైసీపీకి 'సెల్యూట్'.. జగన్‌కు వీర విధేయుడిగా పీఎస్సార్

» ఐదేళ్లలో నాలుగు పోస్టులు.. టీడీపీ నేతలే టార్గెట్‌గా కేసులు

» సినీ నటిని వేధించడంలో కీలక పాత్ర

» వెంటాడిన నాటి పాపాలు.. చివరికి అరెస్టు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'యూ ఆర్ అండర్ అరెస్ట్'... అని నిందితులను అదుపులోకి తీసుకునే పోలీసు అధికారే ఇప్పుడు అరెస్టయ్యారు. కాలం కలిసొస్తే పోలీస్ బాస్ కావాల్సిన సీనియర్ ఐపీఎస్ అధికారి పెండ్యాల సీతారామాంజనేయులు అలియాస్ పీఎస్సార్ ఆంజనేయులు అరెస్టయ్యారు. చట్టానికి, రాజ్యాంగానికి విధేయుడిగా ఉండాల్సిన ఈ ఐపీఎస్ అధికారి... జగన్‌కు వీర విధేయుడిగా మారిపోయి, 'వైపీఎస్' ఆఫీసర్‌గా రూపాంతరం చెందిన ఫలితమిది! ఇప్పుడు ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో పీఎస్సార్ ఆంజనేయులు అరెస్టయ్యారు. అయితే... ఆది నుంచీ ఆయనది వివాదాస్పద చరిత్రే. కర్నూలు, గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో ఎస్పీగా పనిచేసిన పీఎస్సార్‌కు హనుమంతుడికి ఉన్నంత ధైర్యం ఉందనేవారు. అదే ధైర్యంతో విజయవాడ పోలీస్ కమిషనర్‌గా తనదైన పనితీరుతో దూసుకెళ్లారు. కానీ... ఒక మహిళ ఫోన్‌కు పంపిన సందేశాలు, ఫోన్ సంభాషణలు బహిర్గతం కావడంతో అభాసుపాలయ్యారు. ప్రస్తుతం విజయవాడ జైలులో రిమాండులో ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కారణంగా... పీఎస్సార్ ఆంజనేయులు కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. తర్వాత... 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే మళ్లీ రెక్కలుకట్టుకుని రాష్ట్రంలో వాలిపోయారు.

> కేవలం జగన్ మెప్పు కోసం... తద్వారా డీజీపీ పదవి దక్కించుకునేందుకే పీఎస్సార్ ఆంజనేయులు ఐపీసీని కాదని, 'వైసీపీ'కి జైకొట్టారనే విమర్శలున్నాయి.

శ్రుతిమించిన జగన్ భక్తి...

వైసీపీ హయాంలో పీఎస్సార్ ఆంజనేయులు పోలీసు అధికారిగాకంటే... జగన్‌కు వీరవిధేయుడిగానే ఎక్కువగా వ్యవహరించారు. ఏ పోస్టులో ఉన్నా... టీడీపీ నేతలను టార్గెట్ చేసుకోవడమే లక్ష్యంగా పనిచేశారు. ఇంకా చెప్పాలంటే... అప్పటి విపక్ష నేతలపైకి పీఎస్సార్‌ను జగన్ అస్త్రంగా ఉపయోగించారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఉండగా... ట్రావెల్ బస్సులు ఆపేసి జేసీ ప్రభాకర్ రెడ్డిని అరెస్టు చేయించారు. ఏపీపీఎస్సీ సెక్రటరీగా అదనపు బాధ్యతలు తీసుకుని అప్పటి చైర్మన్ ఉదయ్ భాస్కర్‌ను మానసికంగా వేధించారు. జగన్ హయాంలో ఏసీబీ డీజీగా బాధ్యతలు చేపట్టాక పీఎస్సార్ మరింత చెలరేగిపోయారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక మరింత రెచ్చిపోయారు. జగన్ పొలిటికల్ అజెండాను అమలు చేయడమే లక్ష్యంగా వ్యవహరించారు. 'అధినేత' ఆదేశాల మేరకు కొందరు వైసీపీ ఎమ్మెల్యేలను సైతం బెదిరించారు. తన ఫోన్ ట్యాప్ చేసి వేధింపులకు గురి చేశారంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి(అప్పట్లో వైసీపీ) కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేసిన ఉద్యోగ సంఘ నేత సూర్యనారాయణ తలకు తుపాకీ పెట్టి బెదిరించి బరితెగింపునకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి.

ఇదే మొదటిసారి...

ఐపీఎస్ అధికారిగా ముప్పై సంవత్సరాలు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డీజీపీ ర్యాంకు అధికారి విధి నిర్వహణలో కుట్రలు చేసి అరెస్టు కావడం ఇదే మొదటిసారి కావొచ్చని బ్యూరోక్రాట్లలో చర్చ జరుగుతోంది.


శ్రీలక్ష్మి బీపీ ఆచార్య కాంతి రాణా తాతా విశాల్ గున్నీ

హతవిధీ!

వైఎస్ మేళ్లకు నాడు ఐఏఎస్‌లు..

జగన్ దెబ్బకు నేడు ఐపీఎస్‌లు జైలుపాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన కుంభకోణాలకు వత్తాసు పలికిన పలువురు ఐఏఎస్ అధికారులు జైలు పాలయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో జగన్ హయాంలో వైసీపీ అరాచక పాలనకు దన్నుగా నిలిచిన పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, ఎన్. సంజయ్, కొల్లి రఘురామి రెడ్డి, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీ, పల్లె జాషువా వంటి ఐపీఎస్‌లు కటకటాలు లెక్కిస్తున్నారు. ఆనాడు ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను వేధించడం నుంచి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం, స్థానిక ఎన్నికల్లో అక్రమాలకు సహకరించడం వరకూ వారిని జగన్ దారి మళ్లించారు. వీరంతా వైసీపీ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైపీఎస్‌లుగా ముద్రపడ్డారు. ఆనక.. కూటమి ప్రభుత్వం రాగానే కేసుల్లో ఇరుక్కుపోయారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తండ్రి తమకు చేసిన మేళ్లకు కుమారుడు జగన్‌కు లబ్ధి చేకూర్చిన పలు కంపెనీలు, అందుకు సహకరించిన ఐఏఎస్‌లు ఇబ్బంది పడ్డారు. ఈ వ్యవహారంలో అప్పట్లో జగన్‌ను అరెస్టు చేసిన సీబీఐ ఏకంగా 11 అవినీతి కేసులు నమోదుచేసింది. మైనింగ్ అనుమతుల్లో అక్రమాలకు దన్నుగా నిలిచారంటూ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిని అరెస్టు చేసి జైలుకు పంపింది. చిన్న వయసులోనే ఐఏఎస్ సాధించిన ఆమెకు కేబినెట్ సెక్రటరీ అయ్యే అవకాశాలున్నాయని అంతకుముందు బ్యూరోక్రాట్లలో చర్చ జరిగేది. అటువంటి మహిళా ఐఏఎస్ అధికారి జైలు పాలవ్వడంతో ఆమె జీవితమే తలకిందులైంది. కేబినెట్ సెక్రటరీ కాదు కదా కనీసం రాష్ట్రానికి సీఎస్ అయ్యే అవకాశం కూడా దక్కలేదు. ప్రస్తుతం ఎటువంటి పోస్టింగ్ లేకుండా పదినెలలుగా ఆమె ఎదురుచూస్తున్నారు. వచ్చే ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు. మరో ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య. ఉమ్మడి రాష్ట్రంలో హోంశాఖ సెక్రటరీ హోదాలో చంచల్ గూడ జైలును సందర్శించి వచ్చిన ఆయన వారం తిరక్కుండానే అదే జైలుకు కన్నీరు పెట్టుకుంటూ వెళ్లారు. అప్పటివరకూ ఎంతో మంచి పేరున్న ఆయన వైఎస్ ప్రభుత్వంలో భూ కేటాయింపుల్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పటి మైనింగ్ డైరెక్టర్ రాజగోపాల్ సైతం జైలు పాలయ్యారు. తిరిగి జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే కథ సుమారుగా పునరావృతమైంది. అప్పటి సీఎం జగన్ మనసులో ఆలోచనల్ని పసిగట్టి అరాచకాలకు వ్యూహం రచించిన పీఎస్ఆర్, ముంబైకి చెందిన సినీ నటి కాదంబరి జత్వానీని వేధింపులకు గురిచేసే పథక రచన చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఎట్టకేలకు జైలు పాలయ్యారు. విజయవాడ మాజీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా తాతా..ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో నమోదైన ఇదే కేసులో నిందితుడిగా సస్పెన్షన్‌లో ఉన్నారు. డీఐజీ విశాల్ గున్నీ అత్యుత్సాహం చూపి ఈ కేసులో చిక్కుకున్నారు. జగన్ అరాచకాలకు కొమ్ము కాసిన పీవీ సునీల్ కుమార్ సీఐడీ ఏడీజీగా ఉన్నప్పుడు మాజీ ఎంపీ (ప్రస్తుతం ఉప సభాపతి) రఘురామ కృష్ణంరాజును హింసించిన ఆరోపణలపై కేసు నమోదవడంతో సస్పెండయ్యారు. మరో ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్ అవినీతి కేసుల్లో చిక్కుకుని సస్పెండ్ అయ్యారు. మాజీ మంత్రి విడదల రజనీ ఒత్తిడితో మైనింగ్ వ్యాపారుల్ని బెదిరించిన కేసులో పల్లె జాషువా సస్పెండయ్యారు. వెంకట రెడ్డి గనుల శాఖ డైరెక్టర్‌గా జగన్ అక్రమాలకు వత్తాసు పలికి, ఏసీబీకి చిక్కి, రెండు నెలలు జైలు పాలై బెయిలుపై విడుదలయ్యారు. మరోవైపు మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డి అరెస్టుకు పైగా అజ్ఞాతంలో ఉండి ఇటీవలే రాష్ట్రం నుంచి రిలీవై కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. జగన్ రేతపత్రికకు దోచిపెట్టేందుకే తాను ఏపీకి వచ్చినట్లు వ్యవహరించిన ఐఆర్ఎస్ అధికారి తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి ఇటీవలే విచారణకు వచ్చి వెళ్లారు.

జగన్ చెప్పారు..

నేను చేశాను!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న కుట్ర, తన పాత్ర, ఇతరుల భాగస్వామ్యంపై అన్ని అంశాలు అంగీకరించిన రాజ్ కసిరెడ్డి, చివరికి నేరాంగీకరపత్రంపై సంతకం చేసేందుకు నిరాకరించారని 'సిట్' పేర్కొంది. రిమాండ్ రిపోర్టులో ఏముందంటే...

జగన్ చెబితేనే చేశా...

ప్రభుత్వానికి, పార్టీకి బాగా నిధులు వచ్చేలా మద్యం పాలసీపై వర్కవుట్ చేసే బాధ్యతను అప్పటి సీఎం జగన్ నాకు అప్పగించారు. ఈ పాలసీ ద్వారా పార్టీకి బాగా ఫండ్ రావాలని, పథకాల అమలుకూ ఆదాయం సమకూరాలని నిర్దేశించారు. దీంతో... బేవరేజెస్ కార్పొరేషనే లిక్కర్ షాపులు ఏర్పాటు చేసి మద్యం వ్యాపారం చేసేలా కొత్త పాలసీని రూపొందించాం. ఐఆర్‌టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకొచ్చి... తొలుత బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా, ఆ తర్వాత బేవరేజెస్, డిస్టిలరీస్ కమిషనర్‌గా నియమించారు. మద్యం అమ్మకాలు, కొనుగోళ్లు, లేబుల్ రిజిస్ట్రేషన్‌లు తదితర కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ ఆయనకే దక్కేలా చూశారు. మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకునేందుకు రూపొందించిన మా ప్లాన్‌ను అమలు చేసే బాధ్యతను అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న సత్యప్రసాద్‌కు అప్పగించాం. 2023లో ఆయనకు సివిల్ సర్వీసు కోటాలో ఐఏఎస్ హోదా ఇప్పిస్తామని మాట ఇచ్చాం. మద్యం వ్యవహారంలో ప్రత్యేక అధికారిగా నియమించాం.

విజయసాయి ఇంట్లోనే...

మద్యం ముడుపుల కుట్రకు హైదరాబాద్‌లోని విజయసాయి రెడ్డి ఇంట్లోనే ప్లాన్ చేశాం. 2019 అక్టోబరు 13న విజయసాయి ఇంట్లోనే కీలక భేటీ జరిగింది. విజయసాయిరెడ్డి, పి.మిథున్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ భేటీ అయ్యాం. మద్యం ఉత్పత్తి దారులు, డిస్టిలరీస్ నుంచి నెలకు కనీసం 50-60 కోట్లు ముడుపులు వచ్చేలా స్కీమ్ రూపొందించాం. ఇందుకోసం తొలుత అబ్కారీ శాఖలో కీలకమైన సీ-టెల్ సాఫ్ట్‌వేర్‌ను తొలగించాలనుకున్నాం. ఇదే విషయాన్ని సత్యప్రసాద్‌కు చెప్పాం. సీ-టెల్ సాఫ్ట్‌వేర్‌లో మద్యం అమ్మకాలు, సరఫరా వివరాలన్నీ ఆటోమేటిక్‌గా జరిగిపోతుంటాయి. ఆయా బ్రాండ్ల మూడు నెలల అమ్మకాలు, దానిపై పది శాతం పెరుగుదలను కలిపి స్టాక్ ఇచ్చేలా ఆ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇది అమల్లో ఉంటే మా పథకం ఫలించదు. మా ప్లాన్ ప్రకారం మద్యం సరఫరాను కంప్యూటర్‌లు, ఆన్‌లైన్ డిసైడ్ చేయకూడదు. ఏ బ్రాండ్‌ను ఎంత మేరకు సరఫరా చేయాలో, రిటైల్ షాపులో ఏవి విక్రయించాలో మేమే నిర్ణయించాలి. అందువల్ల.. సరఫరాను ఆన్ లైన్‌కు బదులు ఆఫ్‌లైన్‌లో సాగేలా నిర్ణయించాం. మద్యం ఉత్పత్తి, సరఫరా, అమ్మకాలను పూర్తిగా మా నియంత్రణలోకి తెచ్చుకున్నాం.

ముడుపుల ఖరారు భేటీ...

2019 డిసెంబరులో హైదరాబాద్‌లో శరత్‌చంద్రారెడ్డి ఆస్పత్రి వీధిలోని ఓ ప్రైవేటు బంగ్లాలో నేను, మిథున్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, బేవరేజెస్ ఎండీ వాసుదేవరెడ్డి సమావేశమయ్యాం. మద్యం సీసా బేసిక్ ధర ఆధారంగానే మాకు ఉత్పత్తిదారులనుంచి ముడుపులు వచ్చేలా ఫిక్స్ చేశాం. మేం నిర్ణయించిన మద్యం ముడుపుల ప్రకారం ప్రతి నెలా కనీసం రూ.50-60 కోట్లు వచ్చేవి. మద్యం బ్రాండ్ల సరఫరా, ప్రభుత్వ షాపుల్లో లిక్కర్ అమ్మకాలపై ప్రతినెలా మాకు డేటా వచ్చేది. ఇందుకోసం అనూష, సైఫ్ అనే ఉద్యోగులను ఉపయోగించుకున్నాం. ప్రతినెలా ఐదో తేదీన కమీషన్ల లెక్కలు వేసేవాళ్లం. వీరిచ్చే డేటాను బట్టి టి. కిరణ్ కుమార్ రెడ్డి, బోనేటి చాణక్య అలియాస్ ప్రకాశ్ ఆయా కంపెనీలకు ఫోన్లు చేసేవాళ్లు. ఫోన్‌కాల్స్ కోసం వీపీఎన్ ఉపయోగించేవారు. కంపెనీలు ముడుపుల సొమ్ము ఇచ్చాక... అవి నా దగ్గరకు చేరేవి. నేను ఆ డబ్బును తిరిగి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీకి పంపించే వాడిని.

ఏ4 ఎంపీ మిథున్‌రెడ్డి

» లిక్కర్ స్కామ్‌లో నిందితులు 29 మంది

» ఏ1 రాజ్ కసిరెడ్డి, ఏ 5 విజయసాయి

అమరావతి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో మొత్తం 29 మందిని నిందితులుగా చేర్చారు. ఇందులో కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు ఉన్నాయి. ఏ1గా కసిరెడ్డి రాజశేఖరరెడ్డి(రాజ్ కసిరెడ్డి), ఏ2 బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏ3 ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.సత్యప్రసాద్, ఏ4 ఎంపీ మిథున్‌రెడ్డి, ఏ5 మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఏ6 సజ్జల శ్రీధర్‌రెడ్డి (నంద్యాల), ఏ7 ముప్పిడి అవినాశ్‌రెడ్డి (హైదరాబాద్), ఏ8 బూనేటి చాణక్య (హైదరాబాద్), ఏ9 టి.ఈశ్వర్ కిరణ్ కుమార్‌రెడ్డి (తిరుపతి), ఏ10 ఎస్‌కె.సైఫ్ అహ్మద్ (శ్రీకాళహస్తి), ఏ11 ఆల్విక్ మల్టీ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్, ఏ12 కృపాటి ఎంటర్‌ప్రైజెస్, ఏ13 నైస్నా మల్టీ వెంచర్, ఏ14 ట్రిఫర్ ఎంటర్‌ప్రైజెస్, ఏ15 విక్సో ఎంటర్‌ప్రైజెస్, ఏ16 డి-కార్ట్ లాజిస్టిక్స్, ఏ17 టెక్కర్ ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్, ఏ18 దీపక్ ఎంటర్‌ప్రైజెస్, ఏ19 విశాల్ ఎంటర్‌ప్రైజెస్, ఏ20 లావిశ్ ఎంటర్‌ప్రైజెస్, ఏ21 కీరాజ్ ఎంటర్‌ప్రైజెస్, ఏ22 అక్రోయో సర్వీసెస్, ఏ23 ఎజీలోడ్ నెట్‌వర్క్, ఏ24 బాలాజీ ట్రేడింగ్, ఏ25 అదాన్ డిస్టిలరీ, ఏ26 లీలా డిస్టిలరీ, ఏ27 న్యూమోంట్ గోల్డ్ అండ్ జ్యూవెలరీ, ఏ28 రుచిత జ్యూవెలర్స్ ఏ29 మలిష్క గోల్డ్ అండ్ జ్యూవెలరీ ఉన్నాయి.


రాజ్ కసిరెడ్డిని మంగళవారం విజయవాడలో కోర్టుకు తీసుకొచ్చిన దృశ్యం

మద్యం దోపిడీ 3200 కోట్లు!

» దోచుకునేందుకే పాలసీ మార్చారు

» ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టారు

» రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో 'సిట్'

అమరావతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): 'మద్యం పాలసీ' మార్పుతో జగన్ హయాంలో రూ.3200 కోట్ల దోపిడీ జరిగిందని ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. మద్యం ఉత్పత్తి కంపెనీలకు అయాచిత లబ్ధిని చేకూర్చి... తిరిగి వాటి నుంచే నెలనెలా ముడుపులుగా వసూలు చేశారని... ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో 'సిట్' పేర్కొంది. దర్యాప్తులో భాగంగా తాము సేకరించిన సమాచారం, లభించిన ఆధారాలు... తాము అరెస్టు చేసిన వాసుదేవరెడ్డి, రాజ్ కసిరెడ్డి, ఇతరులు ఇచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి మద్యం కుంభకోణంపై 'సిట్' ఒక స్పష్టతకు వచ్చింది. దాన్నే కసిరెడ్డి రిమాండ్ రిపోర్టులో సవివరంగా ప్రస్తావించింది. మరిన్ని వివరాలు..

కసిరెడ్డే కుట్రదారు

రూ.3200 కోట్ల దోపిడీలో నాటి జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర రెడ్డిదే కీలక పాత్ర. ఇందులో... మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్యప్రసాద్, సజ్జల శ్రీధర్‌రెడ్డి, ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీలు కూడా భాగస్వాములు. ముడుపుల ఆధారంగా మద్యం కంపెనీల సరఫరా, అమ్మకాలను శాసించారు. 2014-19లో అమలైన మద్యం పాలసీ పారదర్శకంగా ఉంది. దీని వల్ల ఆదాయం పెరిగింది. మద్యం ఉత్పత్తి బ్రాండ్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొంది. కానీ... కొత్త మద్యం పాలసీవల్ల ప్రముఖ బ్రాండ్లు ఏపీ మార్కెట్ నుంచి కనుమరుగయ్యాయి. ముడుపులిచ్చేందుకు అవి అంగీకరించకపోవడంతో సరఫరాకు ఆర్డర్లు ఇవ్వలేదు.

కసిరెడ్డి దందానే వేరు

ఎస్పీవై ఆగ్రో (డిస్టిలరీ)ను బెదిరించి దాన్ని రాజ్ కసిరెడ్డి తన నియంత్రణలోకి తీసుకున్నారు. అదాన్ డిస్టిలరీస్‌ను తీసుకురావడంలో కసిరెడ్డిదే కీలక పాత్ర. మద్యం ఉత్పత్తి కంపెనీల నుంచి తన మనుషుల ద్వారా వసూలు చేసిన ముడుపులను మిథున్ రెడ్డికి కొంత కాలం పంపించారు. ఆ తర్వాత ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీకి చేరవేశారు. వరుణ్ అనే వ్యక్తిని ముందు ఉంచి లీలా బ్రాండ్‌ను కసిరెడ్డే నిర్వహించారు. ఇంకా ఈశ్వరీ ఇన్‌ఫ్రాపై కన్నేయడంతోపాటు అనేక చోట్ల భూములు కొని పెట్టుబడులు పెట్టారు.

2022 సంవత్సరంలో మద్యం కల్తీ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం అమ్మిన మద్యం తాగి అనేక మంది అనారోగ్యానికి గురయ్యారు. కొందరు మరణించారు. దీనిపై కేసులు నమోదయ్యాయి. ఈ లిక్కర్ సిండికేట్ వల్లే ఈ దారుణాలు జరిగినట్లు ఆధారాలు నిరూపిస్తున్నాయి.

ముడుపుల ప్రవాహం ఇలా...

1) బంగారం, షేర్ మార్కెట్ ఖాతాలకు ముడుపుల సొమ్మును జమ చేసేవారు.


2) ముడుపుల సొమ్మును కొన్ని కంపెనీలు కసిరెడ్డి సూచించిన రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టాయి. మరి కొన్ని... తెలివిగా తమ రంగంలోని లిక్కర్ కంపెనీల్లోనే పెట్టుబడులు పెట్టాయి.

3) వందల కోట్లలో ఉన్న ముడుపులను షెల్‌కంపెనీలకు మళ్లించారు. హవాలా మార్గంలో దేశ, విదేశాలకు దారి మళ్లించారు. ఇందులో భాగస్వాములైన వారి నెట్‌వర్క్‌కు రాజకీయ పార్టీతో ఉన్న లింకుల గురించి మరింత లోతుగా విచారణ జరుగుతోంది.

4) ముడుపుల చెల్లింపులకు ముడి సరుకు సరఫరా చేసే సంస్థలనూ వాడుకున్నారు. ఉదాహరణకు... సీసాలు, కార్టన్ బాక్సుల వంటి సరఫరా సంస్థలకు లెక్కప్రకారం కోటి రూపాయలు చెల్లించాలనుకుంటే, 15 కోట్లు ఇచ్చేవారు. కోటి ఆ కంపెనీకి, మిగిలిన 14 కోట్లు దొడ్డిదారిన కసిరెడ్డి టీమ్‌కు చేరేవి.

5) ముడుపుల సొమ్మును వ్యాపార ప్రమోషన్‌ల పేరిట దొంగ ఖాతాలకు దారి మళ్లించేలా కసిరెడ్డి ప్లాన్ చేయించారు. తమ బ్రాండ్ ప్రమోషన్ కోసం... మరో ప్రచార కంపెనీకి డబ్బులు చెల్లించినట్లు చూపేవాళ్లు. ఇందుకోసం అనేక షెల్ కంపెనీలను, నకిలీ ఇన్‌వాయిస్‌లు పుట్టించారు. అదంతా చివరికి రాజ్ కసిరెడ్డి చేతికే వచ్చేది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


WELCOME
Sir
అహోరాత్రుల తపన - అంతర్జాతీయ ఖ్యాతి
దేశం గర్వించే పాలన - ఆదర్శనీయమైన ఆలోచనా సరళి
సమకాలీన జాతీయ నాయకులకే మకుటాయమానం
క్రమశిక్షణ - కఠోర శ్రమ - సమతా భావన... సాంకేతికతకు
ఆయన నిలువెత్తు ప్రతిరూపం...అన్నిటినీ మించి అభివృద్ధికి మరోరూపం
నేడు అమరావతికి విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం - సుస్వాగతం
With Best Compliments from
NAVAYUGA
Navayuga Engineering Company Ltd.
AN ISO 9001:2015 - (QMS), ISO 14001:2015 - (EMS), ISO 45001:2018 - (OHSMS) COMPANY
Corp. Office : 379, Road No. 10, Jubilee Hills, Hyderabad - 500033,
Te:+91-40-44557789, Email: nec@navayuga.com